28-7Pg1exHMNWJQE_28-7Pg1exHMNWJQE.qxd 27/Jul/26 11:56 PM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
గుంటూరు
: fb.com/vaartha Digital
Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
28-7-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 178 పేజీలు: 12 వెల: 6.50



ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్‌లో హైదరాబాద్ షూటర్ ఈషా సింగ్‌కు స్వర్ణం
-'ఆట'లో

## ఎల్‌నినోపై రైతులకు అవగాహన పెంచండి

### ప్రత్యామ్నాయ పంటలను వివరించండి..

### ప్రజల ఆలోచనలకు అనుగుణంగా ఉద్యోగుల పనితీరు మారాలి

### ఆర్టీజీఎస్ సమీక్షలో సీఎం చంద్రబాబు



**విజయవాడ, జులై 27, ప్రభాతవార్తప్రతినిధి:** ఎల్‌నినో ప్రభావంపై రైతుల్లో అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. రాష్ట్ర సచివాలయంలో సోమవారం ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి వివిధ శాఖల పనితీరుపై సీఎం చర్చించారు. ఈ ఏడాది అంతటా ఎల్ నినో ప్రభావం చాలా ఎక్కువగా ఉంటుందని అంచనాలు వస్తున్న నేపథ్యంలో ఇప్పటికే తీసుకున్న చర్యలతో పాటు, రైతుల్లో మరింత అవగాహన కల్పించాలని సీఎం ఆదేశించారు. ఎల్ నినో ప్రభావం వల్ల ఉత్పన్నమయ్యే పరిణామాలను రైతులకు వివరించడంతోపాటు ప్రత్యామ్నాయ పంటలు వేసుకునేలా రైతులను ప్రొత్సహించాలని సూచించారు. దీని నిమిత్తం క్యాంపెయిన్ మోడ్‌లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అలాగే ఏప్రాంతాల్లో ఏయే పంట సాగు చేయాలనేదానిపై రైతులకు వివరించాలని ముఖ్యమంత్రి చెప్పారు. పంటల బీమా యాక్షన్ ప్లాన్‌ను అమలు చేయాలని సూచించారు. వరి పంటకు చివరి తేదీ 2026 ఆగస్టు 15 అని చెప్పారు. అర్హులైన రైతులు గరిష్ఠ సంఖ్యలో నమోదు అయ్యేలా సంబంధిత భాగస్వాములందరూ విస్తృత అవగాహన మరియు ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. ఖరీఫ్-2026 సీజన్‌లో రైతుల ప్రయోజనాలపై చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో వర్షపాతం లోటు పరిస్థితుల నేపథ్యంలో రైతులు ఎటువంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ రైతులకు అండగా ఉంటుందని తెలిపారు. సీజన్ సాధారణ వర్షపాతం 580.1 మి.మీ. కాగా, ప్రస్తుత తేదీ నాటికి సాధారణంగా 225.7 మి.మీ. వర్షపాతం నమోదవ్వాల్సి ఉందని, అయితే కేవలం 104.5 మి.మీ. మాత్రమే నమోదై 53.7 శాతం లోటు ఏర్పడిందని వివరించారు. మొత్తం 28 జిల్లాల్లో 21 జిల్లాలు వర్షపాతం లోట్టు కేటగిరీలో ఉన్నాయని తెలిపారు. పశ్చిమ గోదావరి, అన్నమయ్య, తూర్పు గోదావరి, విశాఖపట్నం, చిత్తూరు, ప్రకాశం జిల్లాలు కలిపి ఆరు జిల్లాలుతీవ్ర వర్షపాతం లోట్టు కేట గిరీలో ఉన్నాయని, నెల్లూరు జిల్లాలో మాత్రమే >>2



## లోక్‌సభకు 'పరీక్షల' బిల్లు

### ప్రవేశపెట్టిన కేంద్రమంత్రి జితేంద్ర సింగ్

### విపక్షాల రగడతో ఉభయసభలు నేటికి వాయిదా

**న్యూఢిల్లీ,జులై 27:** పేపర్ లీకేజీ నిరోధక బిల్లుపై చర్చించేందుకు అన్ని పార్టీలు సిద్ధంగా ఉన్నట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. అన్ని పార్టీలను ఆయన ఒప్పించినట్లు పార్లమెంటరీ వర్గాలు వెల్లడించాయి. సోమవారం కేంద్రసిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. పేపర్ లీకేజీ నిరోధక సవరణబిల్లును మంగళవారం చర్చించేందుకు అన్ని పార్టీలు అంగీకరించాయని, స్పీకర్ ఓం బిర్లా చేపట్టిన చర్యలవల్ల ఫ్లోర్‌లీడర్లు ఆ చర్చకు ఒప్పుకున్నారని స్పీకర్ కార్యాల వర్గాలుప్రశ్నపత్రాల లీకేజీలు, పబ్లిక్ పరీక్షల్లో అక్రమాలను కట్టడి చేయడానికి >>2



## తిరుపతిలో తొలి కరోనా కేసు

### 65యేళ్ల వృద్ధురాలికి పాజిటివ్

**తిరుపతి,జులై 27ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో మళ్లీ ఆందోళనకర అలజడి సృష్టిస్తున్న కరోనా వైరస్ వ్యాప్తి తాజాగా యాత్రాస్థలం తిరుపతిలో కేసు నమోదు కావడంతో యాత్రికులు, తిరుపతి వాసులు ఆందోళన చెందుతున్నారు. 2020-21 మధ్యకాలంలో ప్రపంచవ్యాప్తంగా తీవ్రంగా వ్యాపించి ఎందరో ప్రాణాలు బలిగొన్న ఈ కరోనా వైరస్ ప్రభావంతో జనజీవనం అస్తవ్యస్థంగా మారిన విషయం విదితమే. మళ్ళీ ఐదేళ్ళ తరువాత కరోనా వైరస్ రాష్ట్రంలో కలకలంగా మారింది. ఇప్పటికే రాష్ట్రంలో కరోనా వైరస్ కేసులు తీవ్రంగా నమోదవుతున్న తరుణంలో తిరుపతి నగరంలో ఓ కరోనా వైరస్ >>2

రాజమండ్రిలో మరో ఇద్దరికి కరోనా 2లో

## ఇక దృష్టంతా ఫలితాలపైనే

### విద్యారంగంలో సంస్కరణలు పూర్తి

### విద్యార్థులకు మార్కులు రాకపోతే సిఎం నా మార్కులు తగ్గిస్తారు..

### పునాదిపాడు జెడ్పీ హైస్కూలును ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి లోకేష్



పునాదిపాడులోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి లోకేష్

**విజయవాడ.జులై 27,ప్రభాతవార్తప్రతినిధి:** విద్యారంగంలో సంస్కరణలు పూర్తయ్యాయని, ఫలితాలపై దృష్టిపెట్టాలని అధికారులను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. కృష్ణా జిల్లా కంకిపాడు మండలం పునాదిపాడులోని జెడ్పీ ఉన్నత పాఠశాలను మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో వసతులు, విద్యా ప్రమాణాలపై మంత్రి ఆరా తీశారు. ముందుగా పాఠశాలలోని పదో తరగతి ఏ సెక్షన్ విద్యార్థులతో మంత్రి సంభాషించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మీ సీనియర్స్ కంటే మీరు బాగా చదవాలి. గతేడాది పదో తరగతిలో 67శాతం మంది విద్యార్థులు మొదటి ప్రయత్నంలో ఉత్తీర్ణులయ్యారు. రాష్ట్ర సరాసరి కంటే ఇది 11శాతం తక్కువ. మీకు మార్కులు రాకపోతే సీఎం చంద్రబాబునాయుడు గారు నా మార్కులు తగ్గిస్తారు. కాబట్టి మీరంతా బాగా చదవాలని వారిని ఉత్సాహపరిచారు. విద్యార్థులకు పదో తరగతి చాలా ముఖ్యం. పది, ఇంటర్మీడియట్ చదివే సమయంలో నా జీవితంలో మార్పు వచ్చిందని ఈ సందర్భంగా మంత్రి చెప్పారు. ఇప్పుడు మంచి మార్కులు వస్తేనే భవిష్యత్ బాగుంటుందని అన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్ అందజేత, పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యతపై విద్యార్థులను మంత్రి ఆరా తీశారు. బాగుందని విద్యార్థులు సమాధానం ఇచ్చారు. ప్రజాప్రభుత్వంలో మధ్యాహ్న భోజనానికి ఫైన్ రైస్ ను వినియోగిస్తున్నామని చెప్పారు. రాగి జావ ఎంతమందికి ఇష్టం, చిక్కీ ఎంతమందికి ఇష్టం అని మంత్రి సరదాగా ప్రశ్నించగా అధికశాతం మంది విద్యార్థులు చిక్కీ ఇష్టమని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రజాప్రభుత్వం కృషిచేస్తోందని, అన్ని వసతులు, సౌకర్యాలు కల్పిస్తోందని, మీరు చేయాల్సిందల్లా బాగా చదవడమేనని విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు. చదువుకున్నది జీవితంలో ఎంతవరకు ఉపయోగపడుతున్నదన్నది ముఖ్యం, లోకజ్ఞానం కూడా అవసరమేనని పేర్కొన్నారు. బాగా చదువుకోవాలని విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ చెప్పారు.

**అభ్యసన సామర్థ్యాల్లో వెనుకబడి ఉండటంపై మంత్రి అసంతృప్తి**

గతేడాది కంటే ఈ ఏడాది 19 మంది విద్యార్థులు పాఠశాలలో కొత్తగా ప్రవేశాలు పొందారు. ఇందుకు పాఠశాల సిబ్బందిని మంత్రి అభినందించారు. మౌలిక సౌకర్యాల్లో పాఠశాల 2.76 రేటింగ్ సాధించింది. అయితే పాఠశాలలోని విద్యార్థులు అభ్యసన సామర్థ్యాల్లో వెనుకబడి ఉండటంపై మంత్రి అసృతృప్తి వ్యక్తం చేశారు. అద్భుతమైన మౌలిక సౌకర్యాలు, మంచి ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ లెర్నింగ్ అవుట్ కమ్స్, సమ్మెటివ్, ఫార్మెటివ్ అసెస్‌మెంట్స్ లో స్కూల్ వెనుకబడి ఉంది. లెర్నింగ్ అవుట్ కమ్స్ లో 0.9శాతం రేటింగ్ సాధించింది. పట్టణ ప్రాంతానికి దగ్గరగా ఉన్న పాఠశాల అభ్యసన సామర్థ్యాల్లో వెనుకబడి ఉందని, లెర్నింగ్ అవుట్ కమ్స్ పై ప్రత్యేక దృష్టిసారించాలని ఈ సందర్భంగా అధికారులను మంత్రి ఆదేశించారు. వెనుకబడిన విద్యార్థులపై దృష్టి పెట్టాలని సూచించారు. అనుమతి లేకుండా ఉపాధ్యాయులు గైర్హాజరు కావడాన్ని నివారించాలన్నారు. ఒకేషనల్ ల్యాబ్స్ పైనా దృష్టిసారించాలని ఆదేశించారు. ఇంటర్‌లో ఒకేషనల్ కోర్సులపై దృష్టి సారించడం ద్వారా ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు. పాఠశాలలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల విషయంలోనూ మంత్రి ఆరా తీశారు. వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పాఠశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థులను కూడా భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఫలితాల మెరుగుదలకు విద్యార్థుల్లో స్ఫూర్తి >>2



మృతి చెందిన శివాని(ఫైల్)

సిఎం ప్రశంసలు అందుకొన్న

## టెన్త్ విద్యార్థిని అనూహ్యంగా ఆత్మహత్య

### బాలిక మృతిపై సమగ్రవిచారణకు తక్షణమే సిఎం ఆదేశం

### రంపచోడవరంలో విషాదం

**పోలవరం జిల్లా ప్రతినిధి, జులై 27 ప్రభాతవార్త:** పోలవరం జిల్లా రంపచోడవరం మండలం ఇర్లపల్లిలో 10 తరగతి విద్యార్థిని శివాని(14) సోమవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనతో రంపచోడవరంలో విషాదం నెలకొంది. ఈ నెల 24 తేదిన పి. టీ.యం.తల్లికి వందనం వేదికపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కార్యక్రమంలో మాట్లాడిన విద్యార్థిని భవిష్యత్తులో 'షైనింగ్ స్టార్'గా ఎదిగి, ఆయన చేతుల మీదుగా అవార్డు అందుకోవాలనే తన ఆకాంక్షను వ్యక్తం చేసింది. విద్యార్థిని మాటలకు ముఖ్యమంత్రి స్పందించి, ఆమెతో సెల్ఫీ దిగడంతో పాటు భవిష్యత్తులో తనకు నివేదిక ఇవ్వాలని సూచించారు. ఆ విద్యార్థిని వచ్చే యేడాది మంచి మార్కులతో శైనింగ్ స్టార్ అవార్డు అందుకుంటాను అని వేదికపై వెల్లడించి, అందరి చేత చప్పట్లు కొట్టించుకుంది. ఈ విద్యార్థిని ప్రసంగానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ >>2

## నిన్న 'కాక్రోచ్'.. నేడు ఇ-20 జనతాపార్టీ

**న్యూఢిల్లీ,జులై 27:** నీట్ పేపర్ లీక్ వ్యవహారం నేపథ్యంలో కాక్రోచ్ జనతా పార్టీ(సిజెపి) పుట్టుకొచ్చింది. సోషల్ మీడియా నుంచి ప్రారంభమైన ఈ ఉద్యమం చివరకు విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా వరకు సాగింది. ఇప్పుడు సిజెపి లాగే కొత్తగా ఇజెపి అంటే 'ఇ20 జనతా పార్టీ' పుట్టుకొచ్చింది. ఈ పేరుతో కొత్తగా డిజిటల్ ప్రచారం మొదలైంది. ఇ20

### స్వచ్ఛ పెట్రోలు కోసం ఉద్యమం

పెట్రోల్‌తో పాటు వినియోగదారులకు 100 శాతం స్వచ్ఛమైన పెట్రోల్ కొనుగోలు చేసే అవకాశం ఇవ్వాలనేది ఈ పార్టీ ప్రధాన డిమాండ్. ఇ20 జనతాపార్టీ ఇప్పటికే ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్‌లలో ప్రత్యేక అకౌంట్లు క్రియేట్ అయ్యాయి. >>2

## విజయ్ 'ఉద్యోగ' ఉత్తర్వులు కొట్టివేసిన మద్రాసు హైకోర్టు

### కరూర్ తొక్కిసలాట బాధితులకు ఎలా ఇస్తారని ప్రశ్న



**మదురై, జులై 27:** సెప్టెంబర్ 2025లో 'తమిళగ వెట్రి కజగం' (టివికె) అధ్యక్షుడు సి. జోసెఫ్ విజయ్ ప్రసంగించిన ఎన్నికల ర్యాలీ సందర్భంగా కరూర్‌లో జరిగిన విషాదకరమైన తొక్కిసలాటలో మరణించిన వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తూ జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులను మద్రాస్ హైకోర్టు మదురై ధర్మాసనం రద్దు చేసింది. >>2



## తక్కువ ధరకే బియ్యం అమ్మకాలు

### ఆగస్టు 1 నుంచి ప్రజలకు సదవకాశం: డి.సిఎం పవన్

**విజయవాడ,జులై 27,ప్రభాతవార్తప్రతినిధి:** పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో తక్కువ ధరకే బియ్యం అమ్మకాలు జరుగుతున్నాయని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు. ఈ మేరకు డీసీఎంవో ఒక ప్రకటన విడుదల చేసింది. కూటమి ప్రభుత్వం సామాన్యుడికి అండగా నిలుస్తుందని చాటి చెప్పేలా రాష్ట్ర పౌర సరఫరాల శాఖ తీసుకున్న నిర్ణయం స్వాగతించదగినదని పవన్ వ్యాఖ్యానించారు. బహిరంగ మార్కెట్లో పెరుగుతున్న బియ్యం ధరల నుంచి సామాన్యుడికి సాంత్వన చేకూర్చేలా రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో తక్కువ ధరకే బియ్యం అమ్మకాలు చేపట్టాలని నిర్ణయం తీసుకోవడం హర్షణీయమ్మ అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ అన్నారు. బీపీటీ సూపర్ ఫైన్ బియ్యం కేజీ రూ.52లకు, గ్రేడ్ 1 పచ్చి బియ్యం (రా రైస్ ) రూ.50లకు రాష్ట్రంలోని 130 రైతుబజార్లు, 500 రైసు మిల్లర్ల ప్రత్యేక కౌంటర్లలో ఆగస్టు 1వ తేదీ నుంచి ప్రజలకు అందుబాటులో ఉంచేలా ఏర్పాట్లు చేశారు. ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రివర్యులు, సోదరులు నాదెండ్ల మనోహర్ అమలులోకి తీసుకుని వచ్చిన ఈ సౌకర్యం ప్రశంసనీయమన్నారు.. సామాన్యుడిపై ధరల భారం పడకుండా కూటమి ప్రభుత్వం తరఫున ఆయన ప్రత్యేకంగా చొరవ తీసుకోవడం స్వాగతించదగినదని చెప్పారు. బహిరంగ మార్కెట్ ధరలను సమీక్ష చేసి, మిల్లర్లతో అత్యవసరంగా సమావేశం నిర్వహించి ప్రజలకు అందుబాటులో ఉండేలా మేలైన ధరలను నిర్ణయించారని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ పాలనపరమైన నిర్ణయం సామాన్య ప్రజల ఆర్థికభారాన్ని తగ్గిస్తుందని విశ్వాసం వ్యక్తంచేశారు.

## సాయికృష్ణ కస్టొడియల్ డెత్ కేసులో రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంలో ఊరట

2లో



## బడులు, హాస్టల్స్‌లో స్టీమ్ రైస్ వాడకం

### మధ్యాహ్న భోజన పథకం మరింత నాణ్యతతో అమలు: మంత్రి నాదెండ్ల

### ఢిల్లీలో విద్యామంత్రి ప్రహ్లాద్ జోషితో భేటీ

**విజయవాడ.జులై 27,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజాపంపిణీ వ్యవస్థలో ప్రజలకు స్టీమ్ రైస్ అందించడం ద్వారా వారికి పౌర సరఫరాల శాఖ సేవలను మరింత చేరువ చేయొచ్చని రాష్ట్ర పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. దీనిద్వారా ప్రజలకు నాణ్యమైన బియ్యం అందడంతో పాటు, బియ్యం అక్రమ రవాణా నిరోధానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని దీనికి కేంద్ర పౌర సరఫరాల శాఖ సహకారం ఎంతో అవసరమన్నారు. రెండు రోజుల ఢిల్లీ పర్యటనలో భాగంగా సోమవారం ఆయన ఢిల్లీలో కేంద్ర పౌర సరఫరాల శాఖా మంత్రి ప్రహ్లాద్ జోషి తో పాటు శాఖ ఉన్నతాధికారులను వరుసగా కలిశారు. ఈ క్రమంలో కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజాపంపిణీ శాఖ జాయింట్ సెక్రటరీ రవిశంకర్, పాలసీ అండ్ ఎఫ్సీఐ జాయింట్ సెక్రటరీ శిఖా కలిశారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో చేపట్టబోయే అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మనోహర్ సీఎంఆర్ సేకరణ, స్టీమ్ రైస్ పంపిణీ, మీ మార్టుల ప్రారంభం, రాష్ట్రం నుంచి విదేశాలకు ఎగుమతులు వంటి అనేక అంశాలను చర్చించారు. ఆగస్టు 1వ తేదీ నుంచి రాష్ట్రంలోని 130 రైతు బజార్లు, 500 ప్రత్యేక పాయింట్ల ద్వారా తక్కువ ధరకే బియ్యం విక్రయాలను చేపడుతున్నవిషయాన్ని కేంద్ర మంత్రి వద్ద ఆయన ప్రస్తావించారు. ఈ సందర్భంగా కేంద్రం నుంచి రావల్సిన అనుమతులు, సహకారం, పెండింగ్ నిధుల విషయాలను ప్రత్యేకంగా కేంద్రమంత్రి ముందుంచారు. రాష్ట్రంలోని 41 వేల పాఠశాలలు, 4 వేల వసతి గృహాల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో స్టీమ్ రైస్ వాడకం ద్వారా అందుతున్న నాణ్యమైన భోజనంపై సానుకూలత ఉందని, దీన్ని ప్రజాపంపిణీ వ్యవస్థకు >>2



ఎఫ్‌టీపీసీ జాతీయ కార్యకలాపాలకు సంబంధించిన అధికారిక పోస్టర్, లోగోను ఆవిష్కరించిన మంత్రి దుర్గేష్

## వన్ ఇండియా, వన్ సినిమా దిశగా ఎఫ్‌టిపిసి అడుగులు

### క్రియేటివ్ ఎకానమీకి ఎపి చిరునామా: మంత్రి దుర్గేష్

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జులై27,ప్రభాతవార్త:** సీఎం చంద్రబాబు,డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల నేతృత్వం లో ఏపీలో క్రియేటివ్ ఎకానమీని అభివృద్ధి చేయాలని ఆలోచిస్తున్నట్లు తద్వారా రాష్ట్రాన్ని వినోద రంగానికి సరికొత్త గమ్యస్థానంగా నిలిపేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. ఫిల్మ్ అండ్ టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎఫ్ టీపీసీఐ) ప్రతినిధులు సోమవారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్‌ని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎఫ్‌టీపీసీ జాతీయ కార్యకలాపాలకు సంబంధించిన అధికారిక పోస్టర్, లోగోలను మంత్రి దుర్గేష్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఎఫ్‌టీపీసీఐ ప్రతినిధులు తమ భవిష్యత్ ప్రణాళికలను మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ రాజమహేంద్రవరం లాంటి సాంస్కృతిక వేదికపై ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. "ఒకప్పుడు తెలుగు, తమిళం, హిందీ అని వేర్వేరు ప్రాంతీయ చిత్రాలుగా చూసేవాళ్లం. కానీ నేడు పాన్ ఇండియా విప్లవం, ఓటీటీల రాకతో సినిమా స్వరూపమే మారిపోయింది. ప్రేక్షకులకు భాషతో సంబంధం లేకుండా అన్ని రకాల వినోదం అందుతోంది. సినిమాకి ఏ భాషా సరిహద్దు కాదని నిరూపితమైంది" అన్నారు. ఈ నేపథ్యంలో "దేశమంతా ఒకే వినోద వేదికపైకి రావాలనే ఎఫ్‌టీపీసీ ఆశయం అభినందనీయం. ఈ వన్ >>2

28-7pg2exHMNWJQE_28-7pg2exHMNWJQE.qxd 27/Jul/26 11:57 PM Page 1





సోమవారం న్యూఢిల్లీలో ప్రధాని మోదీతో సమావేశమైన పంజాబ్ బిజెపి అధ్యక్షుడు కేవల్‌సింగ్ ధిల్లాన్

# సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసులో రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంలో ఊరట

**విజయవాడ,జులై27,ప్రభాతవార్తప్రతినిధి:** గాదె సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఊరట లభించింది. మాజీ సీఐ నాగరాజు కస్టడీ విచారణ అంశంలో హైకోర్టు ఆదేశాలను సుప్రీంకోర్టు ధర్మాసనం సవరించింది. కస్టడీ విచారణ నిబంధనలను రద్దు చేసింది. సిట్ విచారణకు సుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో సిట్ అధికారులు విజయవాడ ఆఫీస్‌లో నాగరాజును ప్రశ్నించనున్నారు. కృష్ణలంక యువకుడు గాదె సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసులో నిందితుడిగా ఉన్న సీఐ నాగరాజు కస్టడీ విచారణపై సుప్రీంకోర్టు సోమవారం కీలక తీర్పును వెలువరించింది. నిందితుడిని రాజమండ్రి జైలులోనే విచారించాలంటూ గతంలో ట్రయల్ కోర్టు, హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సర్వోన్నత న్యాయస్థానం పక్కన పెట్టింది. ఈ కేసులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వాదనలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, దర్యాప్తునకు అనుకూలంగా ఈ ఆదేశాలు జారీ చేసింది. విచారణ కోసం సీఐ నాగరాజును విజయవాడలోని దర్యాప్తు కేంద్రానికి గానీ, ఇతర సురక్షిత ప్రాంతాలకు గానీ తీసుకెళ్లి ప్రశ్నించవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దీంతో ఈ కేసు దర్యాప్తు అధికారులకు విచారణ ప్రక్రియలో కీలక వెసులుబాటు లభించినట్లయింది. అయితే, కస్టడీ విచారణ సమయంలో నిందితుడిపై ఎలాంటి భౌతికదాడి లేదా హింసకు పాల్పడరాదని సుప్రీంకోర్టు షరతు విధించింది. అంతేకాకుండా, విచారణ ప్రక్రియ మొత్తాన్ని తప్పనిసరిగా వీడియో రికార్డింగ్ చేయాలని కఠినమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ తీర్పుతో సీఐ నాగరాజు కస్టడీ విచారణపై కొనసాగుతున్న న్యాయపరమైన అడ్డంకులు తొలగిపోయాయి.

# భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవం దృష్ట్యా సిఎం చంద్రబాబు విడియో కాన్ఫరెన్స్

**విజయవాడ,.జులై27,ప్రభాతవార్తప్రతినిధి:** భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవం దృష్ట్యా సీఎం చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 'ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు' నినాదంతో కార్యక్రమాలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో ఉత్తరాంధ్ర కలెక్టర్లు పోటీపడాలి. భోగాపురం విమానాశ్రయంతో ఉత్తరాంధ్ర గేమ్‌ఛేంజర్‌గా మారుతుంది. యువకులకు వాలీబాల్, రన్, పాటలు, పద్యాల పోటీలు నిర్వహించాలి. వివిధ విభాగాల్లో గెలుపొందిన 600 మందిని విజేతలుగా ప్రకటించాలి. విమానాశ్రయం ఏర్పాట్లు వల్ల కలిగే ప్రయోజనాలపై పోటీలు నిర్వహించాలి. విద్యార్థులకు క్విజ్, డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించాలి. ఈనెల 31న రాత్రి నుంచే డ్రోన్‌షో ఏర్పాటు చేయాలి.ప్రధానికి జాతీయజెండాలతో పిల్లలు స్వాగతం పలకాలి. విమానాశ్రయం ప్రారంభ సమయంలో 13వేల మందితో థింసా ప్రదర్శన. 13 వేల మందితో నిర్వహించే థింసా ప్రదర్శన గిన్నీస్‌రికార్డు సాధించాలి. కొవిడ్ నేపథ్యంలో ఆరోగ్యశాఖ అప్రమత్తంగా వ్యవహ రించాలి. ప్రజలకుఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని చంద్రబాబు పేర్కొన్నారు. మరోవైపు 11 అంతర్జాతీయ, 25 జాతీయ ఛానళ్లలో ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవ కార్యక్రమం ప్రసారం జరగనుంది.

# కందుల జెస్సీకి విద్యామంత్రి లోకేష్ అభినందన

**విజయవాడ.జులై 27,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ అసాధారణ ప్రతిభతో ప్రపంచ వేదికపైకి అడుగుపెట్టిన ఆంధ్రప్రదేశ్ విద్యార్థినికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. ప్రపంచంలోనే తొలి ఆల్‌గర్ల్స్ గ్లోబల్ లూనార్ క్యూబ్‌శాట్ మిషన్ శక్తిశాట్‌కు ఎంపికైన తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం విద్యార్థిని కందుల జెస్సీ, సోమవారం ఉండవల్లిలో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కలిసింది. ఈ సందర్భంగా జెస్సీని ప్రత్యేకంగా అభినందించిన మంత్రి, ఆమె భవిష్యత్ ప్రయత్నాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా మద్దతుగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ధవళేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న కందుల జెస్సీ, మిషన్ శక్తిశాట్‌కు భారత్ నుంచి ఎంపికైన 20 మంది బాలికల్లో ఒకరిగా నిలిచింది. ఈ ఘనత సాధించిన ఏకైక ఆంధ్రప్రదేశ్ విద్యార్థినిగా ఆమె రికార్డు సృష్టించింది. తన పాఠశాలలోని అటల్ టింకరింగ్ ల్యాబ్స్‌లో చేసిన ప్రయోగాలే తనకు అంతరిక్ష విజ్ఞానంపై ఆసక్తిని పెంచాయని జెస్సీ మంత్రికి వివరించింది. ఏడో తరగతి నుంచే స్పేస్ సైన్స్ పట్ల ఆకర్షితురాలినయ్యానని, మిషన్ శక్తిశాట్‌లో భాగంగా 21 మాడ్యూల్స్‌లో 550 సెషన్ల శిక్షణ తీసుకున్నానని తెలిపింది. భవిష్యత్తులో ఏరోనాటికల్ ఇంజనీర్‌గా స్థిరపడటమే తన లక్ష్యమని ఆమె పేర్కొంది.




# ఉద్యాన పంటల కార్గో ఎయిర్ పోర్ట్‌కు అనంతలో రీసర్వే చేయండి

## కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడిని కోరిన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

**అనంతపురం, జులై 27, ప్రభాతవార్త బ్యూరో:** అనంతపురం జిల్లాలో ఎయిర్‌పోర్టు ఏర్పాటు ప్రతిపాదనను పరిశీలించాలని కోరుతూ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణతో కలిసి ఢిల్లీలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి శ్రీ రామ్మోహన్ నాయుడితో సోమవారం సమావేశమై కోరారు. ఈ మేరకు అవసరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి స్పందించి సర్వే నిర్వహించి 30రోజుల్లో నివేదిక అందజేయాలని అధికారులను ఆదేశించారు.

# ఇక దృష్టంతా ఫలితాలపైనే

>> నింపాలని, విద్యావ్యవస్థ బాగుండాలంటే సాఫ్ట్ వేర్, హార్డ్ వేర్ రెండూ ముఖ్యమేనని చెప్పారు. పదో తరగతి పరీక్షా ఫలితాలమెరుగుదలపై దృష్టి సారించాలని ఆదేశించారు. విద్యారంగంలో సంస్కరణలు పూర్తయ్యాయని, ఫలితాలపై దృష్టిపెట్టాలన్నారు. 340 మంది ఉన్న పాఠశాలలో మార్పు కనపడాలని, ఆ మార్పుఫలితాల్లో ప్రతిబింబించాలని ఆదేశించారు.అనంతరం తొమ్మిదో తరగతి విద్యార్థులతో మంత్రి మాట్లాడారు. మధ్యాహ్నభోజనం నాణ్యతపై ప్రశ్నించారు. విద్యార్థులకు ఆటోగ్రాఫ్ లు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లాకలెక్టర్ డీకే బాలాజీ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏ.వెంకటేశ్వరరావు,ఆర్జేడీఎస్ నాగమణి,డీఈవో యూవీ సుబ్బారావు,ఎంఈవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# నేడు ఇ-20 జనతాపార్టీ

>> ఇంధనం విషయంలో కూడా వినియోగదారులకు తాము ఎంచుకున్న పెట్రోల్ కొనుగోలు చేసే హక్కు కల్పించాలని డిమాండ్ చేసింది. ప్రభుత్వం ఇ20ను అందుబాటులో ఉంచినా, దానితో పాటు 100 శాతం పెట్రోల్‌ను కూడా విక్రయించాలని కోరుతున్నారు. మా కార్లపై ప్రయోగాలు ఆపండి ఇంధనాన్ని ఎంచుకునే హక్కు భారతదేశానికి కావాలి మా వాహనాలు ప్రయోగ యంత్రాలు కావు. సంవత్సరాల ముందే పన్నులు చెల్లించి, మా కష్టార్జితంతో వాటిని కొన్నాము. మనది మధ్యతరగతి ప్రజలు అధికంగా ఉన్న దేశం, మరియు ఇంధన సామర్థ్యం ప్లస్ వాహన పనితీరు మా రోజువారీ జీవనంపై ప్రత్యక్షంగా ప్రభావం చూపుతాయి. అలాంటప్పుడు వాహన మాన్యువల్‌ను అనుసరించకుండా, మా ఇంజిన్లపై ఎందుకు ప్రయోగాలు చేస్తున్నారని ఇజెపి అడుగుతోంది. కొందరు వాహన యజమానులు 20 శాతం ఇథనాల్ కలిపిన ఇ20పెట్రోల్ వాడటం వల్ల వాహనాల ఇంజన్లు దెబ్బతింటున్నాయని, మైలేజ్ తగ్గిందని ఆరోపిస్తున్నారు. నిర్వహణ ఖర్చులు పెరిగినట్లు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ఇ20 జనతా పార్టీ పేరిట ఉన్న ఎక్స్ ఖాతాకు 13 వేలకుపైగా, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాకు 8,800కుపైగా ఫాలోవర్లు ఉన్నట్లు తెలుస్తోంది.

# కొట్టివేసిన మద్రాసు హైకోర్టు

>> తొక్కిసలాట బాధితుల కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు కల్పించాలన్న ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని ప్రభుత్వనిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాలపై సోమవారం జస్టిస్ సి.వి. కార్తికేయన్, జస్టిస్ ఆర్. శక్తివేల్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపి పిటిషనర్ల వాదనను సమర్థించింది. అంతకుముందు, నియామక ఉత్తర్వులను పంపిణీ చేయడానికి జులైలో కరూర్‌లో ఒక కార్యక్రమాన్ని నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వానికి కోర్టు అనుమతినిచ్చింది. అయితే, ఆ ఉద్యోగ నియామకాలు తాత్కాలిక ప్రాతిపదికన ఉంటాయని, న్యాయ సమీక్షకు లోబడి ఉంటాయని కోర్టు అప్పుడే స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలోనే ద్విసభ ధర్మాసనం సోమవారం విచారణ జరిపి విస్పష్ట తీర్పునిచ్చింది.

# అవగాహన పెంచండి

>> సాధారణ వర్షపాతం నమోదైందని చెప్పారు. మండల స్థాయిలో 249 మండలాలు తీవ్ర వర్షపాతం లోటులో, 359 మండలాలు వర్షపాతం లోటులో ఉండగా, కేవలం రెండు మండలాల్లో మాత్రమే అత్యధిక వర్షపాతం నమోదైందని తెలిపారు. ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తా, కోస్తాంధ్ర, రాయలసీమ అనే నాలుగు వ్యవసాయ వాతావరణ మండలాలన్నీ ఇప్పటికీ వర్షపాతం లోటు కేటగిరీలోనే కొనసాగుతున్నాయని చెప్పారు. వర్షపాతం పరిస్థితులకు అనుగుణంగా జిల్లాస్థాయి ప్రమాద అంచనాలు, రైతులకు సూచనలు, ప్రత్యామ్నాయ విత్తనాల ప్రణాళిక మరియు దశలవారీ పంటల అత్యవసర ప్రణాళిక చర్యలను ఇప్పటికే ప్రారంభించామని సీఎం చంద్రబాబు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా అంచనా వేసిన 8,489 రైతు సేవా కేంద్రాలు మరియు 688 మండలాల్లో, 1,357 రైతు సేవా కేంద్రాలు, 168 మండలాలు అధిక ప్రమాద స్థాయిలో ఉన్నాయని సీఎం చంద్రబాబు చెప్పారు.సాగు విస్తీర్ణంపై ప్రత్యేక దృష్టి.జులై 25 నాటికి, 12 జిల్లాల్లో సాధారణంగా సాగు కావాల్సిన విస్తీర్ణంలో 50 శాతం కంటే తక్కువ విస్తీర్ణంలోనే పంటలు సాగయ్యాయని తెలిపారు. అన్నమయ్య జిల్లాలో 9 శాతం, బాపట్లలో 5 శాతం, ప్రకాశంలో 15 శాతం మరియు మార్కాపురంలో 15 శాతంతో పరిస్థితి అత్యంత ప్రభావితంగా ఉందన్నారు. 10 జిల్లాల్లో సాధారణ సాగు విస్తీర్ణంతో పోలిస్తే 51 శాతం నుంచి 100 శాతం మధ్య సాగు నమోదైందని చెప్పారు. శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు, ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు, కర్నూలు, పశ్చిమ గోదావరి సహా ఆరు జిల్లాల్లో సాధారణ సాగు స్థాయిని మించి సాగు నమోదైందని వివరించారు. అధిక ప్రమాదంలో ఉన్న 168 మండలాల్లో, సీజన్ సాధారణ విస్తీర్ణంతో పోలిస్తే 39 శాతం సాగు నమోదైందని తెలిపారు. కర్నూలు జిల్లాలోని అధిక ప్రమాద మండలాలు సాగులో ముందంజలో ఉండగా, మార్కాపురం ప్రాంతంలోని అధిక ప్రమాద మండలాలు రాష్ట్రంలో అత్యంత వెనుకబడి ఉన్నాయని చెప్పారు. సీజన్ సాధారణ పంట విస్తీర్ణం 30.84 లక్షల హెక్టార్లుగా ఉండాలన్నారు.అయితే ఇప్పటివరకు మొత్తం 16.35 లక్షల హెక్టార్లలో పంటలు సాగయ్యాయని సీఎం చంద్రబాబు చెప్పారు. ఇది సీజన్ సాధారణ విస్తీర్ణంలో 39 శాతం మరియు ప్రస్తుత తేదీ నాటికి సాధారణంగా ఉండాల్సిన విస్తీర్ణంలో 74 శాతమని తెలిపారు.రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లో ప్రభుత్వ సేవల విషయంలో కొంత గ్యాప్ ఉందని సీఎం చంద్రబాబు చెప్పారు. ఆలూరు నియోజకవర్గ పర్యటనలో ఉద్యోగుల పనితీరును చదివి వినిపించినప్పుడు క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి వచ్చిన ప్రతిస్పందనను అధికారుల వద్ద సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. రంపచోడవరంలో విద్యార్థి శివాని ఆత్మహత్య చేసుకున్న ఘటనను సీఎం చంద్రబాబు అధికారుల వద్ద ప్రస్తావించారు. చదువులో టాపర్ అయిన శివాని చనిపోవడం చాలా ఆవేదన కలిగించిందని అన్నారు. విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని పరిశీలించేందుకు సైకో మెట్రిక్ టెస్టులను చేయించాలని విద్యా శాఖ ఆదేశించిందని, ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు సీఎంకు వివరించారు. మానసిన పరిస్థితిని అంచనా వేసేందుకు నిపుణుల సేవలు తీసుకోవడంతోపాటు... టీచర్లకు కూడా అవసరమైన మేరకు శిక్షణ ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రి కొలుసు పార్థసారధి, సీఎస్ సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# తిరుపతిలో తొలి కరోనా కేసు

>> పాజిటివ్ కేసు నమోదుతో యాత్రికుల్లో ఆందోళన భావం నెలకొంది. తిరుపతి అర్బన్ ప్రాంతానికి చెందిన 65 ఏళ్ళ వృద్ధురాలికి ఆదివారం కోవిడ్ పాజిటివ్‌గా తేలడంతో తిరుపతిలో మొదటి కేసు నమోదైంది. గత కొన్ని రోజులుగా ఆమె తీవ్ర శ్వాసకోశ సమస్యలతో బాధపడుతోంది. ఆమెను కుటుంబ సభ్యులు ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించగా ఆమె పరిస్థితి నిలకడగా ఉంది. నాలుగురోజుల క్రిందట నిర్వహించిన పరీక్షల్లో కరోనా నిర్ధారణ అయింది. అయితే ఆమె కుటుంబ సభ్యులకు జరిపిన పరీక్షల్లో ఎలాంటి వైరస్ లక్షణాలు లేవని వైద్యారోగ్య శాఖ స్పష్టం చేసింది. గత శనివారం ఒక్కరోజే రాష్ట్రంలో మరో 10 మందికి పైగా కరోనా బారిన పడ్డారనేది వైద్యశాఖ అదికారుల సమాచారం. దీంతో రాష్ట్రంలో మొత్తం కేసుల సంఖ్య 49కి చేరగా, ప్రస్తుతం వివిధ ఆసుపత్రుల్లో 24 మంది చికిత్స పొందుతున్నారు. ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో కొత్త కేసులు నమోదవగా కృష్ణా, తిరుపతి, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో ఒక్కో కేసు నమోదైంది. ఇప్పటివరకు రాష్ట్రంలో కరోనాతో నలుగురు మృతి చెందినట్లు వైద్యశాఖ గణాంకాల ద్వారా తెలుస్తోంది. కేసుల సంఖ్య పెరుగుతుండటంతో వైద్యశాఖ అధికారులు ముందస్తు జాగ్రత్తలు చేపడుతున్నారు.తిరుపతిలోని రుయా ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా వైరస్ సోకిన వారికోసం ప్రత్యేక వార్డులు, పకడలు, వైద్యపరికరాలు, వైద్యసదుపాయాలు అందుబాటులో ఉంచడం జరిగిందని రుయా వైద్యులు తెలిపారు. తిరుపతి యాత్రాస్థలం కావడంతో ఇక్కడకు నిత్యం 70వేలమంది వరకు వివిధ రాష్ట్రాల నుండి విదేశాల నుండి యాత్రికులు తరలివస్తుంటారు. వీరిలో ఎవరికైనా అనుమానాస్పదంగా జ్వరం, జలుబు,చలి ,శ్వాసకోశ సమస్యలు తీవ్రంగా ఉన్నా కరోనా వైరస్ భయం నెలకొంది.

# రాజమండ్రిలో మరో ఇద్దరికి కరోనా

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,జూలై27,ప్రభాతవార్త:** తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం జిజిహెచ్ లో సోమవారం నిర్వహించిన కోవిడ్ టెస్ట్ లో ఇరువురు మహిళలకు పాజిటివ్ నిర్ధారణ అయింది. జిజిహెచ్ లో 14 మందికి రాపిడ్ టెస్టులు చేయగా ఇరువురు మహిళలకు కోవిడ్ లక్షణాలు ఉన్నాయని వైద్యులు తెలిపారు. రాజమహేంద్రవరం శ్రీరంగం పట్నం చెందిన 29 ఏళ్ల మహిళ కు అలాగే రాజమహేంద్రవరం రూరల్ మండలం ధవలేశ్వరం కి చెందిన 45 సంవత్సరాల మహిళలకు పాజిటివ్ అయింది. ఆర్టీ పి సిఆర్ టెస్ట్ కోసం కాకినాడ పంపించినట్లు తెలిపారు రెండు రోజుల్లో రిపోర్ట్ రానున్నదని వివరించారు. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

# టెన్త్ విద్యార్థిని అనూహ్యంగా ఆత్మహత్య

>> మంత్రముగుద్దులు అయ్యారు. ఇంతలోనే ఈ విద్యార్థిని ఆత్మహత్య చేసుకోవటం అందరి మనసులను కలించి వేసింది. విద్యార్థిని మృతి పై సమగ్ర విచారణ జరిపించాలని ముఖ్య మంత్రి పోలవరం జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ట్విట్టర్ వేదికగా విద్యార్థిని మృతి పై విచారం వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి తన మనసును ఈ ఘటన కలచివేసింది అని పోస్ట్ చేశారు. మంత్రి నారా లోకేష్ ట్విట్టర్ వేదికగా రంపచోడవరం మెగాపేరంటే టీచర్ మీటింగ్లో ఎంతో ఆత్మవిశ్వాసంతో మాట్లాడిన శివాని మృతి తీవ్ర విషాదం నింపింది అని విషయం తెలిసినప్పటి నుంచి శివాని మాటలు పదేపదే గుర్తొస్తున్నాయి అని,సోదరి శివాని ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నాను అని,ఎంత కష్టమైనా పోరాడుదాం. ఎంతటి సమస్యనైనా ఎదుర్కొందాం. మీకు నేనున్నాను ఈ ప్రభుత్వం ఉంది మన దేశ భవిష్యత్తు సంపద మీరు. అని లోకేష్ పోస్ట్ చేశారు. ఈ ఘటనపై ఇప్పటికే పోలీసులు అన్ని కొనాల్లో దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబ సభ్యులు అంత కలిసి ఉండాలని ఈ విద్యార్థిని రాసిన లేఖ ఘటన స్థలంలో లభించింది.ముఖ్యమంత్రి ప్రశంసలు అందుకున్న విద్యార్థిని ఆత్మ హత్య చేసుకోవటంతో రంపచోడవరం లో జరిగిన పి. టీ.యం కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరి కళ్ళు చమార్చేలా చేసింది ఈ విషాదం.

# బడులు, హాస్టల్స్‌లో స్టీమ్ రైస్ వాడకం

>> అనుసంధానం చేసి పైలెట్ ప్రాజెక్టుగా రాష్ట్రంలోని ఒక జిల్లాలో మొదలుపెట్టేలా అనుమతి ఇవ్వాలని కోరారు. దీనికి కేంద్ర మంత్రివర్యుల నుంచి సానుకూల స్పందన వచ్చినట్లు ఆయన తెలిపారు. బియ్యం సంచులపై ఆర్ ఎఫ్ఐడీను ముద్రించడం ద్వారా అక్రమ రవాణా అరికట్టడానికి దోహదపడుతుందని, దీన్ని పైలెట్ ప్రాజెక్టుగా రాష్ట్రంలో అమలు చేయడానికి అనుమతి ఇవ్వాలన్నారు. రేషన్ బియ్యంలో 10 శాతం నూకల బియ్యం అందిస్తే, ప్రజాపంపిణీలో మంచి ఫలితాలు ఉంటాయని, దీన్ని రాష్ట్రంలో అమలు చేస్తున్నామని తెలిపారు.అలాగే పెండింగ్ ఉన్న నిధులను విడుదల చేయాలని కోరారు. మంత్రి వెంట పౌర సరఫరాల శాఖ కమిషనర్ కన్నబాబు , పౌర సరఫరాల సంస్థ ఎండీ ఢిల్లీరావు, తదితరులు ఉన్నారు.

# లోక్‌సభకు 'పరీక్షల' బిల్లు

>> ఉద్దేశించిన పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు2026ను కేంద్ర ప్రభుత్వం సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ఈనెల 20న విద్యార్థులపై జరిగిన పోలీసుల బలప్రయోగాన్ని నిరసిస్తూ ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేయడంతో సభలో గందరగోళం నెలకొంది. అటు రాజ్యసభలో కూడా ఇదే పరిస్థితి నెలకొడంతో ఉభయసభలకు మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. పార్లమెంట్‌లో సంసద్ ఛలో కార్యక్రమం సందర్భంగా విద్యార్థులపై పోలీసులు బలప్రయోగం చేశారన్న ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. పక్ష సభ్యుల ఆందోళన మధ్య కేంద్రమంత్రి జితేంద్రసింగ్ ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. విపక్షాలు నిరసన కొనసాగించడంతో లోక్‌సభ మధ్యాహ్నం రెండు గంటలకు వాయిదా పడింది. అటు రాజ్యసభలోనూ విద్యార్థులపై పెల్లెట్ గన్స్ వాడారంటూ విపక్షాలు ఆందోళన చేపట్టాయి. విపక్షాల నిరసనల మధ్య మొదట మధ్యాహ్నం 12 గంటల వరకు రాజ్యసభ వాయిదా పడింది. తిరిగి సభ ప్రారంభమైన తర్వాత విద్యార్థులపై లాఠీఛార్జితో పాటు పలు అంశాలపై చర్చ జరగాలని విపక్షాలు పట్టుబట్టాయి. ఈ క్రమంలో రాజ్యసభ మధ్యాహ్నం రెండు గంటలకు వాయిదా పడింది. ఆ బిల్లు ప్రకారం లీకేజీకి పాల్పడి నిందితులకు పదేళ్ల జైలుశిక్ష, 50 లక్షల ఫైన్ విధించనున్నారు. వాస్తవానికి ఇవాళ 5 గంటలకు ఆ బిల్లుపై చర్చ చేపట్టాలని భావించారు. కానీ విద్యార్థులపై లాఠీఛార్జ్‌ను ఖండిస్తూ విపక్షలు సభలో నినాదాలు చేశాయి. దీంతో గందరగోళం మధ్య సభను మరుసటిరోజుకు వాయిదా వేశారు. సుమారు 6 గంటల పాటు బిల్లుపై చర్చ జరిగే అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వ పరీక్షల సవరణ బిల్లుపై సమగ్ర చర్చ నిర్వహించాలని కాంగ్రెస్‌తో పాటు ప్రతిపక్ష పార్టీలకు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు మరోసారి విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్‌లో గందరగోళం సృష్టించకుండా విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని బిల్లుపై నిర్మాణాత్మక చర్చ జరపాలని కోరారు. ప్రశ్నపత్రాల లీకేజీలు వంటి సమస్యలను పరిష్కరించేందుకు కీలక బిల్లును తీసుకొచ్చామని, కానీ కాంగ్రెస్, మరికొన్ని ప్రతిపక్ష పార్టీలు దీనిపై చర్చకు సిద్ధం కాకుండా సభలో అంతరాయం కలిగిస్తున్నాయని ఆయన అన్నారు. పరీక్షల వ్యవస్థలో సంస్కరణల కోసం ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటించిన చర్యలను ప్రతిపక్షాలు గుర్తించాలని రిజిజు కోరారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలోఉంచుకుని ఈ బిల్లును ఆమోదించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. నాలుగు గంటల చర్చ ఈ బిల్లుపై లోక్‌సభలో నాలుగు గంటలపాటు చర్చ నిర్వహించాలని బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బిఎసి) నిర్ణయించినట్లు సమాచారం. బిజెపి ఎంపీలు బన్సూరి స్వరాజ్, తేజస్వి సూర్యతోపాటు జేడీయూ, టిడిపి,శివసేన, ఎన్‌సిపి, అప్నాదళ్, ఎల్‌జెపి (రాంవిలాస్) తదితర పార్టీల ఎంపీలు చర్చలో పాల్గొనే అవకాశం ఉంది.

**బిల్లులో ఏడు కీలక సవరణలు**

ఈ సవరణ బిల్లులో మొత్తం ఏడు కీలక మార్పులు ప్రతిపాదించారు. పేపర్ లీక్‌లు, పరీక్షల్లో అక్రమాలకు సంబంధించిన కేసుల విచారణను వేగవంతం చేయడం, నిందితులకు కఠిన శిక్షలు విధించడం, అమలు వ్యవస్థను మరింత బలోపేతం చేయడం ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పేర్కొంది. బిల్లు ప్రకారం, రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసే అవకాశం ఉంటుంది. ఛార్జిషీట్ దాఖలు చేసిన మూడు నెలల్లో విచారణ పూర్తి చేయాలని ప్రతిపాదించారు. రెండు నెలల్లో దర్యాప్తు ముగించాల్సి ఉంటుంది. పరీక్షల అక్రమాల దర్యాప్తు కోసం కేంద్రం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయవచ్చు. రాష్ట్రాలు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమించుకునే అధికారం పొందుతాయి. నేరస్థులకు మరింత కఠిన జైలు శిక్షలు, భారీ జరిమానాలు విధించే అవకాశం ఉంటుంది. హైకోర్టు డివిజన్ బెంచ్‌లో నిర్ణీత గడువులో అప్పీల్ చేసే విధానాన్ని కూడా బిల్లులో చేర్చారు.



సోమవారం న్యూఢిల్లీలోని రాజ్‌ఘాట్ వద్ద భార్యతో కలిసి బాపూజీకి నావాళులర్పిస్తున్న వాంగ్‌చుక్

# ఆకివీడు రామాలయం నిర్మాణానికి సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్

**విజయవాడ.జులై 27,ప్రభాతవార్తప్రతినిధి:** ఆకివీడు రామాలయం నిర్మాణానికి సుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. నిర్మాణానికి కలెక్టర్ ఇచ్చిన ఎన్‌వోసీని సుప్రీంకోర్టు సమర్థించింది. అనుమానాలు ఉంటే మరో పిటిషన్ దాఖలు చేసుకోవచ్చన్నారు. ఆకివీడు రామాలయానికి వ్యతిరేకంగా దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది.

# సుప్రీంకోర్టులో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి చుక్కెదురు

**విజయవాడ.జులై 27,ప్రభాతవార్తప్రతినిధి:** సుప్రీంకోర్టులో వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి చుక్కెదురైంది. ఏపీ లిక్కర్ స్కాంలో నిందితుడు దొడ్డా వెంకట సత్యప్రసాద్‌కు మంజూరు చేసిన ముందస్తు బెయిల్‌ను కొట్టివేయాలంటూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. సోమవారం ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం విచారించింది. ఈ పిటిషన్‌లో పలు సందేహాలను చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఏమైనా సందేహాలుంటే సరైన సమయంలో తమ అభ్యంతరాలతో కోర్టును ఆశ్రయించవచ్చని ఆ వైసీపీ నేతకు ఈ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం స్పష్టం చేసింది. దొడ్డా వెంకట సత్యప్రసాద్‌ను అప్రూవర్‌గా మార్చి.. మాజీ సీఎం వైఎస్ జగన్‌ను ఈ కేసులో ఇరికించాలని చూస్తున్నారంటూ ఆ పిటిషన్‌లో వైసీపీ నేత చెవిరెడ్డి ఆరోపించారు. దొడ్డా వెంకట సత్యప్రసాద్‌కు ఇచ్చిన ముందస్తు బెయిల్ కొట్టివేయాలంటూ సుప్రీంకోర్టులో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పి) దాఖలు చేసారు.ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, దొడ్డా వెంకట సత్యప్రసాద్‌లను అప్రూవర్‌లుగా మార్చి తద్వారా వైసీపీ అధినేత వైఎస్ జగన్‌ని ఇరికించేందుకు కూటమి ప్రభుత్వంతోపాటు ఈ కేసు విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు సంస్థ (సిట్) కుట్ర పన్నుతున్నాయని చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆరోపిస్తున్నారు.

# తమ్మినేని సీతారామ్ కుమారుడికి హైకోర్టులో ఎదురుదెబ్బ

**విజయవాడ, జులై 27,ప్రభాతవార్తప్రతినిధి:** వైఎస్సార్సీపీ నేత, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారామ్ కుమారుడికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తమ్మినేని కుమారుడు నాగ్‌కు ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. ఫోర్జరీ దస్త్రాలతో అక్రమ రిజిస్ట్రేషన్‌కు పాల్పడిన కేసులో నాగ్ పిటిషన్ కొట్టివేసింది. ఇదే కేసులో తమ్మినేని సీతారామ్ సతీమణి వాణికి మధ్యంతర బెయిల్ మంజూరయ్యింది. ఎప్పుడు పిలిస్తే... అప్పుడు విచారణకు రావాలని వాణిని హైకోర్టు ఆదేశించింది.

# వన్ ఇండియా, వన్ సినిమా దిశగా ఎఫ్‌టిపిసి అడుగులు

>> ఇండియా వన్ సినిమా అనే విప్లవాత్మక లక్ష్యం ప్రతి ఒక్కరికీ చేరాలి. థియేటర్, టెలివిజన్, ఓటీటీ, ఈ మూడు రంగాలు సమాంతరంగా వృద్ధి చెందడమే ప్రభుత్వ ఆకాంక్ష." అన్నారు."రాష్ట్రంలో క్రియేటివ్ ఎకానమీ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది. భవిష్యత్తులో ఎఫ్‌టీపీసీ చేపట్టే అన్ని రకాల ప్రమోషనల్ కార్యక్రమాలకు, సినీ అభివృద్ధి చర్యలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయి సహకారం ఉంటుంది." అని హామీ ఇచ్చారు. క్రియేటివ్ ఎకానమీ ప్రతినిధులు త్వరలోనే రాజధాని అమరావతి, తిరుపతి కేంద్రాలుగా ఫిల్మ్, టెలివిజన్, థియేటర్ కార్యకలాపాలను విస్తృతంగా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. భారతదేశంలో సినీసాంకేతిక, వినోద రంగాన్ని ఒకే గొడుగు కిందికి తెచ్చేందుకు ఎఫ్‌టీపీసీచేస్తున్న కృషిని మంత్రి దుర్గేష్ కొనియాడారు. మంత్రిని కలిసిన వారిలో ఎఫ్‌టీ పీసీ ఇండియా ప్రెసిడెంట్ చైతన్య జంగా, సెక్రటరీ వర్మ పాకలపాటి, సఖిశక్తి వెల్ఫేర్ ఫౌండేషన్ (పాన్ ఇండియా) ప్రెసిడెంట్ జయ పటేరియా, శ్రీనివాస్, రమేష్, ఈశ్వర్

# పొగాకు కొనుగోళ్లకు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల మద్దతు: సిఎం చంద్రబాబు

**విజయవాడ,జులై 27,ప్రభాతవార్తప్రతినిధి:** పొగాకు కొనుగోళ్లకు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు మద్దతిచ్చేందుకు అంగీకరించిందని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఉమ్మడిగా రూ.188 కోట్లు భరించేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది.ధరల లోటు భర్తీ కింద పొగాకు రైతులకు కిలో పొగాకు రూ.20 ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది.94 మిలియన్ కేజీల పొగాకు కొనుగోళ్లకు మద్దతిచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు.పొగాకు బ్రైట్ రకం కిలో రూ.240, మీడియం రకం పొగాకు రూ.190, లో గ్రేడ్ పొగాకు రూ.110 మేర తగ్గకుండా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు.పొగాకు రైతులను ఆదుకునేందుకు కేంద్రంతో నిత్యం సీఎం చంద్రబాబు సంప్రదింపులు జరిపారు.రాష్ట్ర ప్రభుత్వం.ండు రోజుల క్రితం సీఎం చంద్రబాబును కలిసిన కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి, డైరెక్టర్. సీఎం సూచనల మేరకు పొగాకు రైతులను ఆదుకునేందుకు సహకరించాలని కోరుతూ రాష్ట్రంలోని కేంద్ర ప్రతినిధులు.బయ్యర్లతో చర్చలు జరిపారు.

## వారం - వర్జ్యం

28-07-2026, మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢమాసం, దక్షిణాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, పుష్యమి కార్తె
చతుర్దశి సా.6.17,
పూర్వాషాఢ మ.1.09
వర్జ్యం : రా.9.58-రా.11.44
దు.ఉ.8.21-ఉ.9.13,
2)రా.11.50-రా.12.42
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం:** బంధువుల నుండి ఆహ్వానాలు అందుతాయి. అవకాశాలు అప్రయత్నంగా లాభిస్తాయి. స్థలాలు కొనుగోలు చేస్తారు.

**వృషభం:** జీవితభాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారంచుడతారు. దేవాలయ సందర్శనం చేసుకుంటారు.

**మిథునం:** ముఖ్యమైన విషయాలలో తొందరపాటు వద్దు. భూముల క్రయ విక్రయాలలో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం చెప్పదగినది.

**కర్కాటకం:** పెట్టుబడులకు అనుకూల కాలం. సంఘోద్ధరణకు మీ వంతు సహాయాన్ని అందిస్తారు. ఆస్తి వివాదాలు పరిష్కారదశకు చేరుకుంటాయి.

**సింహం:** ఇంటి యందు శుభకార్యాల ప్రస్తావన వుంటుంది. సంతాన విద్య విషయంలో బాధ్యతతో వ్యవహరిస్తారు.

**కన్య :** వ్యవహారాలలో ఇతరుల జోక్యాన్ని ఆదిలోనే తుంచివేయండి. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వున్న అవసరాలకు డబ్బు అందుతుంది.

**తుల:** ఆలోచనలు ఫలిస్తాయి. కావు అనుకున్న మొండి వసూలలో చలనం ఏర్పడుతుంది. కోపతాపాలకు దూరంగా వుండండి.

**వృశ్చికం:** అందరిలో ప్రత్యేకమైన గుర్తింపు లభిస్తుంది. సాంకేతిక రంగంలోనివారికి అనుకూలంగా ఉంటుంది.వస్త్రలాభం.

**ధనుస్సు:** వివాదాస్పద అంశాలు ఎదురయినప్పుడు సమాధానాలు ఇవ్వక మౌనం వహించండి. ఆర్థికంగా వెసలుబాటు కలుగుతుంది.

**మకరం:** అన్ని విషయాలు నిబంధనలకు అనుగుణంగా జరగవని లౌక్యం అవసరమని గుర్తించి వ్యవహరించడం వలన లాభపడతారు.

**కుంభం:** మొండి ధైర్యంతో ఒకానొక ముఖ్య నిర్ణయం తీసుకుని అమలు చేస్తారు. దాని తాలూకు ఫలితాలు భవిష్యత్తులో అందుతాయి.

**మీనం:** సంగీత, సాహిత్యాలపై ఆసక్తి చూపుతారు. నూతన ఒప్పందాలలో నిదానం అవసరం. ప్రయాణాలలో తొందరపాటు వద్దు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

28-7Pg3exHMNWJQEKCO_28-7Pg3exHMNWJQEKCO.qxd 27/Jul/26 11:43 PM Page 1



## అబ్దుల్ కలాంకు సిఎం, డి.సిఎం నివాళి



**విజయవాడ, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** భారతరత్న, మాజీ రాష్ట్రపతి ఏపిజె అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నివాళి అర్పించారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ దేశానికి శాస్త్ర, సాంకేతిక వరంగా అబ్దుల్ కలాం ఎన్నో విజయాలను అందించారని సిఎం చంద్రబాబు కొనియాడారు. దేశానికి శాస్త్ర, సాంకేతికపరమైన ఎన్నో విజయాలను అందించి, మిస్సైల్ మ్యాన్‌గా గుర్తింపు పొందిన భారతరత్న ఏపిజె అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా నివాళి అర్పిస్తున్నాను అంటూ సిఎం పోస్ట్ చేశారు. తన నిరాడంబరత, నిజాయితీ, మానవతా దృక్పథం వంటి విశిష్ట లక్షణాలతో ప్రజల రాష్ట్రపతిగా కలాం పిలువబడ్డారు. ఆ మహనీయుని వర్ధంతి సందర్భంగా స్మృతికి నివాళి అర్పించారు. డాక్టర్ ఏపిజె అబ్దుల్ కలాం ఒక జాతి భవిష్యత్తును తీర్చిదిద్దుతూనే ఉన్న ఒక దార్శనికతను వదిలి వెళ్లారని డిప్యూటీ సిఎం పవన్ 'ఎక్స్' ఖాతాలో అన్నారు. ఆయన వర్ధంతి సందర్భంగా, భారతరత్న డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాంకు వినయపూర్వక నివాళి అర్పించారు. ఆయన భారత క్షిపణి మానవుడు ఇస్రో, డిఆర్‌డిఒ ద్వారా భారతదేశ అంతరిక్ష, రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేసిన ప్రముఖ శాస్త్రవేత్త, భారతదేశ 11వ రాష్ట్రపతి, స్ఫూర్తిదాయకమైన ఉపాధ్యాయుడు, ఆధునిక భారతదేశపు గొప్ప జాతి నిర్మాతలలో ఒకరు అంటూ పవన్ కళ్యాణ్ కొనియాడారు. ఆధునిక భారతదేశపు గొప్ప జాతి నిర్మాతలలో ఏపిజె ఒకరని పవన్ అన్నారు.

## సిఆర్‌పిఎఫ్ జవాన్లకు డి.సిఎం శుభాకాంక్షలు



**విజయవాడ, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** సిఆర్‌పిఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్‌కు చెందిన ధైర్యవంతులైన జవాన్లకు డి.సిఎం పవన్ కళ్యాణ్ శుభాకాంక్షలు తెలియజేశారు. "దేశం చూసే ప్రతి శాంతియుత సూర్యోదయం.. చీకటి వేళల్లోనూ మెలకువగా ఉండే జవాన్ల ధైర్యంతో భద్రంగా ఉంటున్నారు. వారి అచంచలమైన ధైర్యం, సాటిలేని క్రమశిక్షణ, నిస్వార్థ సేవ భారతదేశ అంతర్గత భద్రతకు ఒక శాశ్వతమైన స్తంభంగా నిలిచాయి. ఉగ్రవాదంతో పోరాడటంలో, వామపక్ష తీవ్రవాదాన్ని ఎదుర్కోవడంలో, ప్రజాస్వామ్య సంస్థలను పరిరక్షించడంలో, ప్రకృతి వైపరీత్యాలకు స్పందించడంలో, లేదా సంక్షోభ సమయాల్లో పౌరులను రక్షించడంలో అయినా సిఆర్‌పిఎఫ్ ఎల్లప్పుడూ అసాధారణ శౌర్యంతో దేశం పట్ల అచంచలమైన నిబద్ధతతో ముందు వరుసలో నిలిచింది. ప్రతి యూనిఫాం త్యాగానికి ప్రతీక. ప్రతి మిషన్ స్వార్థానికి అతీతమైన కర్తవ్యాన్ని ప్రతిబింబిస్తోంది. ప్రతి ధైర్యసాహసాల చర్య దేశ విశ్వాసాన్ని, ఐక్యతను బలపరుస్తోంది. ధైర్యవంతులైన సిఆర్‌పిఎఫ్ సిబ్బంది కుటుంబాలకు వందనం. వారి నిశ్శబ్ద త్యాగాలు, స్థిరమైన మద్దతు ప్రతి సిఆర్‌పిఎఫ్ యోధుని సంకల్పాన్ని బలపరుస్తాయి" అని ఎక్స్‌లో పవన్ కళ్యాణ్ పోస్ట్ చేశారు.

## ముర్రం శివాని బలవన్మరణం తీవ్ర విషాదంలోకి నెట్టేసింది: సిఎం చంద్రబాబు

**విజయవాడ, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** ముర్రం శివాని తనువు చాలించడం తీవ్ర విషాదంలోకి నెట్టేసిందని సిఎం చంద్రబాబు తెలిపారు. మెగా పిటిఎం వేదికపై ఉత్సాహంగా మాట్లాడిన శివాని బలవన్మరణం ఆవేదన కలిగించిందని 'ఎక్స్' వేదికగా అన్నారు. 'ఆరోజు తన చదువు, ఉన్నత లక్ష్యాలపై శివాని చెప్పిన మాటలు గుర్తుకొస్తున్నాయి. ఎంతో భవిష్యత్ ఉన్న గిరిజన బిడ్డ ఇలా తనువు చాలించడం బాధాకరం. కారణాలు ఏమైనా తన కలలు నిజం కాకుండానే విద్యార్థిని దూరమవడం కలచివేస్తోంది. శివాని మృతిపై పూర్తి దర్యాప్తు జరపాలని అధికారులను ఆదేశించారు సమస్యలు, కష్టాలు వచ్చినా విద్యార్థులు, యువత ధైర్యంగా నిలబడాలి. ఎవరూ ఒత్తిడి, నిరాశ, నిస్పృహలకు లోనుకావొద్దని కోరుతున్నా. ఎంతటి సమస్యకైనా పరిష్కారం ఉంటుంది. మీ బాధ, ఆవేదనను మీ కుటుంబసభ్యులు, స్నేహితులతో పంచుకోండి. ఒత్తిడిని అధిగమించి మీ కలలను నిజం చేసుకునేలా ముందుకు సాగండి. ప్రభుత్వం అన్నివిధాలుగా అండగా ఉంటుందని తెలియజేస్తున్నా" అని సిఎం చంద్రబాబు అన్నారు. శివాని మృతి పట్ల దిగ్భ్రాంతికి లోనవుతున్నట్లు చంద్రబాబు తెలిపారు.

## శివానీ మృతిపై విచారణ జరిపించాలి: సిపిఎం

**విజయవాడ, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** రంపచోడవరం మండలం ఇర్లపల్లి కొత్త కాలనీకి చెందిన గిరిజన విద్యార్థిని ముర్రం శివానీ (15) అకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతిని, విచారాన్ని కలిగించిందని సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. శివానీ మృతి అత్యంత బాధాకరమని, వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. నిన్నటివరకు ముఖ్యమంత్రితో సహా అందరి చేత ప్రశంసలు పొంది, ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచిన ఒక విద్యార్థిని ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడటం అనేక అనుమానాలకు, ప్రశ్నలకు తావిస్తోంది. చిన్నారిని ఆత్మహత్యకు పురికొల్పిన పరిస్థితులు ఏమిటి? ఆమె ఎదుర్కొన్న మానసిక ఒత్తిడికి కారణాలు ఏమిటి? అనే అంశాలపై సమగ్రంగా, నిష్పాక్షికంగా ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. శివానీ కుటుబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. ఆ కుటుంబానికి తక్షణమే రూ. 25 లక్షల పరిహారం అందించాలనీ వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

## శివానీ మృతిపై సమగ్ర దర్యాప్తు జరపాలి: సిపిఐ

**విజయవాడ, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** గిరిజన విద్యార్థిని ముర్రం శివానీ (15) మరణంపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు జరిపించి, ఆత్మహత్యకు గల కారణాలను వెలికితీయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. విద్యార్థిని ముర్రం శివానీ అకస్మాత్తుగా ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడి, మరణించడం కలచివేసింది. శివానీ మృతిపట్ల ప్రగాఢ సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. ముర్రం శివానీ మరణం ఒక ప్రశ్నగా మిగిలిపోకూడదు. శివానీని ఆత్మహత్యకు పురిగొల్పిన పరిస్థితులు, మానసిక సంఘర్షణకు గల కారణాలను కనుగొనేలా రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించి, నిజానిజాలు వెలికితీయాలని డిమాండ్ చేశారు.

## సెప్టెంబర్‌లో జిఎన్‌యం సప్లిమెంటరీ పరీక్షలు

**విజయవాడ, జులై 27 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని జిఎన్‌యం విద్యార్థులకు సెప్టెంబర్ నెలలో సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు వైద్యవిద్య సంచాలకులు డాక్టర్ ఏ.విష్ణువర్ధన్ సోమవారం ఒకప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ బోర్డు ఆధ్వర్యంలో జరుగనున్న ఈపరీక్షలకు అర్హులైన విద్యార్థులు సంబంధిత ప్రభుత్వ, ప్రయివేటు కళాశాలల ప్రిన్సిపాళ్ళ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, పరీక్షల షెడ్యూల్ పూర్తి వివరాలకు వెబ్‌సైట్‌ను సందర్శించాలని వైద్యవిద్య సంచాలకులు డాక్టర్ ఏ.విష్ణువర్ధన్ సూచించారు.

# డిఎస్సీ ఆరోపణలపై చర్చకు సిద్ధం

- వైసిపి హయాంలో లిక్కర్, భూకుంభకోణాలపై కూడా చర్చిద్దాం
- అభివృద్ధి - సంక్షేమం మా సిద్ధాంతం, విధ్వంసం, బూతులు గొడ్డలిపార్టీ విధానం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో నూరుశాతం విజయమే లక్ష్యంగా కేడర్ పనిచేయాలి
- పెనమలూరు నియోజకవర్గ టిడిపి కార్యకర్తల సమావేశంలో మంత్రి నారా లోకేష్





**విజయవాడ, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** డిఎస్సీపై గొడ్డలి పార్టీ అధినేత చేస్తున్న ఆరోపణలపై చర్చకు తాను సిద్ధం అని తెలుగుదేశం పార్టీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ జగన్‌కు సవాల్ విసిరారు. కంకిపాడు ఆయాన్ కన్వెన్షన్ సెంటర్‌లో సోమవారం నిర్వహించిన పెనమలూరు అసెంబ్లీ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో నారా లోకేష్ మాట్లాడుతూ డిఎస్సీపై ఆరోపణలతోపాటు వైసిపి హయాంలో లిక్కర్ భూ కుంభకోణాలపై కూడా చర్చకు తాను సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. 2లక్షల టీచర్ పోస్టులు భర్తీచేసిన చరిత్ర టిడిపిది అని, ఐదేళ్ల వైసిపి హయాంలో ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయలేని నీచ చరిత్ర జగన్‌ది అని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వర్టికల్, హారిజంటల్ రిజర్వేషన్లను అమలుచేసి అత్యంత పారదర్శకంగా డిఎస్సీ నిర్వహిస్తే బురద జల్లుతున్నారు, 150రోజుల్లో విజయవంతంగా డిఎస్సీ నిర్వహిస్తే 150కేసులు వేసి అడ్డుకోవాలని చూశారు, వారు వేసిన కేసులన్నీ న్యాయస్థానాలు కొట్టివేయడం మా చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. ఆర్థిక ఇబ్బందులున్నా అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెద్దుల బండిలా ముందుకు తీసుకెళ్తున్నామని, వీటన్నింటినీ పార్టీ కేడర్ ప్రజల్లోకి తీసుకెళ్లాలని లోకేష్ కోరారు. ఇంటింటికీ తెలుగుదేశం (డోర్ టు డోర్) కార్యక్రమం ద్వారా పార్టీ ఇచ్చిన కార్యక్రమాలను పట్టుదల, క్రమశిక్షణతో అమలుచేయాలని కోరుతున్నా. గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, గొడ్డలి పార్టీ విధ్వంసం, ఫేక్ ప్రచారాలను ప్రజలకు వివరించాలి. టిడిపి, బిజెపి, జనసేన కార్యకర్తల మధ్య ఐక్యత చాలా అవసరం. నాయకులు, కార్యకర్తలంతా రాష్ట్రంలోని ప్రతి గడప తొక్కాలి అని పార్టీ శ్రేణులకు మంత్రి లోకేష్ పిలుపునిచ్చారు.

**బిళ్ల సత్యనారాయణను పరామర్శించిన మంత్రి లోకేష్**

పెనమలూరు మండలం గోసాలలోని వేణుగోపాలస్వామి నగర్‌లో నివాసం ఉంటున్న టిడిపి సీనియర్ కార్యకర్త బిళ్ల సత్యనారాయణను పరామర్శించారు. పార్టీ ఆవిర్భావం నుంచి తెలుగుదేశం పార్టీలో అంకితభావంతో బిళ్ల సత్యనారాయణ పనిచేస్తున్నారు. పార్టీ పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమానికి పసుపు రంగు చొక్కా ధరించి, తన ద్విచక్ర వాహనంపై టిడిపి జెండాతో హాజరవుతూ గుర్తింపుపొందారు. గత మూడేళ్లుగా కిడ్నీ వైఫల్యంతో బాధపడుతున్నారు. చిన్న కిరాణషాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న ఆయనకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె అనారోగ్య సమస్యల కారణంగా మరణించగా చిన్న కుమార్తె ఇటీవల భర్తను కోల్పోయి తన పిల్లలతో కలిసి తల్లిదండ్రుల వద్ద నివసిస్తున్నారు. ఈ నేపథ్యంలో వారి నివాసానికి వెళ్లిన మంత్రి నారా లోకేష్, బిళ్ల సత్యనారాయణ, ఇతర కుటుంబ సభ్యులతో మాట్లాడారు. బిళ్ల సత్యనారాయణ ఆరోగ్య పరిస్థితిని, కుటుంబ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ బాధ్యత తాను తీసుకుంటానని, అన్ని విధాల అండగా ఉంటానని మంత్రి వారికి హామీ ఇచ్చారు.

# డిఎస్సీపై గొడ్డలి పార్టీ అబద్ధాలు

- సమైక్యాంధ్ర, నవ్యాంధ్రలో ఉపాధ్యాయ ఉద్యోగాల సృష్టికర్త చంద్రబాబు
- 9 డిఎస్సీలతో 1.80 లక్షల ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ ఘనత బాబుదే
- డిఎస్సీ ఎందుకు పెట్టలేదో వైసిపి నేతలు జగన్‌నే అడగాలి
- డిఎస్సీపై బొత్స కామెంట్లు వెనక్కు తీసుకోవాలి: మంత్రి కొండపల్లి శ్రీనివాస్



**విజయనగరం, జులై 27 ప్రభాతవార్త:** గొడ్డలి పార్టీ అవాస్తవాలతో కూటమి ప్రభుత్వాన్ని బద్నాం చేస్తూ, యువతలో అపోహలు సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ విమర్శించారు. డిఎస్సీపై వైసిపి నేతల ఆరోపణలు, మంగళవారం తలపెట్టిన ధర్నా నేపథ్యంలో మంత్రి సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ సమైక్యాంధ్రలోనూ, నవ్యాంధ్ర లోనూ ఉపాధ్యాయ ఉద్యోగాల సృష్టికర్త అంటే చంద్రబాబు ఒక్కరే అని ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 9 డిఎస్సీలతో 1.80 లక్షలకు పైగా ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేశారని మంత్రి కొనియాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మెగా డిఎస్సీపై తొలి సంతకం పెట్టి ఆరు నెలల్లోనే 16 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసిన ఘనత కూడా చంద్రబాబుకే దక్కిందన్నారు. డిఎస్సీపై వైసిపి ప్రభుత్వం 230కి పైగా కేసులు వేసినా ప్రభుత్వం ఆన్సర్ షీట్లు, ఫలితాలు, ఎంపిక అన్ని విషయాలు ఆన్‌లైన్‌లో పొందుపరిచి తన పారదర్శకత నిరూపించుకుందన్నారు. గత ప్రభుత్వం 8 వేల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఒక్క డిఎస్సీ కూడా నిర్వహించలేక నిరుద్యోగులు, యువతను మోసం చేసిందని దుయ్యబట్టారు. ఐదేళ్ల పాలనలో ఒక్క డిఎస్సీ నిర్వహించని జగన్‌ను వైసిపి నేతలు ఎందుకు? ప్రశ్నించడం లేదని మంత్రి వైసిపి నేతలకు చురకలు అంటించారు. కూటమి ప్రభుత్వం వచ్చాకే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డులు వస్తున్నాయని, ఈ ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలల విద్య ఏ స్థాయిలో ఉందో చెప్పేందుకు నిదర్శనం అన్నారు.

**బొత్స కామెంట్లకు మంత్రి కొండపల్లి చురకలు:** డిఎస్సీపై బొత్స కామెంట్లకు మంత్రి కొండపల్లి చురకలు అంటించారు. గతంలో విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన బొత్స గౌరవ ప్రదంగా తన స్థాయికి తగినట్టుగా మాట్లాడాలని మంత్రి కొండపల్లి హితవు పలికారు. వోక్స్‌వ్యాగన్ లావాదేవీలతో బొత్స రాష్ట్రానికి పెద్ద మచ్చ తేవడంతోనే ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు మహారాష్ట్రకు వెళ్లిందని విమర్శించారు. గత డిఎస్సీలో విజయనగరం జిల్లాలో 583 మందికి ఉపాధ్యాయ ఉద్యోగాలు వచ్చాయని, డిఎస్సీ పరీక్ష ఎంత పారదర్శకంగా జరిగిందో బొత్స ఆ ఉపాధ్యాయులను అడిగితే చెపుతారన్నారు. బొత్స తక్షణమే డిఎస్సీపై చేసిన కామెంట్లను వెనక్కు తీసుకోవాలని మంగళవారం వైసిపి ధర్నా చేస్తే ఉపాధ్యాయులు, నిరుద్యోగులు వాళ్లనే ఛీ కొడతారని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వంలో ఒక్క డిఎస్సీ పరీక్ష కూడా ఎందుకు నిర్వహించలేదన్న ప్రశ్నకు బొత్స ఏమని సమాధానం చెపుతారని మంత్రి ప్రశ్నించారు.

# రాష్ట్రం, ప్రజల గురించే సిఎం చంద్రబాబు తపన

- కుటుంబం గురించి ఆలోచించరు.. అభివృద్ధికి చర్యలు
- ప్రభుత్వం ప్రజల ఇంటి గడప తొక్కుతోంది
- ప్రజలు కూటమి ప్రభుత్వంతో చేయి కలపాలి
- సిఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి



రామకుప్పం మండలం ననియాలతో మహిళలనుద్దేశించి ప్రసంగిస్తున్న నారా భువనేశ్వరి

**కుప్పం, జులై 27 ప్రభాతవార్త:** సిఎం చంద్రబాబు నాయుడు నిత్యం రాష్ట్రం, రాష్ట్ర ప్రజల గురించే తపన పడుతుంటారని కుటుంబం గురించి ఆలోచించరని సిఎం చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి పేర్కొన్నారు. నాలుగు రోజుల కుప్పం పర్యటనలో భాగంగా సోమవారం నారా భువనేశ్వరి రామకుప్పం మండలం కావలి మడుగు గ్రామంలో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంను ప్రారంభించారు. ననియాల, పిఎంకె తాండా, ప ద్యాలమడుగు, రామకుప్పం గ్రామాల్లో పర్యటించి మహిళలు, ప్రజల నుద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా నారా భువనేశ్వరి మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్న సమయంలో సిఎం చంద్రబాబు విజన్ 2020తో ఐటి రంగాన్ని అభివృద్ధి చేశా రన్నారు. నేడు రాష్ట్ర విభజన అనంతరం ప్రతి నియోజకవర్గం అభివృద్ధికి చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. వైజాగ్ ఐటి హబ్‌గా, అనంత పురం ఆటో మొబైల్ హబ్‌గా రూపుదిద్దుకుంటు న్నాయని చెప్పారు. కుప్పానికి సైతం ముప్పై పరిశ్రమలు తీసుకువచ్చారన్నారు. 732కి.మీ.ల దూరంలో ఉన్న కృష్ణాజలాలను రూ.3600 కోట్ల ఖర్చుతో కుప్పానికి తెచ్చారని పేర్కొన్నారు. నదుల అనుసంధానంతో అన్ని ప్రాంతాలకు సాగు, తాగునీరు అందిస్తున్నారన్నారు.

**వైఎస్సార్సీ పాలనలో నోరు తెరవలేని దుస్థితి:** ఐదేళ్ల వైఎస్సార్సీ పాలనలో ప్రజలు నోరుతెరవలేని దుస్థితి నెలకొనడంతో పాటు ఎవరు ఉంటారో ఎవరు పోతారో తెలియని పరిస్థితి ఉండేదని నారా భువనేశ్వరి పేర్కొన్నారు. ఐదేళ్లలో అరాచకాలు చేశారని ఈ విషయం ప్రజలు గుర్తించే సిఎం చంద్రబాబుపై విశ్వాసంతో గెలిపించారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సిఎం చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలు ఎన్టీఆర్ భరోసా, దీపం 2, స్త్రీశక్తి, అన్నదాత సుఖీభవ, తల్లికివందనం పథకాలు అమలు చేస్తున్నారన్నారు. పేదల ఆకలి తీర్చేందుకు అన్నక్యాంటీన్లు ప్రారంభించామన్నారు. తాను కష్టపడతానని సంపద సృష్టించి ప్రజలకు పంచుతానని సిఎం చంద్రబాబు పేర్కొంటుంటారన్నారు.

**ప్రజలు ప్రభుత్వంతో చేయి కలపాలి:** ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం ప్రజల ఇంటి గడప తొక్కుతోందని ప్రజలు కూడా ప్రభుత్వంతో చేయి కలపాలని నారా భువనేశ్వరి పిలుపు నిచ్చారు. నలభై సంవత్సరాలుగా సిఎం చంద్రబాబుకు ఓట్లేసి నాలుగుసార్లు ముఖ్యమంత్రిని చేసిన కుప్పం ప్రజలకు తాను చంద్రబాబు భార్యగా మరువనని పేర్కొన్నారు. కుప్పం ప్రజలంటే సిఎం చంద్రబాబుకు ఎంతో అభిమానం అన్నారు. కుప్పాన్ని మరింత అభివృద్ధి చేసి టూరిజం చిత్రపటంలో కుప్పానికి స్థానం కల్పిస్తారని పేర్కొన్నారు. అంతకుముందు గ్రామాల్లో నారా భువనేశ్వరికి మహిళలు మంగళహారతులతో ఘనస్వాగతం పలికారు. నారాయణపురం తాండాలో దివంగత ఎన్టీఆర్ విగ్రహాన్ని నారా భువనేశ్వరి ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, ఆర్టీసీ వైస్‌చైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, సిఎం పిఎ శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు, రెస్కో ఛైర్మన్ ప్రతాప్, మండల పార్టీ అధ్యక్షుడు వెంకటరమణ, మాజీ అధ్యక్షులు ఆనందరెడ్డి, ఆంజనేయరెడ్డి, నేతలు పట్ర నారాయణ, కృష్ణానాయక్, మనోహర్, రఫీ, చంద్రారెడ్డి

## ఎసిలో 1000 'మీ మార్ట్స్'

- ఎన్‌సిసిఎఫ్‌తో పౌరసరఫరాల శాఖ కీలక ఒప్పందం



మంత్రి నాదెండ్ల సమక్షంలో కేంద్ర ప్రభుత్వ నేషనల్ కోఆపరేటివ్ కన్స్యూమర్ ఫెడరేషన్‌తో పౌర సరఫరాల శాఖ ఎంఒయు చేసుకున్న దృశ్యం

**విజయవాడ, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రజలకు నాణ్యమైన నిత్యావసర వస్తువులను సరసమైన ధరలకు అందించేందుకు ఎపి ప్రభుత్వం కీలక కార్యాచరణకు ఉపక్రమించింది. కేంద్ర ప్రభుత్వ నేషనల్ కోఆపరేటివ్ కన్స్యూమర్ ఫెడరేషన్‌తో ఎపి పౌర సరఫరాల శాఖ కీలక అవగాహన ఒప్పందం (ఎంఒయు) కుదుర్చుకుంది. ఢిల్లీలో పౌర సరఫరాల కమిషనర్ కన్నబాబు ఎన్‌సిసిఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ అనీస్ జోసెఫ్ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం, రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1,000 'మీ మార్ట్స్' ఏర్పాటు చేయనున్నారు. తొలి దశలో పల్నాడు, గుంటూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో ఈ సేవలను ప్రారంభించనున్నారు. రేషన్ దుకాణాల ద్వారానే 'మీ మార్ట్స్' సేవలను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ మార్ట్స్‌లో 70రకాల నాణ్యమైన వినియోగ వస్తువులు పోటీ ధరలకు విక్రయించనున్నారు. ప్రజలకు నాణ్యమైన వస్తువులను సరసమైన ధరల్లో అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 1,000 'మీ మార్ట్స్' ఏర్పాటు ద్వారా వినియోగదారులకు మరింత ప్రయోజనం చేకూరనుంది. ఈ సమాచారాన్ని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తన 'ఎక్స్' ఖాతాలో వెల్లడించారు.

## కృష్ణా జలాల్లో వాటాపై సుప్రీంలో విచారణ


- కర్ణాటక విజ్ఞప్తిని తిరస్కరించిన ధర్మాసనం

**విజయవాడ, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** కృష్ణా జలాల్లో వాటాకు సంబంధించి బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పును సవాల్ చేస్తూ ఎపి ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం కేసును పరిశీలించింది. సుదీర్ఘ విచారణ చేయాల్సి ఉన్నందున ఈ కేసును ప్రత్యేక బెంచ్ ముందు విచారణకు నివేదిస్తామని వెల్లడించింది. అనంతరం తదుపరి విచారణను సెప్టెంబర్ మొదటి వారానికి వాయిదా వేసింది. ఈలోగా తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేయాలంటూ కర్ణాటక ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని సుప్రీంకోర్టు తిరస్కరించింది. మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాల్సిన అవసరం లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. కృష్ణా నదీ జలాల వాటాలపై బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పుపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ట్రిబ్యునల్ తీర్పును కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేయకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ఎపి ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పైనే ప్రస్తుతం సుప్రీంకోర్టులో విచారణ కొనసాగుతోంది.

## బిజెపి మైనారిటీ మోర్చా కార్యవర్గ సమావేశం

**విజయవాడ, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** బిజెపి రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర మైనారిటీ మోర్చా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అన్ని మతాలు ఒకటిగా ఉండాలని అన్నారు. రామజన్మ భూమి అంశాన్ని హిందూ- ముస్లిం కోణంలో చూడొద్దని మాధవ్ పేర్కొన్నారు. మత సమభావన అనేది మా సిద్ధాంతమని, వివక్ష లేని పాలన అందిస్తున్నామని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ అన్నారు.

## 15 మంది బాధితులకు సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు



**విజయవాడ, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** అనారోగ్య సమస్యలతో ఆర్థిక సహాయం కోసం ఎదురు చూస్తున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సహాయం అందించేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవ తీసుకున్నారు. ఉప ముఖ్యమంత్రి కార్యాలయానికి వచ్చిన సిఎంఆర్‌ఎఫ్ అర్జీలను స్వయంగా పరిశీలించి ప్రత్యేక సాయం అందేలా చూశారు. సోమవారం మధ్యాహ్నం మంగళగిరి జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను శాసనమండలిలో ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాసరావు 15 మంది బాధితులకు రూ.12.78 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు బాధితులు తమ క్లిష్ట సమయంలో ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయానికి, తమ సమస్యలను గుర్తించి స్పందించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# పిహెచ్‌సిల పనితీరుకు 'ఆరోగ్య ఫలితాలే' ప్రామాణికం: మంత్రి సత్యకుమార్

**విజయవాడ, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరు మదింపులో కూటమి ప్రభుత్వం సమూల మార్పులకు శ్రీకారం చుట్టింది. ఎంతమంది రోగులకు సేవలు అందించారు? ఎన్ని పరీక్షలు చేశారు? ఎన్ని ప్రసవాలు నిర్వహించారు? అనే లెక్కలను మాత్రమే కాకుండా అందించిన వైద్య సేవల వల్ల ప్రజల ఆరోగ్యంలో ఎంత మార్పు వచ్చింది? మాతా శిశు మరణాలు తగ్గాయా? రక్తపోటు, మధుమేహ రోగులకు నిరంతర చికిత్స అందుతోందా? లేదా? సేవలపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారా? అనే ఫలితాల ఆధారంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరును గుర్తించనున్నారు.

ఇందుకోసం మొత్తం 21 కీలక పనితీరు సూచికలతో కొత్త ర్యాంకింగ్, గ్రేడింగ్ విధానాన్ని ప్రభుత్వం రూపొందించింది. సంజీవని. మాతృత్వ, క్షేమ కార్యక్రమాలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరును అనుసంధానిస్తూ గ్రామస్థాయి వైద్య వ్యవస్థను మరింత జవాబుదారీగా, ఫలితాల ఆధారితంగా, ప్రజలకు చేరువగా తీర్చిదిద్దడమే ఈ కొత్త ర్యాంకింగ్ విధానం ప్రధాన లక్ష్యమని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఒక ప్రకటనలో వెల్లడించారు.

**ఐదు అంశాల పరిమితికి స్వస్తి**

ప్రస్తుతం 5 అంశాల ఆధారంగానే వైద్యారోగ్య శాఖ ర్యాంకులను ప్రకటిస్తోంది. ఓపీ విధానంలో రోగుల సంఖ్య, ఆసుపత్రిలో చేరినవారు, ల్యాబ్ పరీక్షలు, ప్రసవాలు, గర్భనిరోధక సాధనాల వాడకం వంటి ఐదు అంశాల ఆధారంగానే పిహెచ్‌సిల పనితీరును అంచనా వేసేవారు. ఈ విధానంలో సేవల సంఖ్య మాత్రమే తెలుస్తోందని, వ్యాధుల నివారణలో సాధించిన పురోగతి, మాతా శిశు ఆరోగ్య ఫలితాలు, దీర్ఘకాలిక వ్యాధుల నియంత్రణ, రోగులకు నిరంతర చికిత్స వంటి కీలక అంశాలు ప్రతిబింబించడం లేదని అధికారుల పునస్సమీక్షలో తేలింది.

ఈ విధానం అమలు, ఫలితాలపై రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ జారీ చేసిన ఆదేశాల మేరకు అధికారులు పునస్సమీక్ష జరిపారు. సేవలు మెరుగుపడాలంటే 21 కొలమానాల ఆధారంగా ర్యాంకులను ప్రకటించాల్సిన అవసరం ఉందని మంత్రికి నివేదించారు. వీటికి మంత్రి ఆమోదం తెలుపుతూ గ్రామీణులకు వైద్య సేవలు అందించడంలో కీలకంగా ఉండే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరు ఈ కొత్త ర్యాంకింగ్ విధానంతో మరింత మెరుగుపడుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

పిహెచ్‌సిల్లో వైద్య సేవలు పొందిన ప్రజలు ఐవిఆర్‌ఎస్ ద్వారా తెలియజేసే అభిప్రాయాన్ని కూడా ర్యాంకింగ్‌లో భాగం చేశారు. "నెలనెలా ర్యాంకులు ప్రకటించడం ద్వారా వెనుకబడిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను వెంటనే గుర్తించి లోపాలను సరిదిద్దుతాం. ఈ కొత్త ర్యాంకింగ్ విధానాన్ని అమలు ప్రక్రియను ప్రారంభించాం" అని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కార్యదర్శి ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జి.వీరపాండియన్ తెలిపారు.

28-7pg4_28-7pg4.qxd 27/Jul/26 10:53 PM Page 1



వార్త

తెలివిగల వ్యక్తి తన ఆర్థిక విషయాలను, మానసిక సంఘర్షణలను, గృహసంబంధమైన విషయాలను ఎప్పుడూ రహస్యంగానే ఉంచుతాడు.

న- శామ్యూల్ జాన్సన్

# 'జై యువ'తకు సెల్యూట్!


ఎవరు అన్నా అనకున్నా ఇప్పుడు భారతీయ యువత తను అభినందించాల్సిన పరిణామాలే తారసపడుతున్నాయి. ఓ పక్కజీవితాల్లో వెలుగులు నింపాల్సిన ప్రభుత్వాలు ఇన్నాళ్లూ వారి వారి సొంత ఎజెండాలతో కాలక్షేపం చేసేస్తాయి. కొత్త తరపు ఆలోచనలను ఎవరైనా, ఎప్పుడైనా స్వాగతించవలసిందే. యువత తమ భవిత కోసం రోడ్డెక్కితే వారిని ఏలిన వారికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేస్తున్నారన్న భావనతో విదేశీ నిధులు వస్తున్నాయనో, వారి వెనుక ఉండి ఎవరో నడిపిస్తున్నారనో ఒకవర్గం సామాజిక మాధ్యమాల్లో ఊదరగొడుతున్నాయి. అంటే ప్రశ్నించే వారు ఉండకూడదనేది వారి ఆంతర్యమా!? ప్రశ్నిస్తే తప్పా? మరెందుకలా ఉద్యమకారులపై బురద జల్లి యువత గొంతు నొక్కాలన్న ప్రయ్నత్న మంచిది కాదేమో? ఉద్యమకారుల్లో గత రాజకీయ నేపథ్యం ఉండడం నేరమా? వాళ్ళకి సిద్ధాంతాలు ఉండవా? ఉండకూడదా? అయినా యువ చైతన్యాన్ని ఎవరూ ఆపలేకపోయారు. నిజానికి అతి చిన్న వయసులోనే ఈ తరం యువత పరిణితి చెందారు. ఎన్నో విషయాలపై అవగాహన పెంచుకొని పట్టుసాధిస్తున్నారు. వాళ్లల్లో మేధాశక్తికి కొదువ లేదు. వారికి అనుభవం తక్కువని అనుకోవాలి తప్ప కొత్త తరంలో మానసిక పరివర్తనను ఏమాత్రం తక్కువ చేయలేం. వీధుల్లోకి వచ్చిన యువత ఆగ్రహం ఒక్క పరీక్ష గురించో, ఒక్క మంత్రి రాజీనామా గురించో కాదు. అది చాలా కాలంగా విద్యావ్యవస్థపై పేరుకుపోయిన అసంతృప్తి. తమ చదువుకు విలువ ఉందో లేదో? ఉద్యోగం వస్తుందో రాదో? భవిష్యత్తు ఎలా ఉంటుంది? అనే ఆందోళన. కాక్రోచ్ జనతా పార్టీ నేతృత్వంలో జరిగిన 'నీట్' ఉద్యమాన్ని ప్రభుత్వం గుర్తించి వారి ఆకాంక్షలపై సానుకూలంగా స్పందించడం, తమకు తమ భవితవ్యమే తప్ప ఈ దేశ రాజకీయాలతో సంబంధం లేదని చెప్పడంలో యువత విజ్ఞత చెప్పుకోదగినది. అందుకే యువత వైఖరితో యావత్తు భారత దేశం ఊపిరిపీల్చుకున్నది. ప్రపంచంలోనే అతిపెద్ద యువదేశం భారత్ . 2026 నాటికి భారత జనాభాలో 65 మంది 35 ఏళ్లలోపు వారు. 15-29 ఏళ్లమధ్య ఉన్న యువత 25కోట్లకు పైగా ఉంది. ప్రపంచంలోని ప్రతి 5గురు యువకుల్లో ఒకరు భారతీయుడు. దీన్నే 'యూత్ బల్జ్ లేదా డెమోగ్రాఫిక్ డివిడెండ్' అంటారు. యువత ఎక్కువ, వృద్ధులు తక్కువ ఉన్నప్పుడు పని చేసే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. దీనివల్ల ఉత్పత్తి, పొదుపు, పెట్టుబడి పెరుగుతాయి. 2026-2047 వరకు ఇదే భారత్ వికసిత్ భారత్‌గా మారేందుకు స్వర్ణావకాశం. జపాన్, చైనా, యూరప్ వృద్ధుల దేశాలుగా మారుతున్నాయి. 2030 నాటికి ప్రపంచానికి 12 కోట్ల మంది పనివారు కావాలి. ఆ ఖాళీని భారత యువత మాత్రమే భర్తీ చేయగలదు. భారత యువత ప్రపంచంలోనే అత్యంత ధైర్యవంతులు, ఆశావాదులు, టెక్ సావీ.వారికి సరైన విద్య, నైపుణ్యం, అవకాశం ఇస్తే వారు 'వికసిత్ భారత్'ని నిర్మించడమే కాదు, ప్రపంచాన్నే నడిపిస్తారు. ప్రతి ఏడాది కోటికి పైగా యువత డిగ్రీలు పూర్తి చేసి ఉద్యోగ మార్కెట్లోకి వస్తున్నారు. 2023-24లో సుమారు 1.1 కోట్ల మంది, 2024-25లో దాదాపు 1.2 కోట్ల మంది గ్రాడ్యుయేట్లు బయటకు వచ్చారు. కానీ వారందరికీ ఉద్యోగాల వేటలో తలపండిపోతోంది ఫలితం శూన్యం. 2000 నుంచి 2010 మధ్య దేశంలో ప్రతి ఏడాది సగటున రెండున్నర కోట్లమంది పిల్లలు జన్మించారు. ఆ తరం ఇప్పుడుఉపాధి కోసం బయటకు వస్తోంది. రాబోయే మరో 15 నుంచి 20 సంవత్సరాల పాటు ఇదే పరిస్థితి కొనసాగుతుంది. ఆర్థికవేత్తలు దీనినే "డెమోగ్రాఫిక్ డివిడెండ్"లేదా 'యూత్ బల్జ్' అంటారు. ఇది ఏ దేశానికైనా ఒక్కసారి మాత్రమే దక్కే అవకాశం. 2050 నాటికి ఈ అవకాశం క్రమేపీ ముగుస్తుంది.అంటే మరో పాతికేళ్లే భారత్ భవిష్యత్తును నిర్ణయిస్తాయి. ప్రతి ఏడాదిసంక్షేమ పథకాల కోసం లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న కేంద్ర, రాష్ట్ర విద్య, నైపుణ్యాభివృద్ధి, పరిశోధన, తయారీరంగం, చిన్న పరిశ్రమలపై కూడా భారీ పెట్టుబడులు పెట్టాల్సిన సమయం వచ్చింది. యువత ఉచితాలు కోరుకోవడం లేదు. భారత్ ప్రపంచంలోనే అగ్రశ్రేణి ఆర్థికశక్తిగా నిలిపేయువతమనకు సొంతం.'జెన్ జి' ఉద్యమ స్పందనతో యువశక్తిని సరైన దారిలో నడిపించి దేశభవితలో వారిని అనుసంధానం చేయాల్సిన అవసరం ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక ప్రత్యేక సందర్భంలో అభిప్రాయపడ్డారు. 'జై జవాన్', 'జై కిసాన్' లతో ముందుకుకెళ్తున్న కాంగ్రెస్ పార్టీ 'జై యువ' నినాదాన్ని కలుపుకొనిముందుకెళ్తున్నట్లు ప్రకటించారు. అందరికీ విద్య అందుబాటులోకి వచ్చినందున 21ఏళ్ల వయసుకే ఐఎఎస్, ఐపిఎస్‌లు అవుతున్నారు. అదేదారిలో యువతను పార్లమెంట్ తదితర చట్టసభల్లో భాగస్వాములు అయ్యేందుకు వీలుగాఎన్నికల్లో పోటీ చేసే వయసును తగ్గించే అంశంపైచర్చ పూర్తిస్థాయిలో కొనసాగాలని అభిలషించారు. అసెంబ్లీ, లోక్‌సభకు పోటీచేసే వయసు 21 సంవత్సరాలకు, రాజ్యసభ, శాసనమండలికి పోటీ చేసే వయసు 25 సంవత్సరాలకు తగ్గించాలని ప్రధానికి విజ్ఞప్తి చేశారు. యువతకు ఉద్యమాలతో పనిలేకుండా వారి ఆకాంక్షలను నెరవేర్చగలిగితే వారిలో అసంతృప్తి దూరమవుతుంది. యువతకు రాజకీయ నాయకత్వ అవకాశాలు ఇవ్వడమే కాదు ప్రజాసేవపట్ల నిబద్ధత ఉన్న వారికే ఆ అవకాశం దక్కేటట్లు చూస్తేనే ప్రజాస్వామ్యానికి శ్రీరామరక్ష. అనేకరంగాల్లో యువత నిర్మాణాత్మక హోదాల్లో తమను తాము నిరూపించుకున్న యువతకు పాలనలో భాగస్వామ్యం కల్పించడంలోనూ ఎవరికీ ఏ అభ్యంతరం ఉండదు. యువశక్తిని గుర్తించిననాడే వారి ఆశలు, ఆకాంక్షలు నెరవేరి వికసిత్ భారత్‌కు కొత్తదారి గోచరమవుతుంది.

నిన్నటి తప్పుల గురించి కాని, రేపు రాబోయే కష్టం గురించి కాని దిగులుపడడమే అతి గొప్ప కాలహరణం.



మహాత్మా గాంధీ

మనం ఎప్పుడూ ఏదో ఒకటి ఆశిస్తూనే ఉంటాం. ఆశ నెరవేరినా, నెరవేరకపోయినా మనిషిలో ఆశ చావదు. జీవితమే ఆశల వల.



సెసిల్

## ప్రజావాక్కు

### వేగవంతమైన న్యాయ ప్రక్రియ అవసరం

**పోటీ పరీక్షలు** లక్షలాది మంది విద్యార్థుల జీవితాలను ప్రభావితం చేస్తాయి.అలాంటి పరీక్షల్లోప్రశ్నపత్రాల లీకేజీ జరగడంవల్ల నిజాయితీగా శ్రమించిన అభ్యర్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడుతుంది. ఈ నేపథ్యంలో ప్రశ్నపత్రాల లీకేజీ కేసుల విచారణ కోసం ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలన్న నిర్ణయం ఎంతో స్వాగతించదగ్గది. ఇలాంటి కేసుల్లో వేగవంతమైన విచారణ నిందితులకు త్వరగా శిక్షపడేలా చేయడమే కాకుండా, పరీక్షా వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసాన్ని పునరుద్ధరించడంలో కూడా కీలక పాత్ర పోషిస్తుంది.చాలా సందర్భాల్లో దర్యాప్తు, న్యాయ ప్రక్రియలు సంవత్సరాలపాటు సాగుతుంటాయి. దీనివల్ల పరీక్షలురాసిన అర్హులైన అభ్యర్థులు తీవ్రమానసిక ఒత్తిడికి గురవుతారు. వారి విద్య,ఉద్యోగ అవకాశాలు ఆలస్యమవుతాయి. మరోవైపు నేరస్థులకు చట్టంపై భయం తగ్గే ప్రమాదం కూడా ఉంటుంది. అందువల్ల వేగవంతమైన న్యాయ ప్రక్రియ అవసరం. పరీక్షా నిర్వహణలో అత్యాధునిక భద్రతా వ్యవస్థలు, డిజిటల్ పర్యవేక్షణ, ప్రశ్నపత్రాల రవాణా, నిల్వ ప్రక్రియల్లో కట్టుదిట్టమైన రక్షణ చర్యలు అమలు చేయాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### హెల్త్ కార్డులు ఎవరికోసం?

**రాష్ట్ర ప్రభుత్వం** ఇటీవల రాష్ట్రంలోని ఉద్యోగ ఉపాధ్యాయులందరికీ హెల్త్‌కార్డులు అందజేయనున్నామని ఈ మేరకు ఉద్యోగులు తమ వివరాలను అప్లోడ్ చేయాలని ప్రకటన చేయడంతో రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధ్యాయులందరూ ఈ విధానం ద్వారా తమకు హెల్త్‌కార్డులు అవసరం లేదనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.డిఎలు పిఆర్‌సిలు అడిగితే హెల్త్ కార్డులు మాత్రమే ఇస్తామని ప్రభుత్వం చేతులు దులుపుకోవడంతో ఉద్యోగ ఉపాధ్యాయులు కంగుతింటున్నారు.

- బి. దేవయ్య, హైదరాబాద్

### కూలీల రేట్లు నియంత్రించాలి

సన్న చిన్నకారు రైతుల వ్యవసాయ పనుల దృశ్య, సామాన్య ధరలు, ఆర్థికవ్యవస్థ,కూలీల రేట్లు అమాంతం వందలు వందలుగా విపరీతంగా పెరగడంతో రైతులకు పెనుభారంగా మారుతుంది. గ్రామంలో కమిటీలు వేసి ధరలను నియంత్రించాలి లేదంటే వ్యవసాయం చేసి వృథా. కూలీ రేట్లు తగ్గించి రైతులను ఆదుకోవాలి.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### ప్రజాస్వామ్యం గెలిచింది

**బొద్దింకల** దెబ్బకు 56 ఇంచిల బాహుబలి దిగివచ్చింది. ఈ దేశాన్ని మత రాజ్యంగా చేయాలనుకున్న వారికి చెంప దెబ్బ.'తమకున్న మతవాద బలంతో ఈదేశాన్ని రామరాజ్యంగా చెయ్యాలని పలుమార్లు ఊకదంపుడు మాటలు పలికే 56 ఇంచిల బాహుబలి బొద్దింకల దెబ్బకు దిగి రాక తప్పలేదు. బలవంతుమైన పాము చలి చీమల చేత చచ్చునట్లు మాకు తిరుగులేదు, మేము చెప్పిందే వేదం అనే రీతిలో నడుస్తున్న, ఎదురు తిరిగినవారిపై దేశద్రోహం కేసులు అంటూ అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న బీజేపీ ప్రభుత్వం చివరికి దేశ యువతకు తలవంచక తప్పలేదు.నెహ్రూ ప్రాజెక్టులు కడితే, మోడీ దొంగబాబాల ఆశ్రమాలు, బాలరాముని గుళ్ళు, పటేల్ విగ్రహాలు కట్టారు. నెహ్రూ శాస్త్రీయ విద్య విద్యార్థులకు నేర్పితే, మోడీఇతిహాసాలు, పుక్కిటి పురాణాలు, అశాస్త్రీయ వాస్తు, జ్యోతిష్యాలు, మంత్ర తంత్రాలు, చేతబడులు, గాయత్రీమంత్రాలు,పాఠ్యాంశాలుగా పెట్టాడు.సైన్స్ కాంగ్రెస్ సదస్సులను మంత్రగాళ్ల సభలుగా మార్చారు.అహంకారంతో ఏదైనా చేస్తాం అనుకునే వాళ్లకు ఇది ఒక గొప్ప గుణపాఠం. ఇప్పటికైనా ప్రభుత్వాల తీరు మారాలి.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### ఉద్యోగాల కోత

**ఇప్పటివరకు** ఇంజనీరింగ్ విద్య చదివిన వారందరూ అధిక జీతాలకు ఆశపడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు ఎగబడి దేశ విదేశాలలో ఉద్యోగాలు సంపాదించుకున్నారు. కొందరికి ఉద్యోగాలు దొరకక ప్రయివేటు సంస్థలలోను చిన్నదో పెద్దదో ఎంతోకొంత జీతానికి పని చేస్తున్నారు.పెద్దపెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఈమధ్య తమ సీనియర్ ఉద్యోగులను వేలసంఖ్యలో తొలగిస్తున్నారు. కొత్తగా జాయిన్ అయిన వాళ్లు కూడా ఎప్పుడు తమ ఉద్యోగాలు ఊడుతాయోననే భయపడుతున్నారు. నైపుణ్యం గలవారే ఎక్కువ కాలం ఉంటున్నారు. ఉద్యోగాలు కల్పోతున్నవారికి ప్రత్యామ్నాయం ఏమిటి?

- ఎం. నాగరాజు, కరీంనగర్‌జిల్లా

### స్పెషల్ ప్రమోషన్లు ఇవ్వాలి

**తెలంగాణా** రాష్ట్రంలో ఉన్న వివిధ శాఖల వికలాంగుల ఉద్యోగులకు స్పెషల్ డిపార్టుమెంటు ప్రమోషన్స్ ఇవ్వాలి. ఉన్నత అర్హత, డాక్టరేట్ పట్టభద్రుల వికలాంగులకు స్పెషల్ ఇంక్రిమెంట్ ఇవ్వాలి. వీరికి తప్పకుండా జి. ఓ 34 వర్తింప జేయాలి.దివ్యాంగులైన ఉన్నత ఉద్యోగులకు ప్రమోషన్స్ కల్పిస్తే వారికి కూడా గౌరవం దక్కుతుంది.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# సర్టిఫికెట్లు కాదు, విద్యార్థులకు నైపుణ్యం ముఖ్యం

*విశ్వవిద్యాలయాలు పరిశ్రమలతో కలిసి పాఠ్యాంశాలను రూపొందించాలి. శిక్షణను మార్కుల కోసం చేసే కార్యక్రమంగా కాకుండా, ఉద్యోగానికి సిద్ధం చేసే ప్రక్రియగా మార్చాలి. పరిశ్రమలు కూడా శిక్షణను ఖర్చుగా కాకుండా పెట్టుబడిగా చూడాలి. సమాజం డిగ్రీని గౌరవించినంతగా నైపుణ్యాన్నీ గౌరవించడం నేర్చుకోవాలి. భారత్ 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే మరిన్ని విశ్వవిద్యాలయాలు నిర్మించడం ఒక్కటేసరిపోదు. మరిన్ని డిగ్రీలు ఇవ్వడం కూడా సరిపోదు. విశ్వవిద్యాలయాలు సర్టిఫికెట్లు ముద్రించే కేంద్రాల నుంచి మానవ మూలధనాన్ని తీర్చిదిద్దే కేంద్రాలుగా మారాలి. భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ఎదగడాన్ని నిర్ణయించేది విశ్వవిద్యాలయాలు ఎన్ని డిగ్రీలు ఇచ్చాయన్నది కాదు, ఎన్ని సమస్యలను పరిష్కరించగల మనుషులను తీర్చిదిద్దాయన్నదే.*

డి.వి.బి శ్రీహరిన్

ఒకప్పుడు విద్య ఉద్యోగానికి మార్గం. నేడు విద్య ఉద్యోగానికి హామీ కాదు. ఇదే ఇరవై ఒకటో శతాబ్దపు అతి పెద్ద సామాజిక, ఆర్థిక వైరుధ్యం. ప్రతి సంవత్సరం లక్ష లాది మంది యువత డిగ్రీలు, పీజీలు, వృత్తిపరమైన అర్హతలు సంపాదించి ఉద్యోగ విపణిలోకి ప్రవేశిస్తున్నారు.అయినప్పటికీ నిరుద్యోగం తగ్గడం లేదు. అదే సమయంలో పరిశ్రమలు మాత్రం 'పనికి సిద్ధంగా ఉన్న నైపుణ్యం కలిగిన యువత దొరకడం లేదు' అని వాపోతున్నాయి. ఒకవైపు సర్టిఫికెట్లు పెరుగుతుంటే, మరోవైపు సామర్థ్యం కొరత కొనసాగుతోంది. సమస్య ఉద్యోగాల్లో లేదు. సమస్య విద్యలో లేదు, సమస్య ఈ రెండింటి మధ్య తెగిపోయిన సంబంధంలో ఉంది. ప్రపంచ ఆర్థికవ్యవస్థ నైపుణ్యాలను కోరుతున్న వేళ, మన విద్యా వ్యవస్థ ఇంకా సర్టిఫికెట్లను ఉత్పత్తి చేస్తోంది. ఈ వైరుధ్యాన్ని అర్థం చేసుకోవాలంటే ముందు భారత ఉన్నత విద్య విస్తరణను చూడాలి. ఆల్ ఇండియా సర్వే ఆన్ హయ్యర్ ఎడ్యుకేషన్ (ఏఐఎస్‌హెచ్‌ఈ) ప్రకారం దేశంలో 4.3 కోట్లకు పైగా విద్యార్థులు ఉన్నత విద్యలో ఉన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఉన్నత విద్యా వ్యవస్థల్లో భారత్ ఒకటి. స్వాతంత్ర్యం తర్వాత విద్యను ప్రజలకు చేరువ చేయడంలో ఇది గొప్ప విజయమే. ఇది విద్యఅందుబాటులోకి వచ్చిందనే విజయాన్ని సూచిస్తుంది. కానీ అదే విద్య ఆర్థికవ్యవస్థకు అవసరమైన నైపుణ్యాలుగా మారకపోవడమే అసలు ఆందోళన. అందుకే విద్యా విస్తరణ, ఉద్యోగ యోగ్యత విస్తరణగా మారలేదు. ఇండియా స్కిల్స్ రిపోర్టు ప్రకారం సుమారు సగం మంది గ్రాడ్యుయేట్లు మాత్రమే పరిశ్రమలకు వెంటనే ఉపయోగపడే స్థాయిలో ఉన్నారు. అంటే సమస్య చదువుకున్న వారి సంఖ్యలోలేదు. వారు సంపాదించిన విద్య, ఉద్యోగ మార్కెట్‌కు అవసరమైన సామర్థ్యంగా మారకపోవడంలో ఉంది. ఇక్కడే డిగ్రీల ద్రవ్యోల్బణం అనే భావన ప్రాధాన్యం సంతరించుకుంటుంది. ద్రవ్యోల్బణంలో కరెన్సీ కొనుగోలు శక్తి తగ్గినట్లే, డిగ్రీలు విపరీతంగా పెరిగినప్పుడు వాటి ప్రత్యేకత కూడా తగ్గుతుంది.ఒకప్పుడు ఇంటర్ లేదా డిప్లొమాతో లభించిన ఉద్యోగానికి ఇప్పుడు డిగ్రీ అవసరమవుతోంది. నిన్న డిగ్రీ సరిపోతే, నేడు పీజీ కోరుతున్నారు. ఉద్యోగ స్వభావంఅంతగా మారకపోయినా, విద్యార్హతలు మాత్రం పెరుగుతున్నాయి. డిగ్రీలు జ్ఞానాన్ని కొలిచే సాధనంగా కాకుండా, అభ్యర్థులను వడపోసే సాధనంగా మారుతున్నాయి. ఆర్థిక శాస్త్రంలో 2001 నోబెల్ బహుమతి గ్రహీత మైకేల్ స్పెన్స్ ఈ పరిస్థితిని దాదాపు అర్థశతాబ్దం క్రితమే వివరించాడు. ఉద్యోగం ఇవ్వబోయే సంస్థకు అభ్యర్థి నిజంగా ఎంత సమర్థుడో ముందుగానే తెలుసుకోవడం సాధ్యం కాదు. అందుకే అది డిగ్రీని ఒక సంకేతంగా ఉపయోగిస్తుంది. మంచి డిగ్రీ అంటే నేర్చుకునే సామర్థ్యం, క్రమశిక్షణ, పట్టుదల ఉన్న వ్యక్తి అని భావిస్తుంది. కానీ అదే డిగ్రీ లక్షల మందికి వచ్చినప్పుడు ఆ సంకేతం బలహీనపడుతుంది. అప్పుడు మరింత ఉన్నత విద్యార్హతలను కోరడం ప్రారంభమవుతుంది. ఇదే డిగ్రీల ద్రవ్యోల్బణానికి మూల కారణం.సమస్య విద్యార్థుల్లోలేదు. విద్యను ఎంపిక ప్రమాణంగా ఉపయోగించే వ్యవస్థలోఉంది. ఆర్థిక శాస్త్రంలో 1992 నోబెల్ బహుమతి గ్రహీత గ్యారీ బెకర్ విద్యను మానవ మూలధనంగా అభివర్ణించాడు. యంత్రాల్లో పెట్టుబడి పెడితే ఉత్పత్తి పెరిగినట్లే, విద్యపై పెట్టుబడి పెడితే మనిషి ఉత్పాదకత పెరగాలి. కానీ విద్య సామర్థ్యాన్ని పెంచకుండా కేవలం సర్టిఫికెట్‌ను మాత్రమే ఇస్తే, అది మానవ మూలధనంగా మారదు. నేడు భారత్ ఎదుర్కొంటున్న అసలు సమస్య ఇదే. మనం విద్యలోపెట్టు బడి పెడుతున్నాం, కానీ ఉత్పాదకతలో అదే స్థాయి పెరు గుదల కనిపించడం లేదు. డిగ్రీల సంఖ్య పెరుగుతోంది. కానీ సమస్యలను పరిష్కరించే సామర్థ్యం అదే వేగంతో పెరగడం లేదు. అందుకే విద్య విస్తరిస్తున్నా, ఆర్థిక వ్యవస్థకు అవసరమైన మానవ మూలధనం అదే వేగంతో పెరగడం లేదు. ఇది కేవలం విద్యావ్యవస్థ వైఫల్యం కాదు. ఇది సమాజం నిర్మించుకున్న ఒక ఆలోచనా విధాన ఫలితం. దశాబ్దాలుగా భారతీయ కుటుంబాల్లో 'మంచి డిగ్రీ అంటే మంచి ఉద్యోగం' అనే సమీకరణ బలంగా స్థిరపడింది.పాఠ శాలలు మార్కుల కోసం, కళాశాలలు డిగ్రీల కోసం, విద్యా ర్థులు ఉద్యోగాల కోసం పరుగు తీశారు. కానీ ప్రపంచఆర్థిక వ్యవస్థ అంతలోనే మారిపోయింది. నేడు ఉద్యోగదాత అడుగుతున్న ప్రశ్న 'ఏ డిగ్రీ చేశావు?' కాదు. 'ఏం చేయగలవు?' అన్నది. ఈ మార్పును మరింత వేగవంతం చేసింది కృత్రి మ మేధ. గత పారిశ్రామిక విప్లవాలు శారీరక శ్రమను భర్తీ చేశాయి. కానీ కృత్రిమ మేధ విశ్లేషణ, సమాచార ప్రాసెసింగ్, పునరావృత మేధోపరమైన పనులను కూడా స్వీకరిస్తోంది. అందువల్ల పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించడం కంటే, సమస్యలను కొత్త కోణంలో చూడడం, వేగంగా నేర్చుకోవడం, సృజనాత్మకంగా ఆలోచించడం, విభిన్న రంగాల జ్ఞానాన్ని అనుసంధానించడం వంటిసామర్థ్యాలే ఎక్కువ విలువ పొందుతున్నాయి. ప్రపంచ ఆర్థిక నివేదిక విడుదల చేసిన ఫ్యూచర్ ఆఫ్‌జాబ్స్ రిపోర్టు-2025 ఈ మార్పును స్పష్టంగా ప్రతిబింబించింది. 2030నాటికి ఉద్యోగాలకు అవసరమైన ప్రధాన నైపుణ్యాల్లో దాదాపు 39శాతంమార్పు వస్తుందని ఆ నివేదిక అంచనా వేసింది. అదే సమయంలో 17 కోట్ల కొత్త ఉద్యోగాలు ఏర్పడగా, 9.2 కోట్ల ఉద్యోగాలు కనుమరుగయ్యే అవకాశం ఉందని తెలిపింది. ఈ గణాంకాలు ఉద్యోగాల సంక్షోభాన్ని కాదు, నైపుణ్యాల సంక్షోభాన్ని సూచిస్తున్నాయి. ప్రపంచం ఇప్పుడు డిగ్రీల ఆధారంగాకాదు, నైపుణ్యాల ఆధారంగా మానవ వనరులను అంచనా వేయడం ప్రారంభించింది. భారత్‌కు ఈమార్పు మరింత కీలకం. ప్రతి సంవత్సరం ఒక కోటినుంచి 1.2కోట్ల మంది యువత ఉద్యోగ మార్కెట్‌లోకి ప్రవేశిస్తున్నారు. ఇదే మన జనాభా ప్రయోజనం. కానీ నైపుణ్యాలుగా మారని విద్య ఈజనాభా ప్రయోజనాన్ని నిరుద్యోగ భారంగా మార్చేప్రమాదం ఉంది. ఒకవైపు ప్రభుత్వ ఉద్యోగాలకు వేల సంఖ్యలో ఇంజినీర్లు, పీజీలు దరఖాస్తు చేస్తుండగా, మరోవైపు పరిశ్రమలు శిక్షణ పొందిన వెల్డర్లు, యంత్ర నిర్వహణ నిపుణులు, డేటా విశ్లేషకులు, సైబర్ భద్రత నిపుణులు, కృత్రిమ మేధ ఇంజినీర్ల కోసం వెతుకుతున్నాయి. చదువుకున్న నిరుద్యోగం, నైపుణ్యాల కొరత ఒకేసారి కనిపించడం కంటే పెద్ద హెచ్చరిక ఇంకేముంటుంది? విద్య జ్ఞానాన్ని ఇస్తుంది. నైపుణ్యం ఆ జ్ఞానాన్ని ఆర్థిక విలువగా మారుస్తుంది. ఈ రెండింటిమధ్య సంబంధం తెగిపోయినప్పుడు డిగ్రీల ద్రవ్యోల్బణం ప్రారంభమవుతుంది. అందుకే సంస్కరణలు కూడా విద్యార్థులతో మొదలై విద్యార్థుల దగ్గరే ముగియ కూడదు. విశ్వవిద్యాలయాలు పరిశ్రమలతో కలిసి పాఠ్యాంశాలను రూపొందించాలి. శిక్షణను మార్కుల కోసం చేసే కార్యక్రమంగా కాకుండా, ఉద్యోగానికి సిద్ధం చేసే ప్రక్రియగా మార్చాలి. పరిశ్రమలు కూడా శిక్షణను ఖర్చుగా కాకుండా పెట్టుబడిగా చూడాలి. సమాజం డిగ్రీని గౌరవించినంతగా నైపుణ్యాన్నీ గౌరవించడం నేర్చుకోవాలి. భారత్ 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే మరిన్ని విశ్వవిద్యాలయాలు నిర్మించ డం ఒక్కటేసరిపోదు. మరిన్ని డిగ్రీలు ఇవ్వడం కూడా సరి పోదు. విశ్వవిద్యాలయాలు సర్టిఫికెట్లు ముద్రించే కేంద్రా ల నుంచి మానవ మూలధనాన్ని తీర్చిదిద్దే కేంద్రాలుగా మారాలి. భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ఎదగడాన్ని నిర్ణయించేది విశ్వవిద్యాలయాలు ఎన్ని డిగ్రీలు ఇచ్చాయన్నది కాదు, ఎన్ని సమస్యలను పరిష్కరించగల మనుషులను తీర్చిదిద్దాయన్నదే. •



# డిజిటల్ కరెన్సీతో ఆర్థిక వ్యవస్థకు మరింత భద్రత

సి.హెచ్.ప్రతాప్

సాంకేతిక విప్లవం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను వేగంగా రూపాంతరం చెందిస్తోంది. ఒకప్పుడు వస్తు మార్పిడి విధానం నుంచి నాణేలు, కాగితపు నోట్లు,బ్యాంకింగ్ సేవలు, డిజిటల్ చెల్లింపుల వరకు అభివృద్ధి చెందినద్రవ్య వ్యవస్థ ఇప్పుడు కేంద్ర బ్యాంకు డిజిటల్ కరెన్సీ యుగంలోకి అడుగుపెట్టింది. ఈ మార్పులో భాగంగానే భారతీయ రిజర్వ్ బ్యాంకు డిజిటల్ రూపాయిని ప్రవేశపెట్టి దేశ ఆర్థిక వ్యవస్థలో ఒక కొత్త అధ్యాయానికి శ్రీకారంచుట్టింది. డిజిటల్ రూపాయి అనేది మనం వినియోగించే కాగితపు నోట్లకు డిజిటల్ రూపం. ఇది సాధారణ డిజిటల్ చెల్లింపు విధానాలైన యూపీఐ లేదా మొబైల్ వాలెట్లతో సమానం కాదు. యూపీఐలో ఒక బ్యాంకు ఖాతా నుంచి మరొక ఖాతాకు నిధులు బదిలీ అవుతాయి. అయితే డిజిటల్ రూపాయి విషయంలో డబ్బు స్వరూపమే డిజిటల్‌గా ఉంటుంది. ఇది నేరుగా ఆర్‌బీఐ జారీచేసే చట్టబద్ధమైన అధికారిక కరెన్సీ కావడంతో భౌతిక నగదుకు సమానమైన విశ్వసనీయతను కలిగి ఉంటుంది. డిజిటల్ రూపాయి వల్ల అనేక ప్రయోజనాలున్నాయి. కరెన్సీ నోట్ల ముద్రణ,రవాణా, భద్రత, నిర్వహణ వంటి వ్యయాలు తగ్గుతాయి. లావాదేవీలు వేగంగా, సులభంగా పూర్తవడంతో సమయం ఆదా అవుతుంది. నగదు వినియోగం తగ్గడంవల్ల నకిలీ నోట్ల సమస్యను నియంత్రించడంతో పాటు ఆర్థికవ్యవస్థలో పారదర్శకత పెరుగుతుంది. చిన్న మొత్తాల చెల్లింపుల నుంచి పెద్ద లావాదేవీల వరకు దీన్ని వినియోగించే అవకాశం ఉంది. బ్యాంకులు, ఆర్థిక సంస్థల కోసం హోల్‌సేల్ డిజిటల్ రూపాయి, సాధారణ ప్రజల కోసం రిటైల్ డిజిటల్ రూపాయిని ఆర్‌బీఐ దశలవారీగా ప్రవేశపెడుతోంది. డిజిటల్ రూపాయి వ్యాపార రంగానికి కూడా మేలు చేస్తుంది. నగదు నిర్వహణ ఖర్చుతగ్గడం, తక్షణ చెల్లింపులు, మెరుగైన నగదు ప్రవాహం వంటి ప్రయోజనాలు లభిస్తాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, పన్నుల వసూళ్లు, ఆర్థిక లావాదేవీలలో పారదర్శకత పెరగడానికి కూడా ఇది తోడ్పడుతుంది. భవిష్యత్తులో అంతర్జాతీయ చెల్లింపులను మరింత వేగవంతంగా, తక్కువ వ్యయంతో నిర్వహించే అవకాశాలను కూడా ఇది విస్తరించగలదు. అదేవిధంగా, డిజిటల్ రూపాయి డిజిటల్ ఇండియా, ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ వంటి జాతీయ లక్ష్యాలకు మరింత బలం చేకూరుస్తుంది. బ్యాంకింగ్ సేవలు పూర్తిగా అందని ప్రాంతాల్లో కూడా డిజిటల్ లావాదేవీలను విస్తరించే అవకాశాన్ని కల్పిస్తుంది. విపత్తులు, అత్యవసర పరిస్థితుల్లో ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులకు వేగంగా,పారదర్శకంగా అందించడానికి కూడా ఇది ఉపయోగపడుతుంది. అయితే డిజిటల్ కరెన్సీ విజయవంతం కావాలంటే కొన్ని సవాళ్లనుఅధిగమించాల్సి ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్‌మౌలిక సదుపాయాల విస్తరణ, సైబర్ భద్రత బలోపేతం,ప్రజల్లో డిజిటల్ అక్షరాస్యత పెంపు,వినియోగదారుల గోప్యత పరిరక్షణ వంటి అంశాలకు అధికప్రాధాన్యం ఇవ్వాలి. ముఖ్యంగా వృద్ధులు, గ్రామీణ ప్రజలు, సాంకేతిక పరిజ్ఞానంపై పరిమిత అవగాహన ఉన్నవర్గాలకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. డిజిటల్ రూపాయిని బిట్‌కాయిన్ వంటి క్రిప్టోకరెన్సీలతో పోల్చడం సరైందికాదు. క్రిప్టోకరెన్సీలు మార్కెట్ ఆధారంగా విలువ మారే ప్రైవేట్ డిజిటల్ ఆస్తులు కాగా, డిజిటల్ రూపాయి భారతీయ రిజర్వ్ బ్యాంకు జారీ చేసే అధికారిక చట్టబద్ధకరెన్సీ. ప్రపంచంలోని అనేకదేశాలు కేంద్రబ్యాంకు డిజిటల్ కరెన్సీలను అభివృద్ధి చేస్తున్న నేపథ్యంలో,భారత దేశం కూడా ఈ రంగంలో ముందంజలో నిలుస్తోంది.డిజిటల్ కరెన్సీ సాంకేతిక ఆవిష్కరణ మాత్రమే కాదు, భవిష్యత్ ఆర్థిక వ్యవస్థకు బలమైన పునాది. సమర్థవంతమైన నియంత్రణ, అత్యున్నత భద్రతా ప్రమాణాలు, బలోపేతమైన డిజిటల్ మౌలిక సదుపాయాలు, ప్రజల విశ్వాసం కలిసి నడిస్తే డిజిటల్ రూపాయి భారత ఆర్థిక వ్యవస్థను మరింత ఆధునికంగా, పారదర్శకంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దే శక్తివంతమైన సాధనంగా నిలుస్తుంది. •

# బాధ్యత కలిగిన యువతతోనే దేశ భవిష్యత్తు

దాడిశెట్టి శ్యామ్ కుమార్

దేశంలో వివిధ వైద్య కళాశాలలో వైద్య కోర్సులో ప్రవేశం కోసం నిర్వహించే అర్హత పరీక్షలో జరిగిన ప్రశ్నాపత్రం పరీక్ష కంటే ముందుగానే బయటికి రావడం గత కొంతకాలం నుండి పెద్ద దుమారాన్నే రేపింది. ఈ క్రమంలో అభ్యర్థుల నుండి మొదలైన నిరసనలు క్రమ క్రమంగా అధికమై దేశంలో యువతరం వరకు వ్యాప్తి చెంది పరీక్ష లీక్ తీరుపై వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళనలు వ్యక్తం కావడం ప్రభుత్వాన్నీ ఆలోచనలో పడవేయడం, యువత చేసిన నిరసనలో భాగంగా ఆ శాఖను నిర్వహిస్తున్న కేంద్ర మంత్రితప్పని పరిస్థితుల్లో యువత కోరుకున్న విధంగానే రాజీనామా చేయవలసిన పరిస్థితి రావడం ఇదంతా ఒక ఎత్తు అయితే, యువత జరిపి నిరసనతో ప్రభుత్వమే దిగి రావడం యువత అనుకుంటే సాధించలేనిది ఏమీ లేదనే ఇలాంటి విషయం ఎల్లప్పుడు ప్రతి ఒక్కరు గుర్తించుకొనే విధంగా మిగిలిపోవడంతో ఇకపై అవినీతికి అక్రమాలకు పాల్పడుతున్న వారి తీరు మారాల్సిన అవసరం ఉంటుంది. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజలచేత ఎన్నుకోబడిన నాయకులు కూడా యువతను దృష్టిలో పెట్టుకొని జాగ్రత్తగా ఆలోచించి నిర్ణయాలు చేయాల్సిన అవసరం ఉంటుందని పలువురు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తుండడం విశేషం. పరీక్ష విధానంలో కూడా పారదర్శకత కలిగిన విధానంతో సరికొత్త సంస్కరణలు రావాల్సిన అవసరం ఉంది. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ సందర్భంగా నెలకొన్న పరిస్థితులను గమనిస్తే భారతదేశంలో నవతరం నిరంతరం దేశ పరిణామాలపై స్పందించేందుకు సిద్ధంగా ఉన్నట్టు గోచరిస్తుంది. ప్రధానంగా ప్రభుత్వాలు విధానపరమైన కఠినమైన చర్యలు తీసుకోకపోవడం, జాగ్రత్తలు పాటించకపోవడం వలన అవినీతి అక్రమాలు లాంటి సంఘటనలు తరచుగా జరుగుతున్నాయనే విషయాలు ఎంతో కాలం నుండి చదువుకున్న యువతలో ఎంతో కొంత అశాంతికి అలజడికి కారణం అవుతున్నాయి. ఈ అంశంపై ప్రస్తుతం దేశవ్యాప్తంగా నిరుద్యోగ యువత పార్టీలకతీతంగా తొలిసారిగా బయటికి వచ్చి నీట్ ప్రవేశ ప్రశ్నాపత్రం లీక్ బాధ్యులైన వారిపై తక్షణం చర్యలు తీసుకోవాలని అంతేకాకుండా దేశంలో ఎలాంటి అవినీతి అక్రమాలు జరిగినా మొదట ప్రజలు ఎన్నుకొన్న ప్రభుత్వంలోని సంబంధిత శాఖ మంత్రులు బాధ్యత వహించాలని డిమాండ్ చేసింది. అయితే ప్రస్తుతం ఆధునిక సాంకేతిక యుగంలో దేశంలోని యువత మధ్య కమ్యూనికేషన్ వ్యవస్థ సందేశాల పురోగతి అతివేగంగా జరగడంతో చాలామంది తొలిసారిగా యువతను మేల్కొలిపే విధంగా గ్రూపులను రూపొందించుకుని సమస్యలపై స్పందించేందుకు నిర్భయంగా యువతరం నేడు ప్రభుత్వాలను నేరుగా ప్రశ్నిస్తున్నది అంటే ప్రభుత్వాలు ఎంతో కొంత యువతరం ఆలోచనలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టవలసిన ఆవశ్యకత ఉంది. ఈ విధంగా దేశంలోని యువతరానికి జరుగుతున్న నష్టాన్ని ప్రశ్నించడానికి మాత్రమే కాకుండా ఎన్నుకున్న ప్రభుత్వాల అజెండా అమలు విధానాల పైన కూడా రాబోవు కాలంలో యువత ప్రశ్నించేందుకు వెనుకాడదేమో. ఏ విషయంలోనైనా సమాజానికి భంగం వాటిల్లే క్రమంలో అందుకు సంబంధించిన వారు ఎవరైనా జవాబుదారీతనంగాఉండాల్సి వస్తుంది అనేచర్చ జరుగుతుంది. నేటి యువత రేపటి భారత దేశ భవిష్యత్తుకు పునాదులు అలాంటి యువత భారతదేశ సమైక్యతను దేశభక్తి సమగ్రతతోపాటుజాతీయ వాదాన్ని బలంగా వినిపిస్తున్నారు. అలాంటి యువతరం భారతదేశం ఉన్నతికి భద్రతకు వెన్నంటి ఉంటారు అనేది అక్షరసత్యం. అందుకు ప్రభుత్వాలు కూడా దేశ భవిష్యత్తులో కీలకంగా మారనున్న యువత సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కాలయాపన చేయకూడదనే విషయంపై అన్ని రాజకీయ పార్టీల్లో చర్చ జరగాల్సిన అవసరం ఉంది. విద్యావంతులు చదువుకున్న వారు భారత దేశంలో ఎక్కువ అవుతున్నారు. దేశంలో ఎలాంటి అంశాల్లోనైనా లోపాలు కనపడితే ప్రశ్నించేందుకు నేటితరం యువత సిద్ధంగా ఉంటుందని, లోపాలను సవరించే వరకు జవాబుదారీతనం వచ్చేంతవరకు నిరసన వ్యక్తం అవుతుందని, తలచుకుంటే సాధించేందుకు యువతరానికి ఏది అడ్డు లేదని చెప్పే రీతిలో యువతరం దేశవ్యాప్తంగా చేసిన శాంతియుత నిరసన విధానాలు చెప్పకనే చెప్తున్నాయి. నేటితరం యువతరం ప్రశ్నించే విషయాలను నిజానిజాలను విశ్లేషించుకోవాలి, నిర్ధారణ చేసుకోవాలి. సరైన విధానం ఉంటే దాన్ని తప్పనిసరిగా అమలు చేసే విధంగా సమస్య కఠినతరం కాకుండా యువతరాన్ని కూడా కలుపుకుపోతూ వారి అభిప్రాయాన్ని కూడా స్వాగతించాల్సిన అవసరం కొన్ని సందర్భాల్లో ప్రభుత్వాలకు ఉండాల్సిందేమో. ఈ క్రమంలో దేశ పరిస్థితుల విషయాలపై యువత మేల్కొని అప్రమత్తంగా ఉంటుందని పాలకులు అందించే విధానాలను నిరంతరం గమనిస్తూ సమాధానం కొరకు నిరంతరం ప్రశ్నిస్తామంటూ ముందుకు వస్తున్న యువతరానికి పాతతరం అనుభవాల సారం కూడా భవిష్యత్ భారత దేశ యువతకు దిశా నిర్దేశం ఆధిక్యత మార్గదర్శకం అవుతాయని భావించే వారు లేకపోలేదు. యువత ఐక్యత రాగానికి సంబంధించి ప్రభుత్వ ప్రజాపాలనలో ఎటువంటి లోపాలు జరిగినా సంబంధిత పరిపాలనా ప్రతినిధులు బాధ్యత వహించవలసి ఉంటుందనే సందేశం దేశవ్యాప్తంగా వ్యాప్తి చెందింది. దేశ సమగ్రతకు దేశ భద్రతకు ఎటువంటి విఘాతం కలగకుండా యువత మంచి ఆలోచన విధానాలు న్యాయ సమ్మతమైనవి అయితే పార్టీలకు రాజకీయాలకతీతంగా యువత ప్రశ్నిస్తే దానికి తప్పనిసరిగా జవాబుఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వాలకు ఉంటుందేమో. రాబోవు కాలంలో ఎలాంటి ప్రభుత్వాలు వచ్చినా యువతకు నష్టం చేసే ప్రతి అంశాన్ని జాగ్రత్తతో ఆచితూచి ఆలోచించి ముందుగానే సరిదిద్దుకునే ప్రయత్నం చేస్తారేమో. ఏదేమైనప్పటికీ భారతదేశ భవిష్యత్తుకు యువతరం పాత్ర అత్యంత కీలకమైనది. ప్రస్తుతం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత పారదర్శకమైన పాలన విధానాలు అనుసరించడమే కాకుండా ప్రతి అంశంలో జవాబుదారీతనాన్ని ప్రదర్శించడంతో పాటు అడపాదడపా తలెత్తుతున్న సమస్యలపై యువత చేస్తున్న నిరసనలపై స్పందించి ఆచితూచి సమయానుకూలంగాసరైన సమయంలో వివరణ ఇచ్చేందుకు తరచూ ప్రయత్నించి సఫలం కావడం ఒకఎత్తు. దేశభక్తి భారతదేశ జాతీయ సమైక్యత సమగ్రతకు భంగం కలగకుండా వ్యవహరిస్తున్న తీరు మరొక ఎత్తుకావడం దేశ భవిష్యత్తుకు శుభపరిణామమే. •



28MN 5 PG-GNT_28MN 5 PG-GNT.qxd 27-07-2026 PM 11:26 Page 1



# నిందితుని అరెస్టు

గుంటూరు క్రైమ్,జులై27,ప్రభాతవార్త: నకిలీ పత్రాలతో ఆయుధ లైసెన్స్ పొందిన ఓ వ్యక్తిని నగరంపాలెం పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు.అతని వద్ద నుండి పిస్టోల్, మందుగోండు సామగ్రి,వొల్క్స్ వేగేన్ కారును స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం మైలా విజయ హర్ష అనే వ్యక్తి నకిలీ పత్రాలు సృష్టించి,అధికారులను బురిడీ కొట్టించాడు.అంతేకాకుండా చట్టవిరుద్ధంగా మూడు ఆయుధాలు 22 రైఫైల్1,12బోర్ షార్ట్ గన్1,380 పిస్టల్,50రౌండ్ల లైవ్,9యమ్ యమ్ 6రౌండ్,380=44రౌండ్స్ మందుగుండు సామగ్రి వీటికి అనుమతి పొంది వాటిని అతని వద్ద భద్రపరుచుకున్నాడు.పోలీసులకు అందిన సమాచారం మేరకు అతనికి ఉన్న అనుమతులను క్షుణ్ణంగా పరిశీలించారు.అతని వద్ద ఉన్న ఆయుధాలు నకిలీ పత్రాలతో పొంది ఉన్నాడని పోలీసులు నిర్ధారణ చేసుకుని కేసు నమోదు చేశారు.జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు వెస్ట్ డిఎస్పీ బెల్లం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నగరం పాలెం సిఐ మునిపల్లి రాజేష్, ఎస్.ఐలు నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు.



## 10వ రోజుకు చేరిన కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌ల నిరసన

ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం,జూలై27, ప్రభాతవార్త: కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌ల నిరసన కార్యక్రమం సోమవారం 10వ రోజుకు చేరుకుంది. రాష్ట్ర ప్రభుత్వం 2023 జూన్‌లో ఇచ్చిన జీఎం ఎంఎస్.నెం.20ను రద్దుచేయాలని కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు డిమాండ్ చేస్తున్నారు. విశ్వవిద్యాలయాల్లో బోధన చేస్తున్న రాష్ట్రంలోని ఆల్ యూనివర్సిటీ కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ పిలుపుమేరకు చేస్తున్న శాంతియుత ఆందోళన నిర్వహిస్తున్నారు. డాక్టర్ డి.అఖిలాజాన్, డాక్టర్ సి.హెచ్.రవికుమార్ డాక్టర్ కె.కన్యాకుమారి, నిహారికా, డాక్టర్ ప్రవల్లికలు దీక్షల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేవలు క్రమబద్దీకరణ, సమానపనికి సమానవేతనం, యూజిసి పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ దీక్షలు చేస్తున్నారు. కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు వర్సిటీలో నిరంతరం సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. వారి సేవలను గుర్తించాలని విన్నవించారు. వర్సిటీ న్యాక్ అక్రిడిటేషన్, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్, వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్, అకడమిక్ ఆడిట్‌లు, పరిశోధనలు వంటి అనేక విద్యావిషయక సంబంధ విధులు నిర్వహిస్తున్నట్లు గుర్తుచేశారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వర్సిటీల్లో ఖాళీల భర్తీ ప్రక్రియను ప్రారంభించే ముందు రాష్ట్రంలోని వివిధ వర్సిటీలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌లకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఆ హామీకి అనుగుణంగా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకుని జీ.ఓ ఎంఎస్ నెం.114ను తక్షణమే అమలు చేయాలన్నారు. ప్రభుత్వం మా న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించిన తరువాతే వర్సిటీల్లో పోస్టుల భర్తీకి ముందుకెళ్ళాలని విన్నవించారు.



## వైఎస్ఆర్‌సిపి విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ

ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం,జూలై27, ప్రభాతవార్త: రాష్ట్రంలో ఫీజు రీఎంబర్స్‌మెంట్, వసతి బకాయిలు విడుదల, నిరుద్యోగ భృతి, ఎన్నికల్లో యువతకు ఇచ్చిన హామీలు అమలుకు డిమాండ్ చేస్తూ వైఎస్ఆర్‌సిపి విద్యార్థి విభాగం వర్సిటీ అధ్యక్షుడు డా. పంతగాని రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టనున్నారు. వైఎస్ఆర్‌సిపి అధ్యక్షులు వైఎస్.జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు చేపట్టే నిరసన కార్యక్రమం పోస్టర్‌ను సోమవారం ఏఎన్‌యు మెయిన్‌గేట్ వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో డిఎస్సీ నియామకాలపై సిబిఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీక్ అంశంలో యువత ఆందోళన చేపట్టి కేంద్ర విద్యాశాఖా మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా చేయగా రాష్ట్రంలో కూడా డిఎస్సీపై సిబిఐ విచారణ చేయలేనిపక్షంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి రాజీనామాకు సిద్దపడాలని డిమాండ్ చేశారు. ఈ అంశాలపై పెద్దఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పంతగాని చందు, కొమ్మ ప్రవవీణ్, సాయికుమార్, భాషా, హరీష్, జానీ భాషా, నారాయణ, వెంకటేష్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.



## అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలి: రెక్టార్



ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం,జూలై27, ప్రభాతవార్త: భారతరత్న మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపిజె అబ్దుల్ కలాంను నేటియువత ఆదర్శంగా తీసుకోవాలని ఇన్‌చార్జ్ రెక్టార్ ఆచార్య ఆర్.శివరాంప్రసాద్ సూచించారు. కలాం వర్థంతి సందర్భంగా ఏఎన్‌యులో కలాం విగ్రహం వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రెక్టార్ మాట్లాడుతూ కలాం భారతదేశానికి విలువైన సేవలు అందించారన్నారు. ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం మాట్లాడుతూ పేద కుటుంబంలో పుట్టిదేశంలో అత్యున్నత స్థాయికి ఎదిగిన కలాం జీవితం ఎంతోమందికి స్ఫూర్తిదాయకం అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సి.హెచ్.లింగరాజు, ఓఎస్‌డి ఆర్‌విఎస్ఎస్ఎన్.రవికుమార్, సిడిసి డీన్ వి.రవికుమార్, పీజీ అడ్మిషన్ల డైరెక్టర్ ఆచార్య పి.బ్రహ్మాజీరావు, రీసెర్చ్‌సెల్ కోఆర్డినేటర్ ఆచార్య పి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# గుంటూరు వార్త

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

గుంటూరు క్రైమ్,జులై27,ప్రభాతవార్త: గుంటూరు జిల్లా ప్రజలకు పారదర్శకమైన,ప్రజలకు చేరువైన పోలీసింగ్ అందించాలనే లక్ష్యంతో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్ ద్వారా ప్రజల సమస్యలకు వేగవంతంగా పరిష్కారం అందిస్తున్నామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ఎస్పీ స్వయంగా 194 ఫిర్యాదులను స్వీకరించి,ఒక్కో ఫిర్యాదును పరిశీలించారు. ప్రతి ఫిర్యాదును బాధ్యతాయుతంగా విచారించి,బాధితులకు చట్టపరంగా న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులను వెంటనే ఆన్‌లైన్ ద్వారా సంబంధిత పోలీస్ స్టేషన్లకు పంపించి,నిర్ణీత గడువులోగా విచారణ పూర్తి చేసి నివేదిక సమర్పించాలని సూచించారు.



అలాగే,ఫిర్యాదు పరిష్కారమైన అనంతరం తప్పనిసరిగా ఫిర్యాదుదారునికి సమాచారం అందించి,వారి సంతృప్తిని నిర్ధారించిన తర్వాతే పిటిషన్‌ను ముగించాలని స్పష్టం చేశారు.సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలని,ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా ప్రతి పోలీస్ అధికారి సేవాభావంతో విధులు నిర్వహించాలని ఎస్పీ సూచించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చిన ప్రజలకు ఫిర్యాదుల నమోదు,దరఖాస్తుల స్వీకరణ తదితర ప్రక్రియల్లో పోలీస్ సిబ్బంది అవసరమైన సహకారం అందించారు.అదేవిధంగా అమ్మ చారిటబుల్ ట్రస్ట్,సాయినగర్,గుంటూరు ఆధ్వర్యంలో ప్రతి వారం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాన్ని ఎస్పీ అభినందించారు.దూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు,వృద్ధులు,నిరుపేదలకు ఈ సేవ ఎంతో ఉపయోగకరంగా ఉందని పేర్కొంటూ ట్రస్ట్ ప్రతినిధులను ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) జి.వి. రమణమూర్తి,మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి,ట్రాఫిక్ డీఎస్పీ,బెల్లం శ్రీనివాసరావు ఈస్ట్ డీస్పీ,టీ సీతారాం,పిజిఆర్ఎస్ సీఐ బిలాలుద్దీన్ పాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన డీఎస్పీ



గుంటూరు క్రైమ్, జూలై27,ప్రభాతవార్త: గుంటూరు జిల్లా నూతన సౌత్ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన జి.పూర్ణచంద్రరావు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా డీఎస్పీ పూర్ణచంద్రరావు ఎస్పీకి పూల మొక్కను అందజేశారు. అనంతరం ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ, ప్రజలకు మరింత మెరుగైన పోలీసు సేవలు అందిస్తూ, చట్టం,శాంతిభద్రతల పరిరక్షణలో సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## కలెక్టర్ ను ఆశ్రయించిన చెరుకుపల్లి ఆదర్శ కాలనీవాసులు

చెరుకుపల్లి,జూలై27, ప్రభాతవార్త: గ్రామ శివారు చెన్నకేశవ కాలనీ ( ఆదర్శ కాలనీ) లో గ్రామంలోని ఆశా వర్కర్ ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి పందుల పెంపకాన్ని నిర్వహిస్తు స్థానికులను బెదిరిస్తూ ఉండటం పట్ల సోమవారం కాలనీవాసులు గ్రీవెన్స్ జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేశారు. కమ్యూనర్ సైట్ ఫ్లాట్ నెంబర్లు 246, 247 ప్రభుత్వ స్థలంలో పందుల పెంపకాన్ని నిర్వహిస్తూ స్థానికులకు తీవ్ర ఆసా కార్యాన్ని కలిగిస్తుంది. పందుల పెంపకంతో క్రిమి కీటకాలు ,దోమలు ఉదృతంగా వ్యాప్తి చెందడంతో పాటు తీవ్ర దుర్గంధం వస్తుండడంతో చుట్టుప్రక్కల నివాసం ఉండే కాలనీవాసులకు స్థానిక అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ స్థానిక అధికారుల నుండి సరి అయిన అని చర్యలు తీసుకోలేదు అని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక అధికారులకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో సదరు ఆశ వర్కర్ కుంభ శివకుమారి స్థానిక కాలనీవాసులను దుర్భాషలాడుతూ మీ అంతు చూస్తాను ..నా ఇష్టం వచ్చింది చేస్తాను... మీ మీద ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టిస్తానని బెదిరిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తుందని కాలనీవాసులు వాపోయారు. ఈ నేపథ్యంలో సోమవారం కాలనీలోని స్థానికులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఆశ్రయించారు. ప్రభుత్వ స్థలంలో అక్రమంగా పందులు పెంచడమే కాకుండా అడిగినందుకు తమను దుర్భాషలాడుతూ బెదిరింపులకు గురి చేస్తున్న సదర ఆశా వర్కర్ మరియు ఆమె భర్త శ్రీనివాసరావు లపై తక్షణమే చర్యలు తీసుకొని పొందెల పెంపకాన్ని తొలగించి ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించాలని ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుదారుల అర్జీని పరిశీలించిన జిల్లా జాయింట్ కలెక్టర్ తగిన చర్యలు నిమిత్తం సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు వారు తెలిపారు.

## ఎన్నికలు లేకపోయినా ప్రజల గడపకు వస్తున్నాం.. కూటమి ప్రభుత్వం చేసిన మంచిని ప్రతి ఇంటికి చేరవేస్తాం" - ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, జులై 27,ప్రభాతవార్త :ఆంధ్రప్రదేశ్ లో ఇప్పుడు ఎన్నికలు లేకపోయినా ప్రజల గడపకు వస్తున్నామని, కూటమి ప్రభుత్వం చేసిన మంచిని ప్రతి ఇంటికి చేరవేస్తామని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. సోమవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 49వ డివిజన్ వేళాంగిణి నగర్ ఆర్చి వద్ద నుంచి ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో "ఇంటింటికి కూటమి ప్రభుత్వం – సంక్షేమ విజయాలు" కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతి రావు, ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహన కృష్ణ, వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లె ఈశ్వర్‌రావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల వెంకటేష్ యాదవ్‌తో



పాటు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రజలకు ఎన్డీయే కూటమి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి మరియు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వివరిస్తూ రూపొందించిన కరపత్రాన్ని ప్రజలకు అందించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు ప్రభుత్వం అందించిన అభివృద్ధి, సంక్షేమ ఫలితాలను ఇంటింటికి చేర్చేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. వేళాంగిణి నగర్ రోడ్లపై ఎన్నికల సమయంలో ఓటు అడిగాం. ఇప్పుడు ఎలాంటి ఎన్నికలు లేకపోయినా, ఎలాంటి రాజకీయ అవసరం లేకపోయినా ప్రజల వద్దకు వచ్చి మేము చేసిన మంచి ఏమిటో చెప్పడం మా బాధ్యతగా భావిస్తున్నాం. అలాగే ప్రజలకు ఇంకా ఏమి చేయగలమో తెలుసుకునే అవకాశంగా కూడా ఈ కార్యక్రమాన్ని తీసుకుంటున్నాం" అని గళ్ళా మాధవి పేర్కొన్నారు.49వ డివిజన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రస్తావిస్తూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రధాన హామీల్లో ఒకటైన వేళాంగిణి నగర్ మెయిన్ రోడ్డును అభివృద్ధి చేశామని తెలిపారు. వర్షాకాలంలో మోకాళ్ల లోతు నీరు నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడిన పరిస్థితులను మార్చి, రహదారి సౌకర్యాన్ని మెరుగుపరిచామని చెప్పారు. అలాగే డివిజన్ వ్యాప్తంగా రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టి దూర ప్రాంతాల వరకు మౌలిక సదుపాయాలు కల్పించామని వివరించారు.కొండయ్య కాలనీ రోడ్డును విస్తరించాల్సిన అవసరాన్ని స్థానికులు తమ దృష్టికి తీసుకువచ్చారని, ఆ ప్రతిపాదనను ప్రభుత్వానికి పంపించామని, ఈ ఆర్థిక సంవత్సరంలోనే ఆ పనిని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలగతోటి సుధీర్, మద్దిరాల మ్యానీ, నిమ్మల శేషయ్య, కఠారి అశోక్, మేళం సైద్ధయ్య, జొన్నలగడ్డ ఉదయ్ భాను, బెజ్జం అనిల్, మార్క్ మరియు ఎన్డీయే నేతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## 21వ డివిజన్‌ను సమస్యల రహిత ప్రాంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంఫ ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, జులై 27,ప్రభాతవార్త :గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 21వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు వేగం పెంచుతూ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి సోమవారం పలు సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టులు, వెట్‌మిక్స్ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు నిర్వహించారు. ఈ సందర్భంగా కోదండరామయ్య నగర్ 4వ లైన్, కేవీపీ కాలనీ 3వ లైన్, శశాంక్ గోయల్ కాలనీలోని జెమిని స్కూల్ సమీపం, గడ్డిమల్లు జీరో లైన్ ప్రాంతాల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... 21వ డివిజన్‌లో దాదాపు రూ.3.5 కోట్ల విలువైన సీసీ రోడ్లు, డ్రైన్లు, కల్వర్టులు, వెట్‌మిక్స్ రోడ్ల పనులను ప్రారంభించడం ఆనందంగా ఉందని, కోదండరామయ్య నగర్, కొండా వెంకటప్పయ్య కాలనీ, శశాంక్ గోయల్ కాలనీ, భానుప్రసాద్ కాలనీ, గడ్డిమల్లు తదితర ప్రాంతాల్లో ఎన్నో ఏళ్లుగా ప్రజలు రోడ్లు, డ్రైనేజీ సదుపాయాల లేమితో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. 21వ డివిజన్‌లో రూ.7 కోట్లకు పైగా అభివృద్ధి పనులు పూర్తయ్యాయని, ప్రస్తుతం మరో రూ.3.5 కోట్ల పనులను ప్రారంభిస్తున్నామని తెలిపారు. మొత్తం మీద ఈ డివిజన్‌లో సుమారు రూ.10 కోట్ల అభివృద్ధి పనులు చేపడుతున్నామని, మిగిలిన పనులను కూడా ఈ ఆర్థిక సంవత్సరంలోనే పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఇటీవల మహిళా గ్రీవెన్స్ కార్యక్రమానికి గడ్డిమల్లు ప్రాంత మహిళలు వచ్చి తమ ప్రాంతంలో దయనీయంగా ఉన్న రోడ్లు, డ్రైనేజీ సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చారని, వారి వినతిపై స్పందించి కేవలం రెండు వారాల్లోనే శంకుస్థాపన కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. వచ్చే రెండు నెలల్లో ఈ పనులు పూర్తై ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## రూ. 2.20 కోట్లతో రోడ్లు డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన

గుంటూరు, జులై 27,ప్రభాతవార్త :గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అన్ని ప్రాంతాలలోనూ అభివృద్ధి పనులు వేగవంతంగా చేపడుతున్నామని, ప్రజలకు సౌకర్యవంతమైన పాలన అందిస్తున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. గుంటూరు నగరంలోని ఆరో డివిజన్లోని నిశ్శంకర్ రావు వీధిలో రూ. 22 లక్షలు, కొత్తపేట సాయినగర్లో రూ.2 కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. తొలుత స్థానిక నాయకులు ఎమ్మెల్యే కు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో అభివృద్ధికి అర్థం చెబుతున్నామని తెలిపారు. ఇప్పటికే నియోజకవర్గంలో 350 కోట్ల రూపాయలతో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు అందించామని చెప్పారు. 100 కోట్ల రూపాయలతో రోడ్లు, డ్రెయిన్లు, వాటర్ పైపులైన్లు నిర్మించామని అన్నారు. గతంలో కనీసం నడవడానికి కూడా వీలులేని రోడ్లకు మహర్దశ తీసుకొస్తున్నామని తెలిపారు. కేవలం రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణమే కాకుండా గుంటూరు నగరంలో ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. దీంతోపాటు విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యమిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే నియోజకవర్గంలో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సుమారు15 కోట్ల రూపాయల విలువైన నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాధాన్యత క్రమంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ప్రస్తుతం చేపట్టిన పనులను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.



## తూర్పులో ఉత్సాహంగా "మన ఇంటికి మన నసీర్"

గుంటూరు,జూలై 27,ప్రభాతవార్త :రాష్ట్ర వ్యాప్తంగా కూటమి ప్రభుత్వం చేపట్టిన రెండేళ్ల పాలన ఇంటింటికి ప్రచారంలో భాగంగా గుంటూరు తూర్పు నియోజకవర్గంలో "మన ఇంటికి మన నసీర్" కార్యక్రమం ఉత్సాహంగా ప్రారంభమైంది. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ లీడర్ నుంచి కేడర్ వరకు ఉత్సాహంతో ముందుకు కదిలారు. సోమవారం స్థానిక ఒకటో వార్డులోని వెంకటేశ్వర కాలనీ, రజక కాలనీ, ఎంప్లాయిస్ నగర్, ఆర్టీసీ కాలనీ ప్రాంతాలలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గుమ్మానికి వెళ్లి ఎమ్మెల్యే నసీర్ ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కూటమి నేతలు అన్వర్, ముమ్వా శైలజ, కోట పిచ్చి రెడ్డి, దిలీప్, మహంకాళి శ్రీనివాస్, గంటా సాంబ, రాజేష్, వంశీకృష్ణ, శాఖమూరి శ్రీనివాస్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.








# హెపటైటిస్ యమడేంజర్..ఒకటే జీవితం.. ఒకటే లివర్


గుంటూరు, మెడికల్, జూలై 27, ప్రభాతవార్త: పల్నాడు జిల్లా మాచర్లకు చెందిన శ్రీనివాస్ గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకి పచ్చకామెర్లుతో రాగ , పరీక్షలు చేయగా తనకి హెపటైటిస్ బి పాజిటివ్ అని నిర్ధారణ అయింది. తన హిస్టరీ అడగగా కండోమ్ లేకుండా లైంగికంగా వారం రోజులు క్రితం ఒక వేశ్యతో ఉన్నట్లు గా చెప్పడం తో దాని వల్ల వచ్చింది అని నిర్ధారించారు.చేబ్రోలు కి చెందిన 50ఏళ్ల మంగమ్మ గత నెల రోజులుగా పొట్ట ఉబ్బరంగా ఉంది అని జీజీహెచ్ ఓపీడీ కి రాగ పొట్ట స్కానింగ్ చేసి లివర్

**జాగ్రత్తలు తీసుకోకపోతే అంతే..మద్యం తాగే వ్యక్తులే ఎక్కువ భాదితులు..**
**ఆదునిక జీవనశైలితో రోజు రోజు పెరుగుతున్న భాదితులు..**
**వయస్సుతో సంబంధం లేకుండా వ్యాధి బారినపడుతున్న వైనం..**
**ఆందోళన వ్యక్తం చేస్తున్న వైద్య నిపుణులు..**
**జీజీహెచ్ లో కార్పొరేట్ వైద్య సేవలు..**

**నేడు ప్రపంచ హెపటైటిస్ డే..**

సిర్రోసిస్ వల్ల పొట్టలో నీరు చేరింది. హెపటైటిస్ పరీక్షలు చేయగా హెపటైటిస్ సీ అని నిర్ధారణ జరిగింది.గుంటూరు కి చెందిన 60ఏళ్ల సుబ్బారావు కుడి పక్కన నొప్పి అని జీజీహెచ్ గ్యాస్ట్రో ఒపికి కి రాగ స్కాన్ చేసి చూడగా లివర్ లో గడ్డ అని నిర్ధారించారు. పరీక్షలు చేయగా అది హెపటైటిస్ బి వల్ల వచ్చిన లివర్ క్యాన్సర్ గడ్డ గా నిర్ధారణ జరింది ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ ఆరోగ్యకరమైన అలవాట్లుతో హెపటైటిస్ కి చెక్ పెట్టోచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.ఈ నేపద్యంలో నేడు ప్రపంచ హెపటైటిస్ డే సందర్భంగా ఆంధ్రప్రభ అందిస్తున్న ప్రత్యేక కథనం..గుంటూరు మెడికల్ జూలై27(ప్రబాత వార్త)ఆధునిక జీవనశైలి వల్ల పరిస్థితులు, ఆహారపు అలవాట్లు, జీవన విధానాలు, ఉద్యోగంలో ఒత్తిళ్లు, మానసిక ఒత్తిళ్లు, నిద్రలేనితనం తదితర కారణాలతో మనిషి ఎన్నో వ్యాధుల బారిన పడుతున్నాడు. ఇందులో హెపటైటీస్ వ్యాధి. ఇది చాలా ప్రమాదకరమైనది. ఇది శరీరంలోని కాలేయం (లివర్)పై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఏ,బి,సి,డి,ఇలు వెలుగు చూసిన ఈ వ్యాధిలో హెపటైటీస్ వ్యాధి చాలా ప్రమాదకరమైనదని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ వ్యాధి తీవ్రత సిర్రోలిక్ దశకు చేరుకుని ఏకంగా కాలేయం పూర్తిగా దెబ్బతింటుంది. ఈ దశలోకాలేయం మార్పిడి చేయాల్సి వస్తుంది. అందుకు వ్యాధి బారినపడకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. అలాగే ఈ వ్యాధిపై ప్రజల్లో అవగాహన






డాక్టర్ షేక్ నాగూర్ బాషా
అసోసియేట్ ప్రొఫెసర్ జీర్ణకోశ వ్యాధుల విభాగం
గుంటూరు ప్రభుత్వ వైద్యశాల..

కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడు తున్నారు. అయితే 2011లో జూలై 29వ తేదీని ప్రపంచ కాలేయ వ్యాధి (హెపటైటిస్) దినోత్సవాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్లూహెచ్ఓ) గుర్తించి ఈ రోజున సదస్సులు నిర్వహించడం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని నిర్ణయించింది. దీంతో ప్రతియేటా జూలై 28న ప్రపంచ కాలేయ వ్యాధి దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు.వ్యాధి లక్షణాలు: కామెర్లు, రక్తం వాంతులు, విరోచనాలు, అలసట ఎక్కువగా ఉండటం ఆకలి లేకపోవడం కడుపు నొప్పి,క్రమ క్రమంగా బరువు తగ్గిపోవడం కండరాలు, కీళ్ల నొప్పులు అధికంగా ఉండటం జ్వరంకాళ్లు, పొట్టవాపు చర్మం, కళ్ల పచ్చగా మారడం నల్లరంగులో విరోచనాలు పగలు నిద్ర, రాత్రి మెలుకువగా ఉండటం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలి.మద్యం తాగే వారే ఎక్కువ భాదితులు..ఈ వ్యాధి అధికంగా మద్యం సేవించే వారికి వస్తున్నట్లు తెలుస్తోంది. శరీరంలో చేరే మద్యాన్ని విసర్జించే క్రమంలో కాలేయం ఎక్కువగా శ్రమకు గురవుతుంది. కాలేయం సామర్థ్యానికి మించి మద్యం సేవించినట్లయితే కాలేయ మెల్లమెల్లగా దెబ్బతింటుంది. ఫలితంగా ఆల్కహాలిక్ ఫ్యాటీలివర్ డిసీజ్, ఆల్కహాలిక్ హెపటైటీస్ ఆల్కహాలిక్ సిర్రోసిస్ వ్యాధులు దరిచేరుతాయి. ఆల్కహాలిక్ ఫ్యాటి లివర్ డిసీజ్‌లో కాలేయం కణాల్లో కొవ్వు పేరుకుపోతుంది. అలాగే కాలేయం పనితీరు సక్రమంగా ఉన్నా..

ఎంజైమ్ విడుదలలో హెచ్చు తగ్గులు చోటు చేసుకుంటాయి.ఈ పరిస్థితిని మద్యం మానేసి సరిదిద్దుకోవాలి. అతిగా మద్యం సేవించే వారి కాలేయం వాపునకు గురై గట్టిగా తయారవుతుంది. దీనినే ఆల్కహాలిక్ హెపటైటీస్ అంటారు.ఈ వ్యాధితో కాలేయం పనితీరు క్రమంగా అదుపు తప్పుతుంది. వ్యాధి తీవ్రత పెరిగితే కాలేయం విఫలమవుతుంది. హెపటైటిస్ బి, హెపటైటిస్ సి, వైరస్‌ల వల్ల కాలేయం కేన్సర్‌కు దారి తీసే అవకాశం ఎక్కువగా ఉంటుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.జీజీహెచ్ లో కార్పొరేట్ వైద్య సేవలు..గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో 2021 నుంచి హెపటైటిస్కి ప్రత్యేక స్క్రీనింగ్ సెంటర్ ను ఉచితంగాఏర్పాటు చేసి కార్పొరేట్ మించిన వైద్య సేవలు రోగులకు అందిస్తున్నారు ఇప్పటివరకు 12 వేల మందికి అనుమానంతో పరీక్షలు చేయగా 632 మందికి ఉన్నట్లు నిర్ధారణ అయింది. ఇక్కడ పరీక్షలు చేసిన రోగులకు ఉచితంగా మందులు, వ్యాక్సిన్ అందిస్తున్నారు.వ్యాక్సిన్ వేయించుకోవాలి.. జీజీహెచ్ లో త్వరలో లివర్ మార్పిడి ఆపరేషన్లు.. ( డాక్టర్ షేక్ నాగూర్ భాష అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్యాస్ట్రో ఎంట్రా లజీ వైద్య విభాగం గుంటూరు ప్రభుత్వ వైద్యశాల )ఒకే లివర్ ఒకే లైఫ్ అనే నినాదంతో 2023లో హెపటైటిస్ డే ని జరుపుకుంటున్నారు.

2030 కల్లా హెపటైటిస్ వ్యాధి లేకుండా చేయాలని లక్ష్యంతో ప్రభుత్వాలు పనిచేస్తున్నాయి. ముందస్తుగా వ్యాక్సిన్ చేయించుకోవడం ద్వారా వ్యాధి బారిన పడకుండా ఉండవచ్చు. వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరు వ్యాక్సిన్ తీసుకోవాలి. గుంటూరు జిజిహెచ్ లో ఉచితంగా త్వరలో లివర్ మార్పిడి ఆపరేషన్ చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మద్యపానం అలవాటు ఉన్నవారు ఆహారపు అలవాట్లు మార్చుకొని వైద్యుల సూచనల పాటిస్తే వ్యాధి సోకకుండా ఉండవచ్చు

## కూటమి ప్రభుత్వంపై ప్రజల విశ్వాసం: కన్నా

సత్తెనపల్లి, జూలై 27, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణం 31వ వార్డు నందు రెండేళ్ల కూటమి పాలనపై అభివృద్ధి సంక్షేమ ఇంటింటికి ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు శాసన సభ్యులు కన్నా లక్ష్మీ నారాయణ . ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచి ప్రజలతో



నేరుగా చర్చించి పథకాల గురించి తెలుసుకున్న కన్నా .దేశ రక్షణ వ్యవస్థకు అణుశక్తిని జోడించిన మిస్సైల్ మ్యాన్, శాస్త్ర సాంకేతిక రంగాల్లో దేశ ప్రతిష్టతను ఇనుమడింపజేసిన ఆధునిక పితామహుడు, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఎ.పి.జె. అబ్దుల్ కలాం గారి వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు.

**జగన్ పాలనలో అభివృద్ధి,సంక్షేమం శూన్యం :**

వైసీపీ హయాంలో ఖజానా ఖాళీ అయింది ..ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చిన కూటమి ప్రభుత్వం ..రాష్ట్ర అభివృద్ధికి దేశాలు తిరిగి పెట్టుబడులు సేకరించిన ముఖ్యమంత్రి నారా





చంద్రబాబునాయుడు ..రాజధాని అమరావతి అభివృద్ధి వేగవంతం ..అమరావతి రాజధాని పై విషం చిమ్ముతున్న జగన్ ..ఏ రాష్ట్రానికైన ఒకే రాజధాని వుంటుంది ,జగన్ హయాంలో మూడు ముక్కల రాజధానులు.. రాబోయే కాలంలో వైసీపీ శూన్యం ., అమరావతి రాజధాని రావటంతో మన భూముల విలువలు పెరిగాయి గత ప్రభుత్వంలో రాజధాని ఎక్కడ అంటే పేరు చెప్పే పరిస్థితి కూడా లేదు దేశంలో ఎక్కడా లేనటువంటి సంక్షేమ పథకాలు కూటమి ప్రభుత్వం అందిస్తుంది ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలన్నీ నెరవేరుస్తున్నాం గత ప్రభుత్వం 12,500 ఇస్తామని చెప్పి కేవలం 7500 మాత్రమే ఇచ్చింది ప్రజలకు కూటమి ప్రభుత్వంపై విశ్వాసం పెరుగుతుంది తల్లికి వందనం కింద ఒక కుటుంబంలో పిల్లలు ఎంతమంది ఉన్నా 15 వేల రూపాయలు చొప్పున వేసాము గత ప్రభుత్వంలో అమ్మ ఒడి అందరికి ఇస్తామని మోసం చేసి ఒకరికె పరిమితం చేశారు అన్నదాత సుఖీభవ మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తున్నాము ఒక్కో రైతు కుటుంబానికి కేంద్రం సాయంతో కలిపి ఏడాదికి రూ.20 వేలు. కూటమి ప్రభుత్వం పథకాలు అమలు చేస్తుంటే జగన్ వాటిని చూసి ఓర్వలేక విషప్రచారాలు చేస్తున్నాడు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలలో భాగంగా తల్లికి వందనం, దీపం పథకం, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, అన్నా కాంటీన్లు పునరుద్ధరణ యువతకు ఉద్యోగాలు హామీలను అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వం కూటమి ప్రభుత్వం చేసే అభివృద్ధి చూసి ఓర్వలేక జగన్ విషప్రచారాలు చేస్తున్నాడు ఈ కార్యక్రమంలో వివిధ హోదాలో ఉన్న రాష్ట్ర జిల్లా నియోజకవర్గ పట్టణ మండల వార్డు గ్రామ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## సత్తెనపల్లి సబ్‌డివిజన్ పోలీసు అధికారిగా చైతన్య బాధ్యతల స్వీకారం

సత్తెనపల్లి, జూలై 27, ప్రభాతవార్త: పల్నాడు జిల్లా,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీసు శాఖ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, మంగళగిరి వారి ఆదేశాలు మరియు దక్షిణ కోస్తా జోన్ (ఎస్‌సిజడ్) గుంటూరు రేంజ్



ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ కౌంటర్ మెమో మేరకు, ఎం.వి.కె. చైతన్య సోమవారం ఉదయం సత్తెనపల్లి సబ్ డివిజన్ పోలీసు అధికారి (ఎస్.డి.పి.ఓ.)గా బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఇప్పటి వరకు సత్తెనపల్లి సబ్ డివిజన్ ఎస్.డి.పి.ఓ.గా విధులు నిర్వహించిన ఎం. హనుమంతరావు నుండి ఎం.వి.కె. చైతన్య అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు.నూతన ఎస్.డి.పి.ఓ. ఎం.వి.కె. చైతన్య మాట్లాడుతూ, ప్రజలకు అందుబాటులో ఉండే పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇస్తూ, శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, మహిళలు మరియు చిన్నారుల భద్రత, రోడ్డు భద్రత, సైబర్ నేరాల నివారణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. ప్రజలు పోలీసు శాఖకు సహకరించి, ఏవైనా సమస్యలు లేదా నేరాలకు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.


## డా. అబ్దుల్ కలామ్ వర్ధంతి

సత్తెనపల్లి, జూలై 27, ప్రభాతవార్త: . దివంగత భారత రాష్ట్రపతి, భారత క్షిపణి పితామహులు, భారతరత్న డా. అబ్దుల్ కలామ్ వర్ధంతి సందర్భంగా స్వామి వివేకానంద చైతన్య భారతి ఆధ్వర్యంలో ఈ రోజు ఉదయం రైల్వే స్టేషన్ రోడ్ లో కలాం విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమమునకు అధ్యక్షులు డాక్టర్ శ్రీధర్ అధ్యక్షత వహించారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయులు, స్థానిక పెన్షనర్లసంఘం అధ్యక్షులు జక్కుల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కలాం గారి జీవితం అందరికీ ఆదర్శమని తెలిపారు. సంస్థ సభ్యులు శాస్త్రి ప్రసంగిస్తూ, అబ్దుల్ కలాం ఆధ్వర్యంలో నిర్వహించిన పోఖరాన్ అణుపరీక్షల గురించి, నిరాడంబరమైన వారి జీవితములోని విశేషములను వివరిస్తూ, వారి జీవితములోని స్ఫూర్తివంత సంఘటనలతో పాటు, శాస్త్ర, సాంకేతిక, అంతరిక్ష పరిజ్ఞానంలో నేటి మనదేశ ప్రగతికి వారుచేసిన కృషియే పునాది అని తెలిపారు. వికలాంగులకు తక్కువ బరువు కలిగిన పరికరాలతయారీలో, కలాం రాజు స్టెంట్ రూపకల్పనలో వారి కృషిని వివరించారు. మరో సభ్యులు రఘునాథ శాస్త్రి మాట్లాడుతూ విలువలను జీవితాంతమూ ఆచరించి, స్వయంప్రతిభతో పేపర్ బాయ్ నుండి గౌరవ భారత రాష్ట్రపతిగా ప్రస్థానం కొనసాగించిన




దేశభక్తులని పేర్కొన్నారు. ఉపాధ్యక్షులు పుట్టి సాంబశివరావు, త్రిపురమల్లు రవిగార్లు కలాం గారి విగ్రహమునకు పూలమాలలు వేయగా, వచ్చిన వారందరూ పుష్పాంజలి సమర్పించారు.ఈ కార్యక్రమములో సంస్థ కోశాధికారి తొమ్మండ్రు సత్యనారాయణ, దేవరశెట్టి రవికుమార్, వేదాద్రి, చలువాది సత్యనారాయణ, ఎ.వెంకట రమణ, వై. వెంకటేశ్వరరావు, శివ నాగేశ్వరరావు, సురేష్ , బదరీనారాయణ, రఘు, ఆకులవాసు, శివకోటయ్య, సుబ్బారావు తదితరులు పాల్గొని పుష్పాంజలి ఘటించారు.


## డాక్టర్ కత్తి పద్మారావును సన్మానించిన న్యాయవాదులు



సత్తెనపల్లి, జూలై 27, ప్రభాతవార్త: గుంటూరు జిల్లా పొన్నూరు లుంబిని వనం లో సోమవారం డాక్టర్ కత్తి పద్మారావు 73 వ జన్మదిన వేడుకలు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా సత్తెనపల్లి కి చెందిన న్యాయవాదులు దాసరి జ్ఞాన్ రాజ్ పాల్, జొన్నలగడ్డ విజయ్ కుమార్, సూరె వీరయ్య, మామిడి ప్రకాష్, ఉపాధ్యాయుడు మద్దు వినోద్ తదితరులు వేడుకల్లో పాల్గొని పద్మారావు కు దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు .

## కబడ్డీ పోటీలలో శాంతినికేతన్ కాలేజీ విద్యార్థినుల విశేష ప్రతిభ

సత్తెనపల్లి, జూలై 27, ప్రభాతవార్త: అమరావతి ఛాంపియన్ షిప్ నియోజకవర్గ స్థాయిలో అండర్ 17 మరియు అండర్ 23 బాలికల కబడ్డీ పోటీలు జిల్లా పరిషత్ హైస్కూల్ ఫణిదంలో



నిర్వహించబడ్డాయి ఈ పోటీలలో శాంతినికేతన్ జూనియర్ కాలేజీ విద్యార్థినిలు అండర్ 17 లో ఏడుగురు అండర్ 23 లో ఇద్దరు ఎంపిక అయ్యారు వీరు తదుపరి ఇంటర్ నియోజకవర్గాల అమరావతి ఛాంపియన్షిప్ పోటీలలో పాల్గొనేదరు వీరిని కాలేజీ డైరెక్టర్ వై రమణ రెడ్డి మరియు పిడి ఇందూరి వెంకటేశ్వర్ రెడ్డి , హింది పండిట్ సుభాని మరియు కాలేజీ సిబ్బంది అభినందించారు

## కలాంకి నివాళులర్పించిన డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట టౌన్, జూలై 27 ప్రభాతవార్త : డాక్టర్ ఏపిజే అబ్దుల్ కలాం 11వ వర్ధంతి సందర్భంగా సోమవారం వైసీపీ పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి స్థానిక



పల్నాడు రోడ్డులోని అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన భారతదేశానికి చేసిన సేవలను కొనియాడారు. శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా వారు దేశానికి అందించిన సేవలు మరువలేనివని తెలిపారు. పేద కుటుంబంలో జన్మించిన దేశ్ అత్యున్నత స్థాయికి చేరిన వారి జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని తెలియజేశారు. వారి ఆశయ సాధన లక్ష్యంగా వైయస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలోని వైయస్సార్సీపి కృషి చేస్తుందని డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ షేక్ ఖాజావలి, పార్టీ పట్టణ అధ్యక్షులు కరీముల్లా, ఇఎం. స్వామి మాస్టారు, మైనార్టీ నాయకులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

## రొంపిచర్లలో అభివృద్ధి పనులు ప్రారంభం

**=రూ. 2 కోట్లతో రొంపిచర్ల-కర్లకుంట తారు రోడ్డు**

రొంపిచర్ల, జూలై 27 ప్రభాతవార్త : రొంపిచర్ల మండలంలో రూ.2 కోట్ల నిధుల వ్యయంతో నిర్మించిన రొంపిచర్ల-కర్ల కుంట తారు రోడ్డును సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు ప్రారంభించారు. అలాగే రూ.50 లక్షలతో నిర్మించిన బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ (నేషనల్ హెల్త్ సెంటర్) ను కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలతో పాటు అభివృద్ధి పనులకు కూడా సమాన ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, వైద్య



సదుపాయాలు, మౌలిక వసతుల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన రొంపిచర్ల-కర్లకుంట రహదారి వల్ల రైతులు, గ్రామీణ ప్రజలకు రాకపోకలు సులభతరం అవుతాయని చెప్పారు. మిగిలిన రహదారి పనులకు కూడా అనుమతులు వచ్చిన వెంటనే పూర్తి చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రొంపిచర్ల మండలానికి చెందిన టీడీపి నాయకులు మొండితోక రామారావు, నాగిరెడ్డి, గాడిపర్తి సురేష్, నాయకులు, కార్యకర్తలు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పల్నాడు జిల్లాలో ఎస్సీ ఎస్టీల సమస్యలు పరిష్కరించాలని వినతి..

నరసరావుపేట క్రైమ్,జూలై 27 ప్రభాతవార్త : జిల్లా నూతన అడిషనల్ ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన. రోహిత్ కుమార్ చౌదరి ఎస్సీ,ఎస్టీ నాయకులు కలిశారు. పలనాడు జిల్లా వ్యాప్తంగా. దళితులకు రక్షణ కల్పించాలని సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు.అడిషనల్ ఎస్పి



స్పందించి దళితులకు రక్షణ కల్పిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ ఎస్ జిల్లా అధ్యక్షులు మీరయ్య మాట్లాడుతూ. పలనాడు జిల్లా వ్యాప్తంగా పోలీస్ స్టేషన్ లకి వెళ్లే దళితులు కి పోలీసు వారు అండగా నిలవాలని వారు స్టేషన్ వచ్చిన వెంటనే వారికి న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు పెండింగులు లేకుండా చూడాలన్నారు.ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో పెండింగ్ లో ఉన్న ఛార్జిషీట్లు వెంటనే దాఖలు చేయాలన్నా రు.జరగబోయే స్థానిక సంస్థలు ఎన్నికలు దృష్టిలో ఉంచుకొని. పోటీ చేసే బలహీనవర్గాల వారికి రక్షణకల్పించవలసిందిగా కోరారు.ఈ కార్యక్రమంలో. నాయకులు కోటేశ్వరరావు,. బొంత వేణు, ఖమ్మంపాటి వెంకయ్య. కంభంపాటి గాయత్రి, పెనయ్య తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

## నియోజకవర్గంలో తెలుగుదేశం ఇంటింటి ప్రచారం.. రెండేళ్ల పనితీరును వివరించిన ఎమ్మెల్యే

నరసరావుపేట, జూలై 27 ప్రభాతవార్త : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఖిరెండేళ్ల నమ్మకం -సంక్షేమం, అభివృద్ధి 45 రోజుల ఇంటింటి ప్రచారంలో భాగంగా సోమవారం రొంపిచర్ల, పట్టణంలోని బీసీ కాలనీ లో ఇంటింటి ప్రచారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పాల్గొన్నారు. గ్రామంలోని పలు వీధుల్లో ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యే కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ఎన్నికల హామీల మేరకు అమలు చేసిన సంక్షేమ పథకాల వివరాలను ప్రజలకు వివరించారు. ఈ మేరకు ప్రత్యేకంగా ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రజలతో నేరుగా మాట్లాడిన ఎమ్మెల్యే ప్రభుత్వ పథకాల అమలు తీరుపై వారి



అభిప్రాయాలను తెలుసుకుని సమస్యలు, సూచనలను స్వీకరించారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలుతో పాటు గ్రామీణాభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని ఆయన తెలిపారు. ప్రచార కార్యక్రమంలో ఎమ్మెల్యేకు రొంపిచర్ల ప్రజలు ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతులు ఇచ్చి, పూలు చల్లి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట మార్కెట్ యార్డ్ చైర్మన్ పూనాటి శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లపాటి రాము, పార్టీ నాయకులు మొండితోక రామారావు, నాగిరెడ్డి, గాడిపర్తి సురేష్, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ నూతన కమిటీని అభినందించిన ఎమ్మెల్యే..

నరసరావుపేట టౌన్, జూలై 27 ప్రభాతవార్త :నరసరావుపేటలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నూతన కార్యవర్గ కమిటీని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు అభినందించారు. సోమవారం నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను మానవతా స్వచ్ఛంద సంస్థ చైర్మన్ మెదరమెట్ల రామ శేషగిరి రావు సోమవారం శాసనసభ్యులు చదలవాడ అరవింద్ బాబును ఆయన కార్యాలయంలో కలిసారు.నూతనంగా ఏర్పాటైన కమిటీ సభ్యులను ఎమ్మెల్యే కి పరిచయం చేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి ఎమ్మెల్యే అరవింద్ బాబు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా




రాబోయే రోజుల్లో మరిన్ని సేవ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని ఆయన ఆకాంక్షించారు. భవిష్యత్తులో సంస్థ ఆధ్వర్యంలో చేపట్టే ప్రతి సేవ కార్యక్రమానికి తన వంతు సంపూర్ణ సహకారం ఉంటుందని భరోసానిస్తూ నూతన కమిటీకి తగిన సూచనలు అందించారు.ఈ కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ మేదరమెట్ల శేషగిరిరావు, ప్రెసిడెంట్ కథం నాగజ్యోతి, సెక్రటరీ స్వర్ణ నాగరాజు, కన్వీనర్ మాకినేని హరిబాబు, బోర్డు మెంబర్లు పోక శ్రీనివాసరావు, హనీఫ్, టి. అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహిళా శిశు సంక్షేమ శాఖలో పోస్టులకు రాత పరీక్షలు

నరసరావుపేట టౌన్ జూలై 27 ప్రభాతవార్త : జిల్లా మహిళా శిశు సంక్షేమ మరియు సాధికారత కార్యాలయం పరిధిలో పోస్టుల భర్తీకి రాత పరీక్షలు నిర్వహిస్తున్నారు. వివరాలను జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ నాగమల్లేశ్వరి సోమవారం తెలియజేశారు. ఈనెల 29న బుధవారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలియజేశారు. నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించే పరీక్షలకు అభ్యర్థులు ఉదయం 10 గంటలకు కల్లా చేరుకోవాలని సూచించారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పరీక్ష కేంద్రానికి హాజరు కావాలన్నారు. జిల్లా పోషణ్ అభియాన్, వన్ స్టాప్ సెంటర్లలో పోస్టులు డేటా కోఆర్డినేటర్ డిస్టిక్ ప్రాజెక్టు అసిస్టెంట్ పోస్టులతో పాటు వన్ స్టాప్ సెంటర్ నందు ఖాళీగా ఉన్న ఆఫీస్ అసిస్టెంట్ పోస్టులకు ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. అర్హులైన వారికి కాల్ లెటర్స్ ను పంపడం జరిగిందన్నారు. రాతపరీక్షతోపాటు కంప్యూటర్ ఎఫిషియన్సీ టెస్ట్ కూడా నిర్వహిస్తున్నట్లు ప్రాజెక్టు డైరెక్టర్ నాగమల్లేశ్వరి తెలియజేశారు.

## రిజర్వేషన్లలో బీసీ మహిళల సబ్‌కోటాపై వినతి

నరసరావుపేట, జులై 27 ప్రభాతవార్త : పార్లమెంట్ సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళ సబ్ కోటా రిజర్వేషన్ కేటాయించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర



అధ్యక్షులు కేశన శంకరరావు ఆదేశాల మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ కు జిల్లా.బీసీ సంక్షేమ సంఘం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బిళ్ళకంటి శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ మహానాడులో పార్లమెంటు బిల్లుతో సంబంధం లేకుండా పార్టీ పరంగా చట్టసభలలో 33 మహిళలకు రిజర్వేషన్లు మొట్టమొదటిసారిగా ప్రకటించినట్లు తెలిపారు. 2029 నుండి ఏపీలో ఇది అమలు జరుపుతామన్న చారిత్రాత్మక నిర్ణయాన్ని ప్రకటించిన టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ కు మహిళా లోకం తరపున ధన్యవాదాలు తెలియజేశారు. 33 రిజర్వేషన్లలో బీసీ మహిళల సబ్ కోట సంగతి తేల్చాలంటూ సంఘ నాయకులు కోరారు. రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీను మాట్లాడుతూ 2023లో 30 చట్టసభలో మహిళా రిజర్వేషన్ బిల్లు చట్టం చేశారే గాని ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కూడా ఓబీసీ మహిళల సంగతి తేల్చలేదన్నారు. కార్యక్రమంలో కథం నాగజ్యోతి, కొల్లిపర బాలాజీ, దమ్మాటి మల్లిఖార్జున, బత్తుల వెంకట రాజశేఖర్, ముట్టుకూరు బుజ్జి, కొండ్రాతి కోటేశ్వరరావు, మేకల శ్రీనివాసరావు, బాసు ఆంజనేయులు, లింగాల అంకమ్మరావు, బీసీ నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సుపరిపాలనలో ప్రజల సంక్షేమం: ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

రేపల్లె, జూలై 27, ప్రభాతవార్త:ఆంధ్రప్రదేశ్‌లో లోటు బడ్జెట్ ఉన్నప్పటికీ విజన్ కలిగిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమర్థవంతంగా పరిపాలన చేస్తూ ప్రజల సంక్షేమాన్ని నెరవేరుస్తున్నారని వేమూరు శాసనసభ్యుడు నక్కా ఆనందబాబు అన్నారు.సోమవారం భట్టి ప్రోలు మండలం లోని ఐలవరంలో రెండేళ్ళ సుపరిపాలన, అభివృద్ధి సంక్షేమానికి సంబంధించి ప్రచార కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 7వ తేదీ వరకు ఇంటింటికీ ప్రచార కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.సంక్షేమ పథకాలను వెల్లడిస్తూ ప్రజా సమస్యలను తెలుసుకుని సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు



తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.అర్హత కలిగి సంక్షేమ పథకాలను పొందని వారిని గుర్తించి పథకాలు వర్తించే విధంగా కృషి చేస్తానని ఆనందబాబు హామీనిచ్చారు.రూ.90 లక్షలతో నిర్మించిన రెండు సిమెంటు రహదారులను ఎమ్మెల్యే ఆనందబాబు ప్రారంభించారు.చేనేత కార్మికులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్,తల్లికి వందనం,రైతుబంధు తదితర పథకాల గురించి ప్రజలకు అవగాహన కలి ్పంచారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య,వేమూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ జి.జె.వి.పూర్ణకుమారి,రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా,రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.పి.శ్రీనివాసరావు,మాచర్ల నాగరాజు,దీపాల శివప్రసాద్,వి.కోటేశ్వరరావు,శివకుమార్,మండల పార్టీ కన్వీనర్ వి.శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

## కలాం సేవలు చిరస్మరణీయం: పీటా నాగమోహన్ కృష్ణ

రేపల్లె, జూలై 27, ప్రభాతవార్త:భారత దేశం కోసం శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధికి మాజీ రా ష్ట్రపతి,మిస్సైల్ మ్యాన్ డాక్టర్ ఏపిజె అబ్దుల్ కలాం అందించిన సేవలు చిరస్మరణీయమని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త పీటా నాగమోహన్ కృష్ణ అన్నారు.సోమవారం 11వ వర్ధంతి పురస్కరించుకుని అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి



నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ అత్యున్నత పురస్కారమైన భారతరత్న గ్రహీతగా ప్రజల మనసులో అబ్దుల్ కలాం నిలిచిపోయారన్నారు.యువతకు స్ఫూర్తిదాయకమైన సందేశాలను అబ్దుల్ కలాం అందించారని ఆయన వివరించారు. భారతదేశపు తొలి స్వదేశీ ఉపగ్రహ ప్రయోగ వాహనం ఎస్ఎల్‌వి-3 రూపకల్పనలో అబ్దుల్ కలాం కీలకపాత్రధారిగా నిలిచారని మోహన్ కృష్ణ పేర్కొన్నారు.అగ్ని,పృథ్వి వంటి క్షిపణుల తయారీకి కృషి చేసి రక్షణ రంగంలో భారతదేశాన్ని శక్తివంతంగా తీర్చిదిద్దిన ఘనత ఆయనకే దక్కుతుందని చెప్పారు.1998లో పోఖ్రాన్-2 అణు పరీక్షల విజయం వెనుక అబ్దుల్ కలాం శ్రమకు ఫలితంగా మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా అనే పురస్కారం లభించిందని ఆయన తెలిపారు.2002-2007 కాలానికి భారతదేశ 11వ రాష్ట్రపతిగా అత్యుత్తమ సేవలు అందించిన అబ్దుల్ కలాం ఎన్నో పురస్కారాలు పొంది ప్రజా రాష్ట్రపతిగా గుర్తింపు పొందారని ఆయన పేర్కొన్నారు.తుది శ్వాస విడిచే వరకు భారతదేశ భవిష్యత్ గురించే కృషి చేశారని పీటా నాగమోహన్ కృష్ణ కొనియాడారు.ఈ కార్యక్రమంలో వైకాపా శ్రేణులు కరేటి శేషగిరిరావు,చిమటా బాలాజీ,రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## హామీలను నెరవేర్చని కూటమి ప్రభుత్వం

రేపల్లె, జూలై 27, ప్రభాతవార్త:కూటమి ప్రభుత్వం పరిపాలన ప్రారంభించి రెండు సంవత్సరాలు దాటినా హామీలను నెరవేర్చడంలో విఫలమైందని ఎఐటియుసి బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శామ్యూల్ విమర్శించారు.సోమవారం రేపల్లె పట్టణంలో సమస్యలను పరిష్కరించాలని అంగన్వాడీ వర్కర్స్ ,హెల్పర్స్ నినాదాలు చేశారు.ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో శామ్యూల్ మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించేందుకు మరో రెండు నెలల్లో ఆంధ్రప్రదేశ్ అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర మహాసభను నిర్వహించి భవిష్యత్ కార్యాచ రణను రూపొందిస్తామని చెప్పారు.విధుల



నిర్వహణలో అంగన్వాడీ కార్యకర్తలు మానసిక,శారీరక ఒత్తిడికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.ఆర్థిక ప్రయోజనాలు అందని పరిస్థితులు నెలకొన్నందున అంగన్వాడీలు, హెల్పర్లు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు.విధి నిర్వహణేతర పనులను అప్పగించడం వలన సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు.నెలకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.సంక్షేమ పథకాలను అమలు చేయాలని శామ్యూల్ సూచించారు.ఈ సమావేశంలో ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ బాపట్ల జిల్లా కన్వీనర్ సింగం వాణిశ్రీ,జిల్లా అధ్యక్షుడు కోన శ్రీనివాసరావు,సీనియర్ సిపిఐ నేత కన్నెగంటి రమేష్,త్రివేణి, విజయలక్ష్మి,అరుణ,నసీమా సుల్తానా,చాన్దబీ,హిల్డా,అంగన్‌వాడీ వర్కర్స్,హెల్పర్స్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి

నరసరావుపేట టౌన్, జూలై 27 ప్రభాతవార్త : స్థానిక కూరగాయల మార్కెట్ సెంటర్ లో ఎంఐఎం పార్టీ నాయకులు షేక్. మస్తాన్ వలి ఆధ్వర్యంలో సోమవారం భారతదేశ మాజీ రాష్ట్రపతి, మిసెల్ మెన్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కసా రాంబాబు, వైదన వెంకట్, సత్యనారాయణ రాజు, ఉపాలపాటి రంగయ్య, మహిళ నాయకురాలు మల్లెల అనిలా, అబూబాకర్, సుభాని, కరీం, సైదా, నబి అన్సారీ తదితరులు పాల్గొన్నారు.

## భారతరత్న మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి

రాజుపాలెం, జూలై 27 ప్రభాతవార్త: కొండమోడు కె. ఎన్.ఆర్ విద్యా సంస్థలు నందు భారతరత్న మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కోనేటి నరసింహారావు బాడిస మస్తాన్ రావు మాట్లాడుతూభారతదేశ మాజీ రాష్ట్రపతి, గొప్ప శాస్త్రవేత్త, "ప్రజల రాష్ట్రపతి"గా పేరుగాంచిన డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం గారి వర్ధంతి సందర్భంగా ఆయనకు మన ఘన నివాళులు అర్పిద్దాం. డాక్టర్ కలాం గారు నిరుపేద కుటుంబంలో




జన్మించినప్పటికీ, తన కృషి, పట్టుదల, క్రమశిక్షణతో దేశ అత్యున్నత పదవిని అలంకరించారు. భారతదేశ క్షిపణి సాంకేతిక అభివృద్ధికి విశేష సేవలందించి "మిసైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా"గా గుర్తింపు పొందారు. విద్యార్థులంటే ఆయనకు ఎంతో ప్రేమ. "కలలు కనండి. ఆ కలలను నిజం చేసుకునేలా కష్టపడండి" అని ఎప్పుడూ ప్రోత్సహించేవారు. ప్రతి విద్యార్థి జీవితంలో ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకుని, నిజాయితీతో, క్రమశిక్షణతో, నిరంతర శ్రమతో ముందుకు సాగాలని ఆయన బోధించారు. ప్రియమైన విద్యార్థులారా, మనం కూడా డాక్టర్ కలాం గారి ఆశయాలను ఆదర్శంగా తీసుకుని, మంచి పౌరులుగా ఎదిగి దేశాభివృద్ధికి మన వంతు కృషి చేద్దాం. "కలలు కనండి... ఆ కలలను నిజం చేసేందుకు నిరంతరం శ్రమించండి" అనే కలాం గారి సందేశాన్ని మన జీవితంలో ఆచరిద్దాం. సంకల్పం ఉంటే సాధ్యం కానిదే లేదు. అత్యంత ప్రతికూల పరిస్థితుల్లో కూడా తన లక్ష్యాన్ని సాధించిన ఆయన, ప్రతి విద్యార్థికి ప్రేరణ. మనము కూడా ఆయనను ఆదర్శంగా తీసుకుని, కష్టపడి చదివి, మన లక్ష్యాలను సాధించాలి. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సాధినేని నరసింహారావు, ఆలూరు ప్రసన్నకుమార్, తెలకపల్లి గోపికృష్ణ, విద్యార్థిని విద్యార్థులు పాల్గొని ఘనంగా నివాళులర్పించినారు

## ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిని కాపాడిన సత్తెనపల్లి టౌన్ పోలీస్

సత్తెనపల్లి, జూలై 27, ప్రభాతవార్త: సోమవారం సాయంత్రం సుమారు 6.30 గంటల సమయంలో డయల్ 100 ఫోన్ ద్వారా వచ్చిన సమాచారం మేరకు ఒక వ్యక్తి పట్టణ శివారులోని రైల్వే ట్రాక్ పై ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ రమేష్ మరియు హోంగార్డ్ రాజేష్ కన్నా గార్లు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని రైల్వే



ట్రాక్ పై ఆత్మహత్యకు ప్రయత్నించిన సత్తెనపల్లి మండలం పాకాల పాడు గ్రామానికి చెందిన పోతల మరియబాబు శ్రీ/ని యేసు రత్నం, వయస్సు 60 సంవత్సరాలు అను వ్యక్తిని కాపాడటం జరిగింది, విచారణలో కుటుంబ సమస్యల నేపథ్యంలో సదరు వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. పై సంఘటనలో సత్వరమే స్పందించి వ్యక్తిని కాపాడిన కానిస్టేబుల్ రమేష్ మరియు హోంగార్డ్ రాజేష్ కన్నా గార్లను పట్టణ ఇన్స్పెక్టర్ ఎన్ నాగమల్లేశ్వరరావు గారు సిబ్బంది అభినందించారు

28MN 7PG-GNT_28MN 7PG-GNT.qxd 28-07-2026 AM 12:26 Page 1



## రామ్ చరణ్ కోలుకోవాలని ప్రత్యేక పూజలు

గుంటూరు, జూలై 27, ప్రభాతవార్త : సినీ హీరో, మెగా పవర్ స్టార్ కొణిదెల రామ్ చరణ్ త్వరగా కోలుకోవాలని గుంటూరు కొత్తపేటలోని శ్రీ ఉమామహేశ్వర బాలాత్రిపుర సుందరి స్వామివారి దేవస్థానం లో సోమవారం జనసేన పార్టీ నేతలు, చిరంజీవి ఫ్యాన్స్ , మరియు మెగా యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. జనసేన పార్టీ సీనియర్ నేత మేకల రవీంద్ర బాబు మాట్లాడుతూ..పెద్ది చిత్ర షూటింగ్ లో గాయపడి శస్త్రచికిత్స చేయడం జరిగినదని, మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ అనతి కాలంలోనే స్టార్ ఇమేజ్ సంపాదించుకుని తన



నటనా ప్రతిభతో ప్రేక్షకుల మన్ననలు పొందినారన్నారు. జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పు వెంకట రత్తయ్య మాట్లాడుతూ రామ్ చరణ్ తండ్రికి తగ్గ తనయుడని,చిరుత చిత్రంతో సినిమా రంగంలో ప్రవేశించి మగధీరతో తన ఉత్తమ నటనను ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో పాటు నిర్మాతలకు కలెక్షన్ల వర్షం కురిపించారని గుర్తు చేశారు. జిల్లా జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ళ హరి మాట్లాడుతూ..చిరు తనయునిగా సినిమారంగంలో ప్రవేశించిన రామ్ చరణ్ అతి తక్కువ సినిమాలే తీసినా నిర్మాతల పాలిట కల్పవృక్షం లాంటి వారన్నారు. సినిమా రంగంలో కాని, ప్రకృతి సహకరించని సమయాల్లో కాని సహాయం చేయడంలో తన తండ్రి చూపించిన బాటనే ఎంచుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు.రాష్ట్ర లేబర్ బోర్డు డైరెక్టర్ చింతా రేణుకారాజు మాట్లాడుతూ..
రామ్ చరణ్ ఎప్పటికప్పుడు కొత్తరకం డ్యాన్స్ లు, ఫైట్స్, యాక్షన్ సన్నివేశాలతో ప్రేక్షకులను మెప్పించి తన తండ్రి మెగాస్టార్ చిరంజీవిని సైతం అబ్బురపరిచేలా సినిమా రంగంలో కొనసాగుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో మెగా యూత్ ఫోర్స్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు చింతా శివ, రాష్ట్ర కోకన్వీనర్ నలబోలు తేజ, రాష్ట్ర కోకన్వీనర్ అనిల్, గుంటూరు జిల్లా మెగా యూత్ ఫోర్స్ జిల్లా కోకన్వీనర్ పావులూరి కోటేశ్వరరావు, గుంటూరు నగర జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు ఆనంద్ సాగర్, పట్టణ ప్రధాన కార్యదర్శి సూరి శెట్టి ఉదయ్, నగర కార్యదర్శి త్రిపురా కుమార్, గుంటూరు పట్టణ వీర మహిళా నాయకురాలు రామిశెట్టి ధరణి, చైతన్య, తిరుమలశెట్టి కిట్టు, 6వ డివిజన్ అధ్యక్షులు దళవాయి భార్గవ్, శివాలయం బోర్డు మెంబర్ మల్లేశ్వరి, పోతురాజు, దుర్గాప్రసాద, తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణా పశ్చిమడెల్టాకి సాగునీరివ్వండి: డా.చందు సాంబశివుడు విజ్ఞప్తి.

తెనాలి జులై27(ప్రభాతవార్త): కృష్ణ పశ్చిమ డెల్టా క్రింద తెనాలి డివిజన్లోని పంట పొలాలకు సాగునీరు విడుదల చేయాలని తెనాలి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి డాక్టర్ చందు సాంబశివుడు విజ్ఞప్తి చేశారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏవో శ్రీనివాసరావు కి పార్టీ శ్రేణులతో కలిసి వినతి పత్రం అందించారు. కృష్ణ పశ్చిమ డెల్టా పరిధిలో తెనాలి డివిజన్ లోని రైతులు వ్యవసాయ ఆధారితం పై ఆధారపడి ఉన్నారని ప్రధానంగా ఖరీఫ్ సీజన్లో వరి పంటకు ప్రస్తుత వాతావరణ పరిస్థితులను చూస్తే తగినంత సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారని అన్నపూర్ణగా పిలిచే డెల్టా ప్రాంతం నేడు రైతులు సాగుకి నీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని



డాక్టర్ సాంబశివుడు పేర్కొన్నారు. కృష్ణానదిలోని నికర జలాలను డెల్టా ప్రాంతంలోని రైతులకు సాగునీరు విడుదల చేయాలన్నారు. ఒకవేళ నికర జలాలు మూడు టీఎంసీలు ఉండాలని లేని పక్షంలో పులిచింతల ద్వారా అందజేసి అవసరమైతే వారబంధి నిర్వహించి రైతులకు సాగునీరు అందించాలని అంతేకానీ రైతులను పంటలు వేయవద్దని సలహా ఇవ్వటం ప్రభుత్వానికి తగదన్నారు. ప్రభుత్వాలకు ప్రజలకు రైతులు రైతు కూలీలు ముఖ్యమని ఎక్కువ శాతం ప్రజలు వ్యవసాయ ఆధారిత పై జీవిస్తున్నారని అది గుర్తించకుండా పరిశ్రమలకు పెత్తందారులకు మద్దతు ఇవ్వటం ప్రభుత్వాలకు తగదని డాక్టర్ సాంబశివుడు తీవ్రంగా విమర్శించారు. ఇప్పుడు అంటున్న ఏలినో ప్రభావం గతంలో కూడా ఉందని కానీ ఆనాడు రైతులను పంటలు వేయవద్దని అప్పటి ప్రభుత్వాలు సూచించలేదన్నారు. కావున ఇప్పటికైనా ప్రభుత్వం కృష్ణా పశ్చిమ డెల్టా రైతాంగానికి సాగునీరు అందించి వ్యవసాయాన్ని ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ తరపున విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పొన్నూరు నాగసూర్య శశిధర్ రావు,మండల పార్టీ అధ్యక్షులు పినపాటి స్టీవెన్ బాబు,బీసీ సెల్ అధ్యక్షులు డోగిపర్తి శ్రీనివాసరావు, జవహర్ బాల్ మంచి కో ఆర్డినేటర్ పిల్లి ప్రభాకర్, కడదం కోటేశ్వరరావు, పెనుకొండ శివకుమార్ , భీమ రమేష్,ఆళ్ల కృష్ణ, కట్ట వీరస్వామి,కార్తీక్ బాబు ఎన్. మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

## అబ్దుల్ కలాంకు ఘనంగా నివాళులు అర్పించిన వైసిపి నాయకులు.

క్రోసూరు, జూన్ 27 ప్రభాతవార్త : క్రోసూరు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పెదకూరపాడు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు నంబూరు శంకరరావు పిలుపుమేరకు క్రోసూరు మండల పార్టీ అధ్యక్షులు వేలది అప్పారావు అధ్యక్షతన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చిత్రపటమునకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు పెరుమళ్ళపల్లి కోటయ్య మాట్లాడుతూ భారతదేశాన్ని శాస్త్ర సాంకేతిక రంగంలో దిక్సూచిగా



నిలిపిన మాజీ రాష్ట్రపతి భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని కొనియాడినారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర మాజీ కార్యదర్శి గార్లపాటి దాసు. జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు నల్లగొండ వెంకయ్య. అచ్చంపేట మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు ఆటో తిమోతి. క్రోసూరు గ్రామ పార్టీ అధ్యక్షులు షేక్ ఖాదర్. వైసీపీ నాయకులు షేక్ ఖలీల్. మేదర రోశయ్య. షేక్ నాగుల మీరా. వందిటి వీరయ్య మొదలగు వారు ఘనంగా నివాళులు అర్పించారు.

## తెనాలిలో మాఏపి ఫిల్మ్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ ఏర్పాటు: దర్శకులు దిలీప్ రాజా


తెనాలి మున్సిపాలిటీ జులై27(ప్రభాతవార్త): తెనాలిలో మాఏపి ఫిల్మ్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ లో 9 విభాగాలలో 50 రోజుల శిక్షణ కోసం సెప్టెంబర్ 7 లోగా ఆంధ్ర ప్రదేశ్ కు చెందిన అభ్యర్థుల నుండి మాత్రమే ఎంట్రీలను ఆహ్వానిస్తున్నట్లుగా మాఏపి ఆర్టిస్ట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ 24 విభాగాల యూనియన్ వ్యవస్థాపకులు సినీదర్శకుడు దిలీప్ రాజా తెలిపారు. స్థానిక అంబేద్కర్ కళాశాలలో సోమవ్వారం జరిగిన మాఏపి కార్యవర్గ సమావేశంలో ఫిల్మ్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ విధి విధానాలను వెల్లడించారు. రైటింగ్,యాక్టింగ్, యాంకరింగ్,ఎడిటింగ్,కొరియోగ్రఫీ, సినిమాటోగ్రఫీ,



మేకప్, కాస్ట్యూమ్స్, దర్శకత్వం శాఖలకు ఆయా రంగాల్లోని అనుభవజ్ఞులు శిక్షణ ఇస్తారని ఆయన వివరించారు.సినిమా షూటింగ్‌లకు ఆంధ్ర ప్రదేశ్ అడ్డాగా ఉండాలనే లక్ష్యంతో ఫిల్మ్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ ను తొలిసారి కోస్తా ఆంధ్ర ప్రదేశ్ లో నెలకొల్పుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఇప్పటికే ఈ అవకాశం కేవలం ఆంధ్ర ప్రదేశ్‌లో నివాసం ఉంటున్న అభ్యర్థులకు మాత్రమేనని ఇతర రాష్ట్రాల అభ్యర్థులను తీసుకోవడం జరగదని ఆయన స్పష్టం చేశారు.కనీస 20 అభ్యర్థులు ఉంటేనే ఒక్కో విభాగంలో కోర్సు ప్రారంభం అవుతుందన్నారు.శిక్షణ కోసం ఆంధ్ర ప్రదేశ్ కి చెందిన ఔత్సాహికులు తమ బయోడేటాను,ఆధార్, ఫోటో జతపరచి పూర్తివివరాల కోసం "శిమా ఏపి కార్యాలయం, 32 56,అలపాటి నగర్, సుల్తానాబాద్, తెనాలి 522201,గుంటూరు జిల్లా,ఆంధ్ర ప్రదేశ్ చిరునామకు సంప్రదించవలసిందిగా దిలీప్ రాజా కోరారు.8790439289 నంబర్ తో వ్యాట్సాప్ కాంటాక్ట్ చేయాలని ఆయన తెలిపారు.సమావేశంలో నటులు వేమూరు విజయ భాస్కర్, వారణాసి పార్వతి, రమేష్ వర్మ, భవాని శంకర్,ఎడిటర్ చింటూ(గుంటూరు),కాస్ట్యూమ్ డిజైనర్ సునీత (పలాస), కొరియోగ్రాఫర్ మైనేని హరి శ్రీనివాస్,కొరియోగ్రాఫర్ చిన్న మాస్టర్ (తెనాలి)సెల్ రవి ,సముద్రాల శ్రీధర్ శర్మ,సైదులు యాదవ్, మల్లెపాడు రమేష్,రమ్య రాథోడ్,ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ గ్రీవెన్స్ కి ఆరు అర్జీలు

తెనాలి మున్సిపాలిటీ జులై27(ప్రభాతవార్త): ప్రతి సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (గ్రీవెన్స్) కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ రామ అప్పలనాయుడు పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.స్వీకరించిన అర్జీలను సంబంధిత విభాగాధిపతులకు తగిన చర్యలు తీసుకోవలసిందిగా పంపించారు.ప్రధానంగా, ఇంజనీరింగ్ సెక్షన్ కు సంబంధించి,మైల శ్రీనివాస రావు పినపాడు కాల్వ పూడిక గురించి



పంట కాల్వ గురించి చేసిన వినతి, రెవెన్యూ సెక్షన్ కు సంబంధించి,కటారి గణేష్ తన తండ్రి కటారి వేంకటేశ్వర రావు ఆధార్ కి లింక్ అయిన రెండు అసెస్ మెంటు నంబర్లు తొలగించుటకు చేసిన వినతి.అదేవిధంగా, టౌన్ ప్లానింగ్ సెక్షన్ కు సంబంధించి,కరేటి గోపి ప్రభుత్వ స్థలము అక్రమ నిర్మాణం గురించి చేసిన వినతి,అలాగే ఈదర సాంబశివరావు వారి ఇంటి ముందు నిల్వ ఉంచిన వాహనములు గురించి చేసిన వినతి.అంతే కాకుండా, కోటా గంగాధరరావు ఆక్రమణలు తొలగించవలసినదిగా చేసిన వినతి, మరియు తోట శ్రీనివాసరావు వారి స్థలం వల్లభనేని జ్యోతి అక్రమంగా ఆక్రమించు కొనుట గురించి చేసిన వినతి.ఈ సందర్భంగా వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు.

## డిఎస్సీ స్కాంపై సిబిఐ విచారణ చేయాలి

### -వైకాపా సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ డిమాండ్

పొన్నూరు, జూలై 27,ప్రభాతవార్త: విద్యార్థులు, నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న తీవ్రమైన సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరులో జరగబోయే వైకాపా విద్యార్థి, యువత ర్యాలీకి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంబటి



మురళీకృష్ణ మాట్లాడుతూ డిఎస్సీ నియామకాలలో జరుగుతున్న అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రంలో అర్హులైన విద్యార్థులందరికీ ఫీజు రీఎంబర్స్ మెంట్‌ను తక్షణమే పూర్తిస్థాయిలో విడుదల చేయాలని, అదేవిధంగా ఇచ్చిన హామీ ప్రకారం నిరుద్యోగ భృతిని వెంటనే చెల్లించాలన్నారు. దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపిన నీట్ పేపర్ లీకేజి వ్యవహారంలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, యువత భవిష్యత్‌తో ఆడుకొంటున్న ప్రభుత్వాల తీరుకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటం చేస్తామని హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల యువజన వ్యతిరేక విధానాలను ఎండగడుతూ రేపు ఉదయం 9గంటలకు గుంటూరు లాడ్జి సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, నిరుద్యోగులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయమార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచి చుండూరు వీరయ్య, వైకాపా వాణిజ్య విభాగం అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వరరావు, నాయకులు షేక్ మౌలాలి, చింతలపూడి మురళీకృష్ణ, పల్లికల శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## న్యాయం చేయాలంటూ అర్జీని అందజేసిన బాధితులు

పొన్నూరు, జూలై 27,ప్రభాతవార్త: సౌదీ అరేబియాలోని మక్కా పుణ్యక్షేత్రంలో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి నగదు కాజేసి మోసం చేశాడంటూ తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన పిజిఆర్‌ఎస్‌లో అర్జీని అందజేశారు.



పట్టణానికి చెందిన కడుపేద కుటుంబానికి చెందిన పలువురు మహిళలు అంజుమన్ కమిటి నాయకుల ఆధ్వర్యంలో అర్జీని అందజేశారు. రేపల్లె పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు సయ్యద్ తాహిర్ సౌదీ అరేబియాలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి ఒక్కొక్కరి వద్ద రూ.60వేలు చొప్పున తీసుకొని, చివరికి ఉద్యోగం ఇప్పించకుండా మోసం చేశారని, డబ్బులు అడిగితే మమ్మల్ని బెదిరిస్తున్నారని అర్జీలో తెలిపారు. తమను మోసం చేసిన వ్యక్తి నుంచి తమ డబ్బులను ఇప్పించి, మోసం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అర్జీలో కోరారు. అర్జీ అందజేసినవారిలో అంజుమన్ కమిటి అధ్యక్షుడు మగ్బుల్‌బేగ్, షేక్ మాము,పఠాన్ పిరోజ్‌ఖాన్ ఆధ్వర్యంలో మోసపోయిన బాధితులు షేక్ ఫాతిమా, షేక్ రేష్మా, షేక్ నస్రీన్, షేక్ హాషింబాష, తదితరులున్నారు.

## నిస్వార్థ సేవా తత్పరుడు బండి వెంకటేశ్వర్లు

### -ప్రజల మనస్సులను గెలుచుకున్న నాయకుడు బండి
### -గ్రామాభివృద్ధే శ్వాసగా పనిచేసిన ఘనత బండిదే

పొన్నూరు, జూలై 27,ప్రభాతవార్త: నిస్వార్థ సేవా తత్పరుడిగా, పరోపకారమే పరమావధిగా, తనకు చేతనైనంత మంచి చేసి ప్రజలందరి మన్ననలు పొందిన స్వర్గీయ బండి వెంకటేశ్వర్లు చిరస్మరణీయుడని మాజీ మంత్రి, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సుమారు నాలుగు దశాబ్దాల పైచిలుకు సర్పంచిగా సేవలందించి ప్రజలందరి మన్ననలు పొందిన బండి వెంకటేశ్వర్లు ఇటీవల మృతి చెందారు. సోమవారం గుంటూరులో బండి వెంకటేశ్వర్లు సంస్మరణ సభ





జరిగింది. సభలో కన్నా లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ బండి వెంకటేశ్వర్లు ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేసే వ్యక్తి అని చెప్పారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ గ్రామాల్లో రాజకీయాలు వేరుగా ఉంటాయని, అందులోనూ వెల్లలూరు గ్రామంలో రాజకీయం వేరుగా ఉంటుందన్నారు. అలాంటి గ్రామానికి నాలుగు దశాబ్దాలుగా బండి వెంకటేశ్వర్లు పనిచేయడమంటే ఆయనకే చెల్లిందన్నారు. వెల్లలూరు గ్రామాభివృద్ధిలో బండి వెంకటేశ్వర్లుదే పైచేయి అన్నారు. వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ అతి చిన్న వయసులోనే సర్పంచిగా ఎన్నికయి, అదే పరంపరను నాలుగు దశాబ్దాలపైచిలుకు కొనసాగించడం సామాన్యమైన విషయం కాదన్నారు. పొన్నూరు శ్రీ సహస్రలింగేశ్వరస్వామి, శ్రీ వీరాంజనేయస్వామివారి ధర్మకర్తల మండలి ఛైర్మన్‌గా బండి వెంకటేశ్వర్లు పనిచేసి ఎంతో అభివృద్ధి చేశారన్నారు. బండి వెంకటేశ్వర్లు లాంటి వ్యక్తులు సమాజలంలో చాలా అరుదుగా ఉంటారన్నారు. రాబోయే కాలంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే నియోజకవర్గంలో బండి వెంకటేశ్వర్లు ప్రజలకు చేసిన సేవలకు గుర్తింపుగా చేబ్రోలు-పొన్నూరు మధ్యలో ఉన్న బ్రిడ్జికి బండి వెంకటేశ్వర్లు పేరుగా నామకరణం చేసేందుకు తమ వంతు కృషి చేస్తానని చెప్పారు. బండి వెంకటేశ ర్వర్లు తనయుడు బండి శివరామప్రసాద్(బాబు) పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పరామర్శించారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పలు కార్పోరేషన్ల ఛైర్మన్లు, అభిమానులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## తెదేపా ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం వర్ధంతి

రేపల్లె, జూలై 27, ప్రభాత వార్త:పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం భారతరత్న డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం వర్ధంతి నిర్వహించారు.అబ్దుల్ కలాం చిత్రపటానికి



పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులుఅనగాని శివప్రసాద్,జి.వి.నాగేశ్వరరావు, ఎం.రామకృష్ణ,పి.లక్ష్మీనరసమ్మ, పి.గౌరీరామకుమారి,గుర్రం మురహరిరావు,టి.ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు ప్రారంభించిన డోర్ టు డోర్ ప్రచార నిర్వహణకు సంబంధించి గ్రామ,వార్డు అధ్యక్షులు,క్లస్టర్ యూనిట్ ఇన్‌చార్జ్‌లు,బూత్ కమిటీ కన్వీనర్లు,ఐటిడిపి సభ్యులు,జిల్లా,రాష్ట్ర స్థాయి నాయకులతో అనగాని శివప్రసాద్ సమావేశం నిర్వహించారు.

## పిజిఆర్‌ఎస్‌కు 4 అర్జీలు

రేపల్లె, జూలై 27, ప్రభాతవార్త:ప్రజల నుంచి అందిన అర్జీలను పరిశీలించి పరిష్కరిస్తామని రేపల్లె ఆర్డీవో బి.శ్రీదేవి చెప్పారు.సోమవారం రేపల్లె రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు 4 అర్జీలు అందజేశారు.తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలని రేపల్లె మండలంలోని బేతపూడి గ్రామానికి చెందిన సిహెచ్.హెప్సిలా అర్జీ అందజేశారు.సిమెండ్ రహదారికి ఇరువైపులా డ్రెయిన్ సైడ్ వాల్స్ నిర్మించాలని కోరుతూ నగరం



మండలంలోని అద్దంకివారి పాలెంకు చెందిన ఆర్.ఆచ్చయ్య అర్జీ అందజేశారు.నకిలీ వీలునామా సృష్టించుకుని పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన వ్యవహారాన్ని ఆర్‌ఓఆర్ కింద పరిష్కరించాలని రేపల్లె మండలంలోని కామరాజుగడ్డ గ్రామానికి చెందిన పి.వెంకటేశ్వరరావు అర్జీ సమర్పించారు.తనకు చెందిన భూములను ఆర్‌ఓఆర్ ద్వారా పరిష్కరించాలని చెరుకుపల్లి మండలంలోని పొన్నపల్లి గ్రామానికి చెందిన కె.నరసమ్మ అర్జీ అందజేశారు.వీటిని పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆర్డీవో శ్రీదేవి వెల్లడించారు.

## ఘనంగా ముగిసిన ఈశా ఫౌండేషన్ గ్రామోత్సవ వేడుకలు

### -క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించిన క్రీడాకారులు -ఉత్సాహంగా పాల్గొన్న క్రీడాకారులు
### -గ్రామీణుల్లో ఉత్సాహాన్ని నింపిన ఈశా గ్రామోత్సవం -ఆర్వీఐటీ ఛైర్మన్ ఆర్ వంశీకృష్ణ

చేబ్రోలు(పొన్నూరు), జూలై 27,ప్రభాతవార్త: మండల కేంద్రమైన చేబ్రోలు ఆర్వీఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు జరిగిన గ్రామోత్సవం క్రీడలు ఆ ప్రాంత వాసులకు ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని కలిగించాయి. ఈశా ఫౌండేషన్ నిర్వహించే ఈ వేడుకలకు చేబ్రోలు ఆర్వీఐటీ కళాశాల వేదికైంది. వాలీబాల్, త్రోబాల్, మ్యూజికల్ ఛైర్స్, తదితర గ్రామీణ క్రీడల్లో పెద్ద ఎత్తున క్రీడాకారులు పాల్గొని ఉత్సవాన్ని విజయవంతంగా ముగించారు. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవ





వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్వీఐటీ కళాశాల ఛైర్మన్ ఆర్.వంశీకృష్ణ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. ఓడినవారు నిరుత్సాహ పడకుండా ఓటమి గెలుపుకు మొదటి మెట్టని భావించి ప్రయత్నిస్తే భవిష్యత్తులో విజయాలు సాధించవచ్చన్నారు. గ్రామీణుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు ఈశా ఫౌండేషన్ ముందుకు రావడం, అందులో తమ ఆర్వీఐటీ భాగస్వామ్యం కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆర్వీఐటీ ప్రిన్సిపాల్ ఆర్.వి.కృష్ణయ్య మాట్లాడుతూ ఇలాంటి క్రీడల వల్ల గ్రామీణుల్లో ఉత్సాహం పెరుగుతుందన్నారు. క్రీడల పట్ల ఆసక్తిని పెంచవచ్చన్నారు. ఈశా పౌండేషన్ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఈశా వాలంటీర్ సాంబశివరావు మాట్లాడుతూ ఫైనల్స్ పోటీల్లో మహిళల త్రోబాల్ పోటీల్లో పాతరెడ్డిపాలెం గ్రామానికి చెందిన జట్టు విజేతగా నిలిచిందన్నారు. శేకూరు గ్రామానికి చెందిన జట్టు ద్వితీయస్థానాన్ని సాధించిందన్నారు. వాలీబాల్ పురుషుల విభాగంలో చీరాల మండలం కావూరివారిపాలెం జట్టు మొదటి బహుమతిని, ఎడ్లపాడు గ్రామానికి చెందిన జట్టు రెండో స్థానాన్ని సాధించిందన్నారు. గెలుపొందిన విజేతలకు ప్రశంసాపత్రాలు, మెమొంటోలు, నగదు పారితోషికాలను అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఈశా వాలంటీర్లు జగదీష్, పద్మావతి, కృష్ణకుమారి, గంగాధర్, దేవి శ్రీకాంత్ పాల్గొన్నారు.

## 9న ప్రహ్లాద చరిత్ర ప్రవచనం

పొన్నూరు, జూలై 27,ప్రభాతవార్త: ప్రతిమాసం వాణీదరహాసం సాహిత్య సాంస్కృతి సంస్థ ఆధ్వర్యంలో బ్రాహ్మణ బజారులోని శ్రీ గాయత్రీ మందిరం-శంకరమఠంలో వచ్చే నెల 9వ తేదీ సాయంత్రం 6.30గంటలకు ప్రహ్లాద చరిత్రపై ప్రవచన కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు నాగలింగం హరిహరపంత్ తెలిపారు. నరసరావుపేటకు చెందిన సంస్కృత పండితులు మంత్రిరాజు శివరామయ్య ఈ ప్రవచనం చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సాహిత్యాభిమానులు, భాషాభిమానులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని హరిహరపంత్ కోరారు.

## పొన్నూరు ఫోటో, వీడియో గ్రాఫర్స్ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అన్నవరపు వెంకట నరసింహారావు



పొన్నూరు, జూలై 27,ప్రభాతవార్త: పొన్నూరు ఫోటో, వీడియో గ్రాఫర్స్ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన అన్నవరపు వెంకట నరసింహారావు ఎన్నికయ్యారు. స్థానికంగా జరిగిన అసోసియేషన్‌లో 144మంది సభ్యులు ఉండగా 130మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అధ్యక్ష పదవికి పోటీపడ్డ ఇద్దరు అభ్యర్థుల్లో అత్యధికంగా 78ఓట్లు నరసింహారావుకు దక్కాయి. షేక్ మస్తాన్‌కు 52ఓట్లు పోలయ్యాయి. నరసింహారావు 26ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. తేజస్వి స్టూడియో అధినేత నరసింహారావు అధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా పలువురు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ వృత్తిలో ఉన్న సభ్యులందరి అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు. అందరం ఒకే కుటుంబ సభ్యులుగా ఐకమత్యంతో ముందుకు సాగుదామన్నారు. తనకు ఓటు వేసి గెలిపించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## అబ్దుల్ కలామ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

పొన్నూరు, జూలై 27,ప్రభాతవార్త: శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారతీయ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన క్షిపణి పితామహుడు డాక్టర్ ఏపిజె అబ్దుల్ కలామ్ అని మునిసిపల్ మాజీ ఛైర్‌పర్సన్ డాక్టర్ నల్లమోతు రూత్‌రాణి కొనియాడారు. స్థానిక వైకాపా కార్యాలయంలో సోమవారం అబ్దుల్ కలామ్ వర్ధంతి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో



ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా జరిగిన సభకు పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ నాజర్ అధ్యక్షత వహించారు. సభలో డాక్టర్ రూత్‌రాణి మాట్లాడుతూ నిరాడంబర జీవితంతో భారతీయులందరి హృదయాల్లో నిలిచిపోయిన మహాత్ముడన్నారు. శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా ఆయన దేశానికి అందించిన సేవలు నిరుపమాణమన్నారు. ప్రతి ఒక్కరూ అబ్దుల్ కలామ్ జీవిత చరిత్రలను చదవాలన్నారు. తద్వారా వారి ఆశయాలు, ఆకాంక్షలు తెలుసుకొని ముందుకు సాగే అవకాశం ఉంటుందన్నారు. తొలుత అబ్దుల్ కలామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ మాజీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ బోయిన శివనాగరాజు, డాక్టర్ రమేష్ నాయకులు చింతలపూడి మురళీకృష్ణ, డక్కుమళ్ళ రవి, షేక్ మౌలాలి, గోపిశెట్టి వాసు, దేవరకొండ గోపి, గేరా సంజీవ్, షేక్ పీర్‌సాహెబ్, శ్యామల, చందోలు ఇమ్మానియేలు, బలగాని నాగరాజు, మంద్రు మనోహర్, పలగాని రమేష్, మధు, రాజశేఖర్, వాసిమళ్ళ సరళ, రుద్రపాటి నాగేశ్వరరావు తదితరులున్నారు.

## యువ పరిశోధకులు పరిశోధనలు చేపట్టాలి

### -ప్రొఫెసర్ పీ.విశ్వనాథ్-విజ్ఞాన్స్‌లో ఘనంగా జాతీయస్థాయి సదస్సు ప్రారంభం

పొన్నూరు, జూలై 27,ప్రభాతవార్త: భవిష్యత్ వైద్యరంగంలో క్వాంటమ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధస్సు(ఏఐ), మెషిన్ లెర్నింగ్ సమన్వయంతో మరింత సమర్థవంతమైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని, ఆ దిశగా యువ పరిశోధకులు పరిశోధనలు చేపట్టాలని ఏపీలోని ఐఐటీ శ్రీ సిటీ ఫ్యాకల్టీ అఫైర్స్ డీన్, ప్రొఫెసర్ పీ.విశ్వనాథ్ సూచించారు. చేబ్రోలు మండలం, వడ్లమూడి




విజ్ఞాన్స్ యూనివర్సిటీలో ఐదు రోజులపాటు నిర్వహించనున్న జాతీయ సదస్సును సోమవారం ఘనంగా ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ పి.విశ్వనాథ్ మాట్లాడుతూ క్వాంటమ్ కంప్యూటింగ్ ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలుకుతోందన్నారు. సాంప్రదాయ కంప్యూటర్లు పరిష్కరించడానికి ఎక్కువ సమయం తీసుకునే క్లిష్టమైన వైద్య సమస్యలను క్వాంటమ్ కంప్యూటింగ్ అత్యంత వేగంగా విశ్లేషించగలదని తెలిపారు. వ్యక్తిగత వైద్య సేవలు, ఔషధాల రూపకల్పన, జీనోమిక్ డేటా విశ్లేషణ, క్యాన్సర్ వంటి క్లిష్ట వ్యాధుల నిర్ధారణలో క్వాంటమ్ సాంకేతికత కీలక పాత్ర పోషిస్తోందన్నారు. మరో అతిథి ప్రొఫెసర్ డాక్టర్ ప్రకాష్ కొడాలి మాట్లాడుతూ భారీస్థాయిలో డేటా విశ్లేషణ, ఆప్టిమైజేషన్, కృత్రిమ మేధస్సు, సైబర్ సెక్యూరిటీ, బయోమెడికల్ ఇమేజింగ్ వంటి రంగాల్లో క్వాంటమ్ కంప్యూటింగ్ విశేష అవకాశాలను సృష్టిస్తోందన్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఈ రంగంపై విస్తృత పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. మరో అతిథి ప్రొఫెసర్ డాక్టర్ ప్రకాష్ చౌదరి మాట్లాడుతూ ఆరోగ్య రంగంలో కృత్రిమ మేధస్సు ఇప్పటికే మన దైనందిన జీవితంలో ప్రత్యక్షంగానో, పరోక్షంగా భాగమైందన్నారు. ఆసుపత్రుల్లో రోగ నిర్ధారణ, వైద్య చిత్రాల విశ్లేషణ, రోగుల ఆరోగ్య పర్యవేక్షణ, చికిత్సా ప్రణాళికల రూపకల్పన, ఔషధాల అభివృద్ధి వంటి అనేక విభాగాల్లో ఏఐ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. భవిష్యత్తులో ఏఐ క్వాంటమ్ కంప్యూటింగ్, డీప్ లెర్నింగ్ సమన్వయంతో ఆరోగ్యరంగంలో మరింత వినూత్న ఆవిష్కరణలు చోటుచేసుకుంటాయని చెప్పారు. అనంతరం అతిథులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేవీ క్రిష్ణకిషోర్, రిజిస్ట్రార్ పీఎంవీ రావు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## అబ్దుల్ కలామ్‌కు ఘన నివాళి

పొన్నూరు, జూలై 27,ప్రభాతవార్త: పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం మాజీ రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్ కలామ్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా అబ్దుల్ కలామ్ దేశానికి అందించిన సేవలను ఈ సందర్భంగా పలువురు వక్తలు గుర్తు



చేశారు. అబ్దుల్ కలామ్ జీవిత చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని నాయకులు సూచించారు. తొలుత అబ్దుల్ కలామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పోరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బండ్లమూడి బాబూరావు, వ్యవసాయ మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ మాదల వెంకటేశ్వరరావు, మునిసిపల్ మాజీ వైస్ ఛైర్మన్ ఆకుల సాంబశివరావు,షేక్ బాజిసాహెబ్, పఠాన్ పిరోజ్‌ఖాన్, గోవాడ వెంకటకృష్ణారావు, షేక్ సుల్తాన్, చిల్కా విజయ్ తదితరులున్నారు.

28MN 8 PG-GNT_28MN 8 PG-GNT.qxd 27-07-2026 PM 11:56 Page 1



## శాస్త్ర సాంకేతిక రంగంలో భారత ఖ్యాతిని చాటిన మహనీయులు కలాం..

ప్రత్తిపాడు (వట్టిచెరుకూరు), జూలై 27, ప్రభాతవార్త : శాస్త్ర సాంకేతిక రంగంలో భారత ఖ్యాతిని ప్రపంచానికి చాటిన మహనీయులు భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న, ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త, మిస్సైల్ మ్యాన్ డా.ఏపీజే అబ్దుల్ కలాం అని మలినేని విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ పెరుమాళ్ళు పేర్కొన్నారు. మండలంలోని పుల్లడిగుంట గ్రామం వద్దనున్న మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతి సభను కళాశాల యాజమాన్యం ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ తో పాటు సిబ్బంది అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కలాం వర్ధంతి సభలో కళాశాల ఛైర్మన్



పెరుమాళ్ళు మాట్లాడుతూ.. డా.అబ్దుల్ కలాం కేవలం శాస్త్రవేత్త మాత్రమే కాకుండా దేశ యువతకు మార్గదర్శి, స్ఫూర్తి ప్రదాతని కొనియాడారు. క్షిపణి సాంకేతిక రంగంలో భారతదేశాన్ని స్వావలంబన దిశగా నడిపించి, ప్రపంచ దేశాల ముందు భారత ప్రతిష్ఠను మరింత పెంచిన మహనీయులని, ఆయన సేవలను గుర్తుచేశారు. రాష్ట్రపతి పదవిలో ఉన్నప్పటికీ నిరాడంబర జీవనం, దేశభక్తి, నైతిక విలువలు, విద్య పట్ల అంకితభావంతో కోట్లాది భారతీయుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. యువత మంచి లక్ష్యాలు నిర్దేశించుకుని దేశాభివృద్ధికి తమవంతు పాత్ర పోషించాలని కలాం ఇచ్చిన సందేశం నేటికీ స్ఫూర్తిదాయక మన్నారు. విజ్ఞాన సమాజ నిర్మాణమే ఆయన కలని, ప్రతి ఒక్కరూ ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు గొప్ప కలలను కణాలని వాటిని కార్యరూపంలోకి తీసుకురావాలని ఆయన ఇచ్చిన సందేశాన్ని ప్రతి ఒక్కరు ఆచరణలో పెట్టాలని తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె. అప్పారావు, డైరెక్టర్ డా.కె. వెంకటేశ్వరరావు, ఇంజనీరింగ్ డీన్ డా.పి.రమేష్ బాబు, ప్లేస్మెంట్ అధికారి కె.శ్వేత, వివిధ శాఖల హెచ్వోడీలు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీలు పాల్గొన్నారు.

## విద్యార్థులు విద్యతో పాటు సామాజిక బాధ్యతలను అలవర్చుకోవాలి

ప్రత్తిపాడు (వట్టిచెరుకూరు), జూలై 27, ప్రభాతవార్త: విద్యార్థులు సాంకేతిక విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, వ్యక్తిత్వ వికాసం మరియు సామాజిక బాధ్యతను పెంపొందించుకోవాలని ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాల ఛైర్మన్, సెక్రటరీ చందు రామారావు, విజయలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని కుర్నూతుల ఐదవ మైలు వద్ద నున్న ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం డిప్లొమా ప్రథమ సంవత్సరం విద్యార్థుల ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. అనంతరం నూతనంగా చేరిన విద్యార్థులకు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికి, వారి విద్యా ప్రయాణం విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా



కళాశాల ఛైర్మన్, సెక్రటరీ చందు రామారావు, విజయలక్ష్మి మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతో పాటు ఉన్నతమైన క్రమ శిక్షణను అలవర్చుకుని, భవిష్యత్తు లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించే దిశగా కృషిచేయాలని పిలుపునిచ్చారు. ప్రియదర్శిని విద్యాసంస్థలు నాణ్యమైన విద్యను అందించడంలో ఎల్లప్పుడూ ముందుంటుందని, ఆధునిక ప్రయోగశాలలు, అనుభవజ్ఞులైన అధ్యాపకులు, పరిశ్రమలకు అనుగుణమైన శిక్షణ ద్వారా విద్యార్థులను ఉత్తమ సాంకేతిక నిపుణులుగా తీర్చిదిద్దడమే తమ కళాశాల లక్ష్యమని తెలిపారు. వైస్ ఛైర్మన్ చందు రోహిత్ మాట్లాడుతూ..ప్రస్తుత పోటీ ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానంతో పాటు కమ్యూనికేషన్ నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు, ఆవిష్కరణాత్మక ఆలోచనలు మరియు సమస్యల పరిష్కార సామర్థ్యాలను అభివృద్ధి చేసుకోవడం అత్యంత అవసరమన్నారు. కళాశాల అందిస్తున్న శిక్షణా కార్యక్రమాలు మరియు ప్లేస్మెంట్ అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఫార్మసీ ప్రిన్సిపాల్ చందు బాబూరావు మాట్లాడుతూ..విద్యార్థులు నిరంతరం కొత్త విషయాలను నేర్చుకుంటూ పరిశోధనా దృక్పథాన్ని అలవరచుకోవాలని, సమాజానికి ఉపయోగపడే సాంకేతిక నిపుణులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఎంబీఏ డైరెక్టర్ చందు రవికుమార్ మాట్లాడుతూ.. సాంకేతిక నైపుణ్యాలతో పాటు మేనేజ్మెంట్ స్కిల్స్, కమ్యూనికేషన్, టీమ్వర్క్ మరియు నాయకత్వ లక్షణాలు విద్యార్థుల భవిష్యత్తు విజయానికి కీలకమని వివరించారు. విద్యార్థులు కళాశాల నియమ నిబంధనలను పాటిస్తూ, తరగతులకు క్రమం తప్పకుండా హాజరవుతూ, అధ్యాపకుల మార్గదర్శకత్వంలో విద్యాభ్యాసాన్ని కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.డివివిఎస్.ఫణికుమార్, వైస్ ప్రిన్సిపల్ కె.కిరణ్ కుమార్, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## యువత అబ్దుల్ కలాం ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి.. ప్రత్తిపాడు వైసిపి ఇన్చార్జ్ బలసాని.

ప్రత్తిపాడు, జూలై 27, ప్రభాతవార్త : కష్టపడి పనిచేస్తే ఎంతటి ఉన్నత శిఖరాలనైనా చేరుకోవచ్చనడానికి మాజీ రాష్ట్రపతి, స్వర్గీయ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఒక గొప్ప ఉదాహరణని ప్రత్తిపాడు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్ అన్నారు. అబ్దుల్ కలాం వర్ధంతిని పురస్కరించుకుని గుంటూరు రూరల్ మండలం, ఏటుకూరు బైపాస్ వద్దనున్న నియోజకవర్గ వైసిపి క్యాంపు కార్యాలయంలో సోమవారం వైఎస్సార్సీపీ శ్రేణులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బలసానితో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా బలసాని మాట్లాడుతూ.. శాస్త్రవేత్తగా డీఆర్డీఎల్, ఇస్రో వంటి ప్రతిష్టాత్మక సంస్థలలో కలాం అందించిన సేవలు అపారమైనవని గుర్తుచేశారు. చారిత్రాత్మక పోఖ్రాన్ అణు పరీక్షలన విజయవంతం చేయడంలో ఆయన ప్రధాన పాత్ర పోషించారని గుర్తు చేశారు. దేశ రక్షణ, శాస్త్ర సాంకేతిక రంగాలలో ఆయన చేసిన సేవలకు గానూ పద్మవిభూషణ్, దేశ అత్యున్నత పురస్కారమైన భారతరత్న అవార్డులు వరించాయని తెలిపారు. పట్టుదల, కార్యదీక్షతో ముందడుగు వేయడానికి దేశం, రాష్ట్రంలోని యువత అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. సమాజానికి, దేశానికి స్ఫూర్తిగా నిలిచిన ఆ మహనీయుని బాటలోనే ప్రతి ఒక్కరూ పయనించాలని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున ఆ మహనీయునికి ఘన నివాళులు అర్పిస్తున్నట్లు చెప్పారు. తన జీవితాన్ని దేశానికి అంకితం చేసిన మహనీయులని, పేపర్ బాయ్ నుండి రాష్ట్రపతి వరకు కష్టపడి ఉన్నత స్థాయికి ఎదిగిన అబ్దుల్ కలాం



జీవితం అందరికీ ఆదర్శనీయం అన్నారు. మేధస్సుకు, ప్రతిభకు పేదరికం అడ్డుకాదని నిరూపించిన మహోన్నత వ్యక్తి, అవినీతి లేని విద్యా, సాంకేతికంగా బలమైన భారతదేశ నిర్మాణమే తన లక్ష్యమని అబ్దుల్ కలాంను నేటి యువత ఆదర్శంగా తీసుకొని భవిష్యత్తులో ఉన్నతస్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్ఆర్సీపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు,, తదితరులు పాల్గొన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్సీపి అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు డీఎస్సీ అవకతవకలపై సిబిఐ విచారణ జరిపించాలని, ఫీజు రియంబర్స్మెంట్, వసతి దీవెన బకాయిలు, నిరుద్యోగ భృతి చెల్లించాలని వైఎస్ఆర్సిపి విద్యార్థి, యువత ర్యాలీ పోస్టర్లను సోమవారం క్యాంపు కార్యాలయంలో పార్టీ శ్రేణులతో కలసి బలసాని ఆవిష్కరించారు. నేడు జిల్లా స్థాయిలో జరగనున్న ఈ నిరసన కార్యక్రమంలో నియోజకవర్గంలోని వైసీపీ పార్టీకి చెందిన విద్యార్థులు, యువత భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గస్థాయి వైసీపీ పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి జెండా రెపరెపలాడుతుంది.. ఎమ్మెల్యే రామాంజనేయులు.

ప్రత్తిపాడు, జూలై 27, ప్రభాతవార్త : త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలలో కూటమి ప్రభుత్వ జెండా రెపరెపలాడుతుందని ప్రత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ బూర్ల రామాంజనేయులు పేర్కొన్నారు. గుంటూరు అరండల్ పేటలోని జిల్లా టిడిపి కార్యాలయం నందు కూటమి ప్రభుత్వం సంక్షేమ విజయాలు గడప గడపకు కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడానికి పార్టీ నాయకులతో కార్యనిర్వాహక సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ.. స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళు లర్పించారు. కూటమి ప్రభుత్వంలో జరిగిన మంచి, చేసిన అభివృద్ధి, అందిస్తున్న సంక్షేమాన్ని ప్రజలకు వివరించేందుకు ముఖ్యమంత్రి మరియు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర విద్యా మంత్రి మరియు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ పిలుపు మేరకు తెలుగుదేశం పార్టీ



ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ప్రయోజనాలు ప్రతి ఇంటికి చేరేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరించడంతోపాటు లబ్ధిదారుల అభిప్రాయాలు, కార్యక్రమాలకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు, ప్రచార వివరాలను మా టిడిపి ఆక్ట్ క్రమబద్ధంగా నమోదు చేయాలని తెలిపారు. గడిచిన రెండు సంవత్సరాల కాలంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పెంపుదల, అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి రైతుకు సంవత్సరానికి రూ.20 వేలు, తల్లికి వందనం పథకం కింద చదువుకొనే ప్రతి పిల్లవానికి సంవత్సరానికి రూ.15 వేలు, ఫీజు రీయింబర్స్మెంట్, స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలందరికీ ఉచిత బస్ ప్రయాణ సౌకర్యం, దివ్యాంగులందరికీ ఉచిత బస్ సౌకర్యం, ఆటో డ్రైవర్ సేవలో పథకం కింద ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ.15 వేలు, దీపం 2.0 పథకం కింద అర్హులైన కుటుంబాలకు సంవత్సరానికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు రాష్ట్ర ప్రజలకు కూటమి ప్రభుత్వ అందిస్తుందన్నారు. నియోజకవర్గంలో గడిచిన రెండేళ్ల కాలంలో కోట్ల రూపాయల అభివృద్ధి పనులు, గుంటూరు ఫేజ్ 3 ఇన్నర్ రింగ్ రోడ్, గుంటూరు ఛానల్ పొడిగింపు మరియు ఆధునీకరణ పనులు, గుంటూరు లో రూ.577 కోట్లతో అమృత్ 2.0 పథకం ద్వారా త్రాగునీరు, మున్సిపల్ కార్పొరేషన్ కోట్ల నిధులతో డివిజన్లలో సీసీ రోడ్లు , డ్రైన్ల మరియు పార్కులు స్మశానవాటిక నిర్మాణాలు, నడింపాలెంలో ఎంఎస్ఎమ్ఈ పార్క్, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడం, నిరుద్యోగ యువతకు జాబ్ మేళాను నిర్వహించడం, వెంగలయపాలెంలో వాటర్ షెడ్ పథకం ద్వారా చెరువు పునరుద్ధరణ, నడింపాలెంలో డైట్ కాలేజీ నిర్మాణం, సర్వ శిక్ష అభియాన్ ద్వారా పాఠశాలల పునరుద్ధరణ, ప్రతి గ్రామంలో సిసి రోడ్లు మరియు డ్రైన్లు మౌలిక వసతుల కల్పన, నియోజకవర్గంలో 15 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి గ్రామంలో త్రాగునీటి సమస్యలు పరిష్కరించడం, లబ్ధిదారులకు టిడ్కో గృహ సముదాయంలో ఇండ్లు ఇవ్వడం వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు పరుగులు పెడుతున్నాయని వివరించారు. అలాగే రాష్ట్రంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామని, ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేస్తున్నామన్నారు. ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, దీపం పథకం, స్త్రీ శక్తి వంటి సంక్షేమ పథకాలన్నీ అమలు చేస్తున్నామని చెప్పారు, మరోవైపు రాష్ట్రానికి పెట్టుబడులు, పరిశ్రమలు తీసుకొచ్చి ఇంకొక వైపు ప్రభుత్వ ఉద్యోగాల భర్తీతో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు, రెండేళ్లలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలని తెలిపారు.

కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పిల్లి మాణిక్యారావు, జిల్లా బీజేపి పార్టీ అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు, ప్రత్తిపాడు నియోజకవర్గ పరిశీలకురాలు ఆచంట సునీత, తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ మరియు బిజెపి పార్టీ మండల పార్టీల అధ్యక్షులు, గ్రామ పార్టీల అధ్యక్షులు, క్లస్టర్, బూత్, యూనిట్ ఇన్చార్జీలు, సొసైటీల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, నీటి సంఘాల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, సొసైటీ చైర్మన్లు, డైరెక్టర్లు, రాష్ట్రస్థాయి డైరెక్టర్లు, డివిజన పార్టీల అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు మరియు అనుబంధ కమిటీల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, కూటమి ముఖ్య నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్కూల్ ప్రాంగణంలో మొక్కలు నాటిన బ్రాంచ్ మేనేజర్

పెదకూరపాడు, జూలై 27, ప్రభాతవార్త : లగడపాడు గ్రామంలోని ఎంపీపీ ప్రాథమిక పాఠశాల ఆవరణంలో ఆంధ్ర గ్రామీణ బ్యాంక్ మేనేజర్ గంగాధర్ మొక్కలను తెప్పించి పాఠశాల ప్రాంగణంలో విద్యార్థుల చేత నాటించారు. పచ్చదనం పరిశుభ్రత అనేది ప్రతి గ్రామంలో ఉండాలని ఆయన కోరారు. కాలుష్య నివారణకు చెట్లు పెంచాలని ప్రతి ఇంటికి ఒక చెట్టు పెంచడం ద్వారా ఆక్సిజన్ అంది ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని హెచ్ఎం నండూరు సురేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.



## శ్రీ అమరేశ్వర స్వామి దేవస్థానం ఆలయ ఈవోగా సైదమ్మ భాయ్

అమరావతి, జూలై 27, ప్రభాతవార్త : శ్రీ బాల చాముండికా సమేత శ్రీ అమరేశ్వర స్వామి ఆలయ ఈవోగా సైదమ్మ బాయ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. దేవస్థాన కమిషనర్ విజయవాడ వారి ఉత్తర్వులు మేరకు ఇన్చార్జి ఆలయ సహాయ కమిషనర్ గా వారు బాధ్యతలు స్వీకరించారు. కమిటీ సభ్యులు పలువురు పెద్దలు దుశలవాలతో ఘనంగా సన్మానించారు. స్వామివారి సేవలు ప్రతి ఒక్క భక్తుడికి అందే విధంగా కృషి చేస్తానని సైదమ్మ బాయ్ అన్నారు.



## సచివాలయ ఉద్యోగులకు సెలవులు మంజూరు చేసిన మున్సిపల్ కమిషనర్

తెనాలి జులై27(ప్రభాతవార్త): తెనాలి మున్సిపాలిటీ పరిధిలో విధులు నిర్వహిస్తున్న స్వర్ణ వార్డు సచివాలయ ఉద్యోగుల సెలవుల మంజూరు, ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన సమస్యలపై మున్సిపల్ కమిషనర్ జె రామ అప్పలనాయుడు సానుకూలంగా స్పందించినట్లు ఎపి ఎన్జిఓ సంఘం తెనాలి యూనిట్ నాయకులు తెలిపారు. ఈమేరకు సోమవారం జెఎసి ఛైర్మన్, ఎపి ఎన్జిఓ తెనాలి యూనిట్ అధ్యక్షులు వి. బిక్షాలు, కోశాధికారి దాసరి అనిల్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు కె.వి. కిషోర్, డిఈసి సభ్యులు షేక్ ఆదిల్ కలిసి ఉద్యోగుల సమస్యలపై కమిషనర్ కు వినతిపత్రం సమర్పించారు. సెలవుల మంజూరు, పనిగంటల అనంతరం అత్యవసర సమావేశాల నిర్వహణ, ఉద్యోగులపై పడుతున్న ఒత్తిళ్లు, ఉద్యోగపరమైన ప్రయోజనాల మంజూరు వంటి అంశాలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. వినతిని స్వీకరించిన కమిషనర్, ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తామని, నిబంధనల ప్రకారం సెలవుల మంజూరులో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సంఘ నాయకులు వెల్లడించారు. అలాగే ఉద్యోగులపై అనవసర ఒత్తిడి లేకుండా కార్యాలయ నిర్వహణలో సమన్వయం పాటించాలని సంబంధిత అధికారులకు సూచించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ, ఉద్యోగుల సమస్యలపై కమిషనర్ సానుకూల స్పందన వ్యక్తం చేయడం హర్షణీయమని పేర్కొన్నారు. ఉద్యోగులు ప్రశాంత వాతావరణంలో విధులు నిర్వహించేలా పరిపాలన సాగితే ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించగలమని అభిప్రాయపడ్డారు. అందరి సమన్వయంతో తెనాలి అభివృద్ధి సాధ్యపడుతుందని పేర్కొన్నారు. అనంతరం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఎవో శ్రీనివాసరావు కి వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐటిఐ కళాశాల, పంచాయతీ రాజ్, మెడికల్, ఇరిగేషన్ శాఖల ఉద్యోగులు పాల్గున్నారు.



## కూటమి పాలన స్వర్ణ యుగం: ఎంఎల్సి ఆలపాటి

తెనాలి జులై27(ప్రభాతవార్త): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలన స్వర్ణయుగంలా ఉందని మాజీ మంత్రి, తెనాలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి, శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి రెండేళ్లు అవుతున్న సందర్భంగా ప్రభుత్వ ఆదేశానుసారం రెండేళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమం పేరిట జరుగుతున్న ఇంటింటికి ప్రచార కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు సచివాలయ సిబ్బందితో కలిసి, రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలన పురోగతిపై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా పట్టణంలోని మూడు నాలుగు ఐదు వార్డుల్లో ఇంటింటి ప్రచారంలో భాగంగా ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ రెండేళ్ల ప్రభుత్వ పాలన గురించి కరపత్రాలు పంపిణీ చేశారు ప్రతి ఒక్కరిని పేరుపేరునా పలకరిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఎండీ.ఖుద్దూస్, పద్మశాలి వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ జొన్నాదుల మహేష్, పట్టణ పార్టీ కార్యదర్శి వసంతం అశోక్, పార్టీ సీనియర్ నాయకులు రావి కృష్ణమోహన్ (చిన్ని), తెనాలి నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు కోగంటి రోహిత్, తెనాలి పట్టణ తెలుగు యువత అధ్యక్షులు కొల్లూరు శ్రీధర్, పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ వేమూరి శేషగిరిరావు, మాజీ కౌన్సిలర్ అడుసుమల్లి వెంకటేశ్వరరావు, డాక్టర్ ఆవుల చక్రవర్తి, వట్టికూటి సుబ్బారావు, గుమ్మడి ప్రసాద్, మహిళా నాయకురాలు దీవి అనిత, గుమ్మడి భావన, కొండా రమాదేవి, నాయకులు, పాల్గొన్నారు.



## సూపరింటెండెంట్ హనుమంతరావుకు ఘన సత్కారం

మంగళగిరి, జూలై 27, ప్రభాతవార్త : మంగళగిరి ఎడ్మినిస్ట్రేటివ్ కోర్టు సూపరింటెండెంట్‌గా సేవలు అందిస్తూ, మచిలీపట్నం ఎ.ఓ గా పదోన్నతి పొందిన పిడుగురాళ్ల హనుమంతరావు కు మంగళగిరి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం బార్ అసోసియేషన్ హాలులో ఘనంగా సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు జొన్నాదుల లెనిన్ బాబు, జనరల్ సెక్రటరీ బేతపూడి నాయడమ్మ మాట్లాడుతూ హనుమంతరావు తమ విధుల పట్ల చూపిన నిబద్ధత, అంకితభావం ఎంతో ఆదర్శనీయమని కొనియాడారు. కోర్టు పనుల నిమిత్తం వచ్చే న్యాయవాదులకు, సేవార్థులకు ఆయన ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ఎంతో సహకారాన్ని అందించారని తెలిపారు. మచిలీపట్నం ఎ.ఓ.గా ఆయన మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఆయనను మంగళగిరి బార్ అసోసియేషన్ ప్రతినిధులు దుస్తులు, జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ జొన్నదుల లెనిన్ బాబు, జనరల్ సెక్రటరీ బేతపూడి నాయుడమ్మ, జాయింట్ సెక్రటరీ సురబోయిన మురళి కృష్ణ లేడీ సెక్రటరీ ముక్కు పద్మ కల్యాణి, స్పోర్ట్స్, కల్చరల్ సెక్రటరీ షేక్ సమీర్, దొడ్డక బ్రహ్మానంద రావు, దొడ్డకు శ్రీనివాసరావు, కూరపాటి అంబేద్కర్, కట్టేపోగు కోటేశ్వర రావు, తలసీల మధుసూదన రావు, గుర్రం రామారావు, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రెంటపల్లి రాజేష్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ పొట్లూరి శరత్ చంద్ర ప్రసాద్ పాల్గొన్నారు



## పెంపుడు కుక్క పండుకు ఘన నివాళి

### .. 200 మందికి అన్నదానం

మంగళగిరి, జూలై 27, ప్రభాతవార్త: పాత మంగళగిరి బోసు బొమ్మ సెంటర్లో పెంపుడు జంతువులపై ఉన్న అపారమైన ప్రేమను చాటే ఒక అరుదైన సంఘటన చోటు చేసుకుంది. పాత మంగళగిరి కి చెందిన సాంబయ్య అనే స్థానికుడు ఎంతో ఇష్టంగా, కుటుంబ సభ్యునిలా పెంచుకుంటున్న ఓ హచ్ కుక్కపిల్ల (పండు) ఇటీవల వీధి కుక్కల దాడిలో ప్రాణాలు కోల్పోయింది. ఈ మూగజీవి మరణాన్ని జీర్ణించుకోలేని సాంబయ్య కుటుంబం.. దానికి మనుషుల మాదిరిగానే సాంప్రదాయబద్ధంగా సోమవారం 13వ రోజు పెద్దకర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. కేవలం పూలమాల వేసి ఊరుకోకుండా, పండు జ్ఞాపకార్థం ఏకంగా 200 మందికి పైగా ఘనంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాధారణంగా ఈ రోజుల్లో మనుషుల కార్యాలకే జనాలు రావడం గగనమైపోతుంటే, సాంబయ్య మూగ జీవి పండుపై ఉన్న ప్రేమతో 200 మందికి విందు భోజనం పెట్టించడం పట్ల మూగ జీవి పై ఆ కుటుంబం పెంచుకున్న ప్రేమకు స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. పండు బతికున్నప్పుడు ఎంతో రాయల్ సెలబ్రిటీ లైఫ్ గడిపిందో, మృతిచెందిన కూడా అంతే ఘనమైన వీడ్కోలు అందుకుంది. సాంబయ్య లాంటి వ్యక్తిత్వం ఉన్న వారి ఇంట్లో కుక్కగా పుట్టాలన్నా కూడా కనీసం ఏడు జన్మల పుణ్యం చేసుండాలని స్థానికులు ముచ్చటించుకుంటున్నారు. పెంపుడు జంతువుపై సాంబయ్య చాటుకున్న ఈ అసాధారణ ప్రేమ ఇప్పుడు మంగళగిరి పట్టణంలో హాట్ టాపిక్ గా నిలిచింది. మూగజీవం పై ఇంతగా ప్రేమ చూపిన సాంబయ్య సభ్యులకు పలువురు అభినందనలు తెలిపారు.



## యువతకు ఏపీజే అబ్దుల్ కలాం ఆశయాలు, సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయి

మంగళగిరి, జూలై 27, ప్రభాతవార్త : భారతరత్న, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా మంగళగిరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయం డాక్టర్ ఎంఎస్ఎస్ భవన్‌లో సోమవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షులు, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎండీ ఇబ్రహీం మాట్లాడుతూ దేశానికి అపారమైన సేవలు అందించిన మహనీయుడు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం అని కొనియాడారు. శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా ఆయన దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాంను భారత రాష్ట్రపతిగా చేయడంలో తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. జాతీయ రాజకీయాల్లో చంద్రబాబు నాయుడు చూపిన దూరదృష్టి, సమన్వయంతోనే కలాం వంటి మహోన్నత వ్యక్తి దేశ అత్యున్నత పదవిని అలంకరించే అవకాశం లభించిందని తెలిపారు. యువత పెద్ద కలలు కనాలని, వాటిని సాధించేందుకు నిరంతరం శ్రమించాలని కలాం ఇచ్చిన సందేశం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని ఎండీ ఇబ్రహీం అన్నారు. కలాం ఆశయాలను ఆచరిస్తూ దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు గుత్తికొండ ధనుంజయరావు, గుంటూరు పార్లమెంట్ టిడిపి ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షులు పల్లబోతుల శ్రీనివాసరావు, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి అబ్దుల్ మజీద్, గోవాడ దుర్గారావు, రుద్రు శ్రీను తదితరులు పాల్గొన్నారు



## పెదకాకాని శివాలయములో శ్రీ మల్లేశ్వరస్వామి వారికి సహస్ర ఘటాభిషేకం

గుంటూరు, జులై 27, ప్రభాతవార్త :పెదకాకాని శివాలయములో త్రయాహ్నిక దీక్షతో ప్రారంభమైన సహస్ర ఘట్టాభిషేకము విశేష పూజలో భాగముగా చివరి రోజు సోమవారము ఉదయం 7.00 గంటల నుండి ఆలయ అర్చకులు, వేదపండితులచే విశేష పూజలు అనంతరము ప్రత్యేకముగా ఏర్పాటు చేసిన మట్టి కుండలతో శ్రీ మల్లేశ్వరస్వామి వారికి మహన్యాసపూర్వకముగా సహస్ర ఘట్టాభిషేకము అత్యంత భక్తి శద్ధలతో నిర్వహించినారు. అనంతరము యాగశాల నందు పూర్ణాహుతి కార్యక్రమము ముగిసిన తదుపరి నీరాజన, మంత్రపుష్పములతో సహస్ర ఘట్టాభిషేకం క్రతువు సంపూర్ణము అయినట్లు ఆలయ ఉపకమీషనరు గోగినేని లీలాకుమార్, పాలకమండలి ఛైర్మన్ కోసూరి పూర్ణచంద్రరావు తెలిపారు. పూజ కార్యక్రమములో పాలకమండలి ఛైర్మన్ కోసూరి పూర్ణచంద్రరావు దంపతులు, సభ్యులు బండారు మల్లేశ్వరి దంపతులు, భైరపనేని ధనలక్ష్మీ దంపతులు, ఉల్లం రాజేశ్వరి దంపతులు, ధూపాటి శివశంకరరావు, కొమ్మూరి మల్లిఖార్జునరావు భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## లింగ వివక్షకు చెక్... సమానత్వమే సమాజ ప్రగతికి బాట...

తాడేపల్లి, జులై 27, ప్రభాతవార్త. లింగ వివక్షకు తావులేకుండా మహిళలు, పురుషులు సమాన హక్కులు, సమాన అవకాశాలతో ముందుకు సాగినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎపి పోలీసు విభాగంలోని సురక్షా కమిటీ సభ్యురాలు, కౌన్సిలర్ ఎన్.మాలతీ పేర్కొన్నారు. యువతలో సమానత్వ భావనను పెంపొందించేందుకు, మహిళల పట్ల గౌరవభావాన్ని పెంపొందించే లక్ష్యంతో కెఎల్ యూనివర్శిటీలో సోమవారం నాడు లింగ వివక్ష – సమానత్వం వైపు సమాజం అనే అంశంపై అవగాహన సదస్సును కెఎల్ ఉమెన్ డెవలెప్ మెంట్ సెల్ అధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, న్యాయ నిపుణులు, మహిళా సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్బంగా ఎన్.మాలతీ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సమానత్వ భావనతో ముందుకు సాగాలని సూచించారు. లింగ వివక్ష అనేది కేవలం మహిళలను మాత్రమే ప్రభావితం చేసే సమస్య కాదని, అది సమాజం మొత్తం అభివృద్ధిని అడ్డుకునే సామాజిక దురాచారమని వివరించారు. కుటుంబం నుంచి ఉద్యోగ రంగం వరకు ప్రతి చోట మహిళలకు సమాన అవకాశాలు, గౌరవం కల్పించినప్పుడే దేశం అన్ని రంగాల్లో పురోగమిస్తుందని అన్నారు. రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులను కల్పించినప్పటికీ వాటిని ఆచరణలోకి తీసుకురావడం ప్రతి ఒక్కరి బాధ్యత అని చెప్పారు. ఈ కార్యక్రమంలో వర్శిటీ వైస్ చాన్సులర్ డాక్టర్ జి.పార్థసారదివర్మ, ప్రో వైస్ చాన్సులర్లు డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, డాక్టర్ కె.రాజశేఖర రావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.ఐ.పవన్ కుమార్, విద్యార్థి సంక్షేమ విభాగం ఇంచార్జి డీన్ డాక్టర్ కెఆర్.ఎస్.ప్రసాద్, సలహాదారు డాక్టర్ హబీబుల్లా ఖాన్, కెఎల్ ఉమెన్ డెవలెప్ మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ కె.రూత్ రమ్య, కో కన్వీనర్ డాక్టర్ ఎన్. శ్రీలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



## కెఎల్ యూనివర్సిటీలో ఘనంగా కార్గిల్ విజయ్ దివస్

తాడేపల్లి, జులై 27, ప్రభాతవార్త.కెఎల్ యూనివర్సిటీలోని ఎన్ సిసి 10 ఆంధ్రా, 22 ఆధ్రా బెటాలియన్ ల అద్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. 1999 కార్గిల్ యుద్ధంలో దేశ రక్షణ కోసం ప్రాణాలను అర్పించిన అమర వీర జవాన్లకు ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, ఎన్ సిసి క్యాడెట్లు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులు గా హాజరైన విశ్వవిద్యాలయ అధికారులు కార్గిల్ యుద్ధంలో భారత సైనికులు ప్రదర్శించిన అసమాన ధైర్యసాహసాలను స్మరించుకున్నారు. దేశ సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు మన సైనికులు చేసిన త్యాగాలు ప్రతి భారతీయుడికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.



దేశభక్తి, క్రమశిక్షణ, సేవా భావం వంటి విలువలను యువత అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎన్ సిసి క్యాడెట్లు దేశభక్తిని ప్రతిబింబించే ప్రసంగాలు, గేయాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి అమరవీరులకు తమ గౌరవాన్ని చాటుకున్నారు. అనంతరం అమర జవాన్ల చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి రెండు నిమిషాల మౌనం పాటించారు. భారత సైన్యం దేశ భద్రత కోసం నిరంతరం చేస్తున్న సేవలను కొనియాడుతూ విద్యార్థులు చేసిన జైహింద్ నినాదాలతో ప్రాంగణం మారుమోగింది. కార్గిల్ విజయ్ దివస్ నిర్వహణ ద్వారా యువతలో దేశభక్తి భావనను మరింత పెంపొందించడమే లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. విద్యార్థులు దేశ సమగ్రత, ఐక్యతను కాపాడే బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని గుర్తుంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వర్శిటీ వైస్ చాన్సులర్ డాక్టర్ జి.పార్థసారదివర్మ, ప్రో వైస్ చాన్సులర్లు డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, డాక్టర్ కె.రాజశేఖర రావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.ఐ.పవన్ కుమార్, విద్యార్థి సంక్షేమ విభాగం ఇంచార్జి డీన్ డాక్టర్ కెఆర్.ఎస్.ప్రసాద్, సలహాదారు డాక్టర్ హబీబుల్లా ఖాన్, ఎన్ సిసి ఆఫీసర్ లు లెఫ్టినెంట్ డాక్టర్ వి. మోనిక, డాక్టర్ దారా విక్రమ్, 10(ఎ) సిటి ఆఫీసర్ డాక్టర్ శశికళ, డాక్టర్ సుభాకర్ రాజు,

అధ్యాపకులు, ఎన్‌సీసీ క్యాడెట్లు, వివిధ విభాగాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమర జవాన్లకు ఘనంగా నివాళులర్పించారు.

28-7Pg5_28-7Pg5.qxd 27/Jul/26 10:51 PM Page 1



# మీ గుండె 'లయ' తప్పుతోందా?



దేశంలో 80 లక్షల మందికి ఇదే సమస్య

ఛాతీలో దడ, ఆయాసాన్ని తేలిగ్గా తీసుకోకండి..

వృద్ధాప్యంలో అధికరక్తపోటు ఉంటే ప్రమాదమే

**న్యూఢిల్లీ,జులై 27:** గుండె వేగంగా కొట్టుకోవడం, ఛాతీలో దడ, లేదా కారణం లేకుండా ఆయాసం రావడం వంటి లక్షణాలను చాలామంది తేలిగ్గా తీసుకుంటారు. కానీ, ఇవి ఏట్రియల్ ఫిబ్రిలేషన్ అనే ఏఎఫ్ అని పిలిచే తీవ్రమైన గుండె జబ్బుకు సంకేతాలు కావచ్చు. ప్రపంచవ్యాప్తంగా అత్యంత సాధారణమైన ఈ గుండె లయ రుగ్మత, నివారించగలిగే పక్షవాతానికి ఒక ప్రధాన కారణంగా మారుతోంది. గ్లోబల్ బర్డెన్ ఆఫ్ డిసీజ్ అధ్యయనం ప్రకారం, భారతదేశంలో సుమారు 80 లక్షల మంది ఏట్రియల్ ఫిబ్రిలేషన్‌తో జీవిస్తున్నారు. వృద్ధాప్యం, ఊబకాయం, మధుమేహం, అధిక రక్తపోటు వంటి సమస్యలు పెరగడంతో ఈ పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. డ్యూక్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసిన్‌కు చెందిన ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ క్రిస్టోఫర్ గ్రాంగెర్ ప్రకారం, గుండె పై గదుల్లో అసాధారణమైన ఎలక్ట్రికల్ సంకేతాలు ఏర్పడినప్పుడు ఏట్రియల్ ఫిబ్రిలేషన్ సంభవిస్తుంది. దీనివల్ల గుండె పై గదులు ఒక క్రమపద్ధతిలో కాకుండా అస్తవ్యస్తంగా, వేగంగా కొట్టుకుంటాయిఅని ఆయన వివరించారు. కొంతమందిలో గుండె దడ, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, త్వరగా అలసిపోవడం వంటి లక్షణాలు స్పష్టంగా కనిపిస్తాయి. అయితే చాలా మందిలో ఇది సైలెంట్ ఏఎఫ్‌గా ఉంటుంది. అంటే, ఎలాంటి లక్షణాలు బయటకు కనిపించవు. తీవ్రమైన సమస్యలు ఎదురయ్యే వరకు ఈ వ్యాధి ఉన్నట్టు కూడా తెలియదు. అసాధారణ గుండె లయను గుర్తించే స్మార్ట్‌వాచ్‌ల ద్వారా కూడా ఈ పరిస్థితిని ముందుగా పసిగట్టే అవకాశం ఉందని డాక్టర్ గ్రాంగెర్ తెలిపారు. ఏట్రియల్ ఫిబ్రిలేషన్ వల్ల ఎదురయ్యే అతిపెద్ద ప్రమాదం పక్షవాతం. గుండె గదులు సరిగా సంకోచించనప్పుడు, రక్తం అక్కడే నిలిచిపోయి గడ్డకట్టే అవకాశం ఉంది. ఈ రక్తం గడ్డకట్టిన ముక్క మెదడుకు ప్రయాణించి రక్తనాళాలను అడ్డుకుంటే, ఇస్కీమిక్ స్ట్రోక్ (పక్షవాతం) వస్తుంది. ఏట్రియల్ ఫిబ్రిలేషన్ వల్ల పక్షవాతం వచ్చే ప్రమాదం ఐదు రెట్లు పెరుగుతుందని, ప్రతి ఐదు పక్షవాత కేసులలో ఒకటి దీనితో సంబంధం కలిగి ఉంటుందని డాక్టర్ గ్రాంగెర్ తెలిపారు. ఈ రకమైన స్ట్రోక్స్ చాలా తీవ్రంగా ఉండి, శాశ్వత అంగవైకల్యానికి దారితీస్తాయి. ఏఎఫ్ సంబంధిత పక్షవాతాన్ని నివారించడానికి యాంటీకాగ్యులెంట్లు అంటే రక్తాన్ని పలుచనచేసే మందులు అత్యంత ప్రభావవంతమైన మార్గం. ఈ మందులు వాడటం ద్వారా ఏఎఫ్ వల్ల వచ్చే పక్షవాతాలలో 70 శాతం వరకు నివారించవచ్చని డాక్టర్ గ్రాంగెర్ పేర్కొన్నారు. కొన్ని సందర్భాల్లో గుండె లయను నియంత్రించే మందులు లేదా కాథెటర్ అబ్లేషన్ అనే ప్రక్రియ ద్వారా కూడా చికిత్స అందిస్తారు. వయసు, జన్యుపరమైన కారణాలు ప్రమాదాన్ని పెంచినప్పటికీ, జీవనశైలి మార్పుల ద్వారా దీనిని నివారించవచ్చు లేదా ఆలస్యం చేయవచ్చు. రక్తపోటు, మధుమేహం, కొలెస్ట్రాల్‌ను అదుపులో ఉంచుకోవడం, ఆరోగ్యకరమైన బరువును పాటించడం, క్రమం తప్పని వ్యాయామం, ధూమపానానికి దూరంగా ఉండటం, ఆల్కహాల్ పరిమితం చేయడం వంటివి చాలా ముఖ్యం. పక్షవాతం వచ్చిన తర్వాత చికిత్సకు అయ్యే భారీ ఖర్చుతో పోలిస్తే, ఏట్రియల్ ఫిబ్రిలేషన్‌ను ముందుగా గుర్తించి చికిత్స తీసుకోవడం ఎంతో మేలని నిపుణులు సూచిస్తున్నారు.



# మత మార్పిడితో ఎస్సీ హోదా రద్దు

## మరోమారు సుప్రీంకోర్టు స్పష్టీకరణ

## రివ్యూ పిటిషన్ కొట్టేసిన ధర్మాసనం

**న్యూఢిల్లీ, జులై 27:** షెడ్యూల్డ్ కుల వర్గానికి చెందిన వ్యక్తి హిందూ, సిక్కు లేదా బౌద్ధ మతం కాకుండా వేరే మతంలోకి మారినప్పుడు, మత మార్పిడి జరిగిన క్షణం నుంచే షెడ్యూల్డ్ కుల హోదాను కోల్పోతారని పేర్కొన్న సుప్రీంకోర్టు తీర్పును సమీక్షించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. రికార్డుల్లో ఎటువంటి లోపం కనిపించడం లేదని పేర్కొంటూ, జస్టిస్‌లు ప్రశాంత్ కుమార్ మిశ్రా, మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం మార్చి 24 నాటి తీర్పుకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను కొట్టివేసింది. "సమీక్షా పిటిషన్‌ను మౌఖిక విచారణ కోసం జాబితా చేయాలనే దరఖాస్తును తిరస్కరించడమైనది. తాము సమీక్షా పిటిషన్‌ను పరిశీలించాం. సమీక్షించాలని కోరిన మార్చి 24, 2026 నాటి తీర్పును కూడా పరిశీలించాం. రికార్డులో ఎటువంటి లోపం స్పష్టంగా కనిపించడం లేదు. అందువల్ల, సమీక్షా పిటిషన్‌ను కొట్టివేస్తున్నాం" అని సమీక్షా పిటిషన్‌పై జులై 15న జారీ చేసిన తన ఉత్తర్వులో సుప్రీంకోర్టు పేర్కొంది. మార్చి 24న, ఒక కీలకమైన తీర్పులో, షెడ్యూల్డ్ కుల వర్గానికి చెందిన వ్యక్తి హిందూ, సిక్కు లేదా బౌద్ధమతం కాకుండా వేరే మతంలోకి మారినప్పుడు, పుట్టుకతో సంబంధం లేకుండా మతం మారిన క్షణం నుంచే షెడ్యూల్డ్ కుల హోదాను కోల్పోతారని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. షెడ్యూల్డ్ కుల వర్గానికి చెందిన వ్యక్తి క్రైస్తవ మతంలోకి మారిన వెంటనే తన షెడ్యూల్డ్ కుల హోదాను "తక్షణమే మరియు పూర్తిగా" కోల్పోతారని పేర్కొన్న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఉత్తర్వును ఇది సమర్థించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 342లోని క్లాజ్ (1) ప్రకారం, భారత రాష్ట్రపతి వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల (యూటీలు) కోసం "షెడ్యూల్డ్ తెగలు"గా గుర్తించబడిన తెగలు, గిరిజన వర్గాలను గుర్తిస్తూ 1950 నాటి రాజ్యాంగ (షెడ్యూల్డ్ తెగలు) ఉత్తర్వును జారీ చేశారని సుప్రీంకోర్టు పేర్కొంది.

# ఇక 'జీహాద్' ఒక్కటే మార్గం

## ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ సంచలన ప్రకటన



**టెహ్రాన్, జులై 27:** ఇజ్రాయెల్‌పై పోరాటం సాగిస్తున్న లెబనాన్‌లో హెజ్బొల్లా సాయుధ గ్రూప్‌నకు తమ పూర్తి మద్దతు ఉంటుందని ఇరాన్ సుప్రీంలీడర్ మొజ్తబా ఖమేనీ పునరుద్ఘాటించారు. లెబనాన్‌లో ఇజ్రాయెల్ సైనిక దాడులు, కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోతేనే అమెరికాతో ఇరాన్ ఘర్షణ ముగుస్తుందని ఆయన స్పష్టం చేశారు. అమెరికా, ఇజ్రాయెల్‌పై ఇప్పుడు జీహాద్, ప్రతిఘటన తప్ప మరో మార్గం లేదని మొజ్తబా తేల్చిచెప్పారు. హెజ్బొల్లా సెక్రటరీ జనరల్ షేక్ నయీమ్ ఖాసీమ్, గ్రూప్ యోధులను ఉద్దేశించి ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఆయన పోస్టు పెట్టారు. హెజ్బొల్లా దృఢవైఖరిని ప్రశంసిస్తూ వారిని రక్షించుకోవడం ఇరాన్‌కు ఒక వ్యూహాత్మక బాధ్యత అని ఆయన నొక్కి చెప్పారు. అమెరికాతో ఇరాన్ యుద్ధం ముగియడానికి ఒప్పందం కుదరాలంటే, లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరుపుతున్న దాడులను ఎటువంటి షరతులు లేకుండా వెంటనే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇరాన్‌కు తమ విధేయతను ప్రకటిస్తూ హెజ్బొల్లా రాసిన లేఖకు సమాధానంగా ఇరాన్ సుప్రీం లీడర్ నుంచి ఈ స్పందన వచ్చింది. అమెరికా, ఇజ్రాయెల్‌లకు వ్యతిరేకంగా పోరాటానికి 'జీహాద్, ప్రతిఘటన తప్ప వేరే మార్గం లేదు' అని ఆయన పేర్కొన్నారు. తాత్కాలిక శాంతి ఒప్పందాన్ని అమెరికా, ఇరాన్‌లు ఉల్లంఘించడంతో మరోసారి పశ్చిమాసియాలో పరిస్థితులు ఉద్రిక్తంగామారాయి. 'ప్రజల ప్రాణాలను తీస్తూ, భవిష్యత్తు తరాలను నాశనం చేస్తున్న అమెరికా ప్రభుత్వం, జియొనిస్టులు(ఇజ్రాయెల్) అణచివేత, నిరంకుశత్వం, దుర్మార్గాలతో ప్రపంచ దేశాలు విసిగిపోయాయి. ఈ పరిస్థితుల్లో 'జీహాద్', ప్రతిఘటన తప్ప మనకు వేరే మార్గం లేదు' అని మొజ్తబా ఖమేనీ ప్రకటించారు. ఇజ్రాయెల్ దురాక్రమణకు వ్యతిరేకంగా పోరాడే గ్రూపులకు హెజ్బొల్లా ఒక కొండలా ముందుండి నడిపిస్తుందని, ఈ తిరుగులేని పోరాటం ప్రపంచంలోనే స్వేచ్ఛను కోరుకునే దేశాలకు స్ఫూర్తిదాయక సందేశంగా మారిందని ఆయన ప్రశంసించారు.

# ఆ 'సిట్'లో ఫోరెన్సిక్ ఆడిటర్‌ను చేర్చండి

## యుపి సర్కార్‌కు సుప్రీంకోర్టు ఆదేశాలు

## రెండు వారాల్లో స్టేటస్ రిపోర్ట్ ఇవ్వాలని ఆదేశం

**న్యూఢిల్లీ, జులై 27:** అయోధ్య రామమందిర విరాళాల చోరీ ఆరోపణల సంబంధిత కేసులో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీచేసింది. కేసు దర్యాప్తు పారదర్శకంగా, సమగ్రంగా చేపట్టేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)లో ఫోరెన్సిక్ ఆడిటర్‌ను తప్పనిసరిగా చేర్చాలని ఉత్తర్వులిచ్చింది. అలాగే దర్యాప్తు పురోగతిపై కూడా రెండు వారాల్లోగా స్టేటస్ రిపోర్ట్ సమర్పించాలని సిట్‌ను ఆదేశిస్తూ డెడ్‌లైన్ విధించింది న్యాయస్థానం. ఈ కేసు విచారణ కోసం ఐజీ కిరణ్ నేతృత్వంలో సిట్‌ను ఏర్పాటుచేసినట్లు ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. కేసు విచారణ వేగంగా, నిష్పాక్షి కంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకోవాలని ధర్మాసనం స్పష్టం చేసింది. విచారణ సందర్భంగా పిటిషనర్ తరఫు న్యాయవాది ఆలయానికి వచ్చిన విరాళాల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉండేలా అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచాలని కోరారు. అయితే.. ప్రస్తుతం తా ము దర్యాప్తును పూర్తి చేయడంపైనే ప్రధానంగా దృష్టి సారిస్తున్నా మని న్యాయస్థానం పేర్కొంది. ఈ నేపథ్యంలో సదరు వివరాలను వెలువరించడంపై ఎలాంటి ఆదేశాలూ ఇవ్వలేదు. సిట్ సమర్పించే నివేదికను పరిశీలించాకే తదుపరిచర్యలపై నిర్ణయం తీసుకుం టామని స్పష్టం చేసింది.

# సిజెపి నేతలకు సొమ్ములెక్కడినుంచి వచ్చాయి?

## సుప్రీం న్యాయవాది మహేష్ జెత్మలానీ

**న్యూఢిల్లీ,జులై 27:** నిరవధిక ఆందోళన నిర్వహించిన సిజెపి నేతలకు సొమ్ములు ఎక్కడినుంచవ ఇచ్చాయో ఆరద్యప్తు చేయించాలని సీనియర్ న్యాయవాది స్పందించారు. సిజెపి నేతల సంబరాలపార్టీలపై సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది మహేశ్ జెత్మలానీ స్పందించారు. సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా పోస్టు పెట్టి పలు విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా సౌరవ్ దాస్, అశుతోశ్ రాంకా వేడుకల తీరును న్యాయవాది మహేశ్ జెత్మలానీ విమర్శించారు. హోటల్‌లో పార్టీ చేసుకోవడానికి నిధులు ఎక్కడి నుంచి వచ్చాయని ఆయన ప్రశ్నించారు. నిజంగానా సీజేపీ నాయకత్వం హోటల్‌లో విజయోత్సవం జరుపుకుంటోందా, ఢిల్లీలో రోజుల తరబడి హింసాకాండ జరిగిన తర్వాత ఈ యువ కార్యకర్తలమని చెప్పుకునే వారు డ్యాన్సులు చేస్తున్నారు అని ఆయన మండిపడ్డారు. అలాగే ఢిల్లీలో సీజేపీ చేపట్టిన ఆందోళనల వెనుక ఉన్న ఆర్థిక వనరులపైనా జెత్మలానీ ప్రశ్నలు లేవనెత్తారు. ఢిల్లీ ఆందోళనల సమయంలో సీజేపీ నేతలు, కార్యకర్తల ప్రయాణం, ఆహారం, వసతి, లాజిస్టిక్స్ వంటి వాటికి నిధులు ఎక్కడ నుంచి వచ్చాయని ఆయన ప్రశ్నించారు. ఢిల్లీని అట్టుడికించిన వారికి ఆర్థిక సహాయం ఎవరు చేశా రంటూ ప్రశ్నలు సంధించారు. నీట్ పేపర్ లీక్ ఘటనకు బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసిన కొద్దిసేపటికే ఈ పార్టీ జరిగినట్లు తెలుస్తోంది.

# నిరసనకారులపై ఎఫ్ఐఆర్‌లను ఇప్పటికీ ఎత్తివేయలేదు

## సిజెపి ప్రతినిధి సౌరవ్‌దాస్ నిరసన

**న్యూఢిల్లీ,జులై 27:** నీట్ పేపర్ లీకేజీ, పరీక్షల అక్రమాలపై తాము చేపట్టిన ఆందోళన విరమణ సందర్భంగా ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) సోమవారం ఆరోపించింది. ఢిల్లీ వెలుపల నిరసనకారులపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లను తక్షణమే ఉపసంహరించుకోవాలని, వివిధ రాష్ట్రాల్లో అదుపులోకి తీసుకున్న వారిని విడుదల చేయాలని డిమాండ్ చేసింది. సీజేపీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ మాట్లాడుతూ, అసోం, పశ్చిమ బెంగాల్, బీహార్ వంటి రాష్ట్రాల్లో విద్యార్థులు, నిరసనకారులను లక్ష్యంగా చేసుకుని అరెస్టులు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. బీజేపీ లేదా ఎన్డీయే పాలిత రాష్ట్రాల్లో నిరసనకారులపై ఎలాంటి శిక్షార్హమైన చర్యలు తీసుకోబోమని కేంద్రం హామీ ఇచ్చిన నేపథ్యంలోనే మేము మా దేశవ్యాప్త ఆందోళనను విరమించుకున్నాం. ప్రస్తుతం వస్తున్న నివేదికలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ తక్షణమే జోక్యం చేసుకుని, అదుపులోకి తీసుకున్న వారిని విడుదల చేసేలాచూడాలని కోరారు. మంగళవారం లోగా లిఖితపూర్వక హామీ ఇస్తామన్న విషయాన్ని గుర్తు చేస్తూ, ఒకవేళ హామీలను గౌరవించకపోతేతదుపరి కార్యాచరణ చేపట్టాల్సి వస్తుం దని హెచ్చరించారు. అయితే, ఢిల్లీలో నమోదైన సుమారు 15 ఎఫ్ఐఆర్‌ల ఉపసంహరణపై ఉన్నతాధికారుల నుంచి అధికారిక ఆదేశాలు వచ్చాకే తదుపరి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

# నిరసనకారులపై బలప్రయోగాన్ని సమర్థించలేం: సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ, జులై 27:** నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై ఢిల్లీలో జరిగిన విద్యార్థుల నిరసనల్లో పోలీసులు బలప్రయోగం చేశారన్న ఆరోపణలపై సుప్రీంకోర్టు సోమవారం కీలక వ్యాఖ్యలు చేసింది. శాంతియుతంగా, చట్టబద్ధంగా జరిగే నిరసనల్లో పాల్గొనడం ప్రతి పౌరుడికీ రాజ్యాంగం కల్పించిన హక్కు అని స్పష్టంచేసింది. కేవలం ఆందోళన జరుగుతోందనే కారణంతో లాఠీచార్జ్‌కు దిగడం సరికాదని పేర్కొంది. పోలీసులు హద్దులు మీరి వ్యవహరించి ఉంటే స్వతంత్రంగా దర్యాప్తు జరగాలని సూచించింది. విద్యార్థులు, కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) చేపట్టిన 'సంసద్ చలో' నిరసన సందర్భంగా జరిగిన పోలీసు చర్యలపై దాఖలైన పిటిషన్లను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనతో కూడిన ధర్మాసనం విచారించింది. దేశవ్యాప్తంగా నిరసనల సమయంలో పోలీసులు అనుసరించాల్సిన విధానంలో ఏకరూపత అవసరమని అభిప్రాయపడింది. నిరసన జరిగిందనే కారణంతో బలప్రయోగం చేయడం సమర్థనీయం కాదని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా గాయపడిన పోలీసుల కుటుంబాల తరఫున వాదించేందుకు వచ్చిన న్యాయవాదికి కూడా కోర్టు అనుమతి ఇచ్చింది. విద్యార్థులకైనా, పోలీసులకైనా గాయాలు కావడం సమానంగా ఆందోళనకరమేనని జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ వ్యాఖ్యానించారు. నిరసనలను ఎదుర్కొనే పోలీసులకు హెల్మెట్లు వంటి రక్షణ పరికరాలు ఎందుకు అందించలేదని రాష్ట్రాలను ప్రశ్నించే అంశాన్ని కూడా పరిశీలిస్తామని తెలిపారు. ఈ వ్యవహారానికి సంబంధించిన అన్ని పిటిషన్లను మంగళవారం కలిపి విచారించనున్నట్లు సుప్రీంకోర్టు వెల్లడించింది.

# 'ఇ20 పెట్రోల్'తో లబ్ధి ఆరోపణలు, బాంబే హైకోర్టును ఆశ్రయించిన గడ్కరీ

**ముంబై, జులై 27:** తన పేరును 'ఇ20 పెట్రోల్' కార్యక్రమంతో ముడిపెడుతూ సోషల్ మీడియాలో ప్రచారమైన పోస్టులు, డీప్‌ఫేక్ వీడియోలపై కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ న్యాయపోరాటానికి దిగారు. తనతోపాటు కుటుంబసభ్యులు ఇ20 విధానం వల్ల లబ్ధిపొందినట్లు తప్పుడు ప్రచారం చేశారని ఆరోపిస్తూ బాంబే హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యవహారంపై మెటాతోపాటు ఇతర సోషల్ మీడియా వేదికలు, గుర్తుతెలియని వ్యక్తులపై సివిల్ దావా వేయడానికి హైకోర్టు అనుమతిచ్చింది. ఇ20 ఇథనాల్ కార్యక్రమంవల్ల తన కుటుంబం లాభపడిందంటూ సోషల్ మీడియాలో అసత్య ప్రచారం జరిగిందని పిటిషన్‌లో పేర్కొన్నారు. వాస్తవానికి ఇథనాల్ మిశ్రమ ఇంధన విధానాన్ని కేంద్ర పెట్రోలియం, సహజవాయు మంత్రిత్వ శాఖ అమలు చేస్తోందని వివరించారు. ఈ పోస్టులు డీప్‌ఫేక్ కంటెంట్ ముంబైలో కూడా అందుబాటులో ఉండటంతో బాంబే హైకోర్టుకు ఈ కేసును విచారించే అధికారం ఉందని గడ్కరీ తరఫు న్యాయవాది వాదించారు. ఈ వాదనలు విన్న జస్టిస్ అభయ్ అహుజా.. సివిల్ సూట్ దాఖలు చేసేందుకు అనుమతి మంజూరు చేశారు.

# పాట్నాలో ఎకె47 ఉపయోగించిన కానిస్టేబుల్ సస్పెన్షన్



**పాట్నా,జులై 27:** నీట్ పరీక్ష అక్రమాలపై బిహార్‌లో జరిగిన విద్యార్థుల నిరసనల సందర్భంగా ఏకే47తో కాల్పులు జరిపిన పోలీసు అధికారిని సస్పెండ్ చేశారు. ఈ ఘటనపై రాజ్యసభ ఎంపీ మనోజ్ కుమార్ ఝా సుప్రీంకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. జులై 25న నిర్వహించిన బిహార్ బంద్ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి సంఘాలు ఆందోళనలు చేపట్టాయి. పలు చోట్ల పోలీసులు, నిరసనకారులకు మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. లాఠీచార్జ్, టియర్ గ్యాస్, వాటర్ క్యానన్లను పోలీసులు వినియోగించారు. సివాన్‌లో జరిగిన కాల్పుల్లో ముగ్గురు గాయపడగా వారిలో 15 ఏళ్ల మహ్మద్ ఆరిఫ్ మెడలో బుల్లెట్ తగిలింది. శస్త్రచికిత్స ద్వారా బుల్లెట్‌ను తొలగించారు. ప్రస్తుతం అతడి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో ప్రతిపక్ష నేత తేజస్వీ యాదవ్ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా స్పందిస్తూ ఢిల్లీలో విద్యార్థులపై పెల్లెట్ గన్స్, బిహార్‌లో ఏకే47 వినియోగించడం ప్రభుత్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. మరోవైపు ఘటనపై శాఖాపరమైన విచారణ ప్రారంభించినట్లు పోలీసులు వెల్లడించారు. ఆయుధ వినియోగం నిబంధనలకు అనుగుణంగానే జరిగిందా లేదా అనే అంశాన్ని విచారణలో తేల్చనున్నట్లు తెలిపారు.

# జెన్జీ సిజెపి ఉద్యమానికి పొరుగుదేశాల్లోను ప్రశంసలు



**న్యూఢిల్లీ,జులై 27:** భారత జెన్‌జీ తమ బలహీనతలనే బలంగా మార్చుకుంది. పరీక్షా పత్రాల లీకేజీపై వారు చేసిన వినూత్న ఉద్యమం, కేంద్ర ప్రభుత్వాన్ని కదిలించి ఏకంగా విద్యాశాఖ మంత్రి రాజీనామాకు దారితీసింది. ఈ ఉద్యమ ప్రభావం కేవలం దేశానికే పరిమితం కాలేదు. సరిహద్దులు దాటి పాకిస్థాన్, శ్రీలంక, నేపాల్ వంటి పొరుగు దేశాల యువతను సైతం ఆకర్షించి, వారి నుంచి ప్రశంసలు అందుకుంటోంది. కాక్రోచ్ జనతా పార్టీ సీజేపీ పేరుతో మొదలైన ఈ ఉద్యమంలో మీమ్స్ మేనిఫెస్టోలుగా, రీల్స్ నియామక సాధనాలుగా మారాయి. పోలీసుల చర్యలకు సంబంధించిన షార్ట్ వీడియోలు ఆధారాలుగా నిలిచాయి. ఈ వినూత్న పోరాట పటిమ ఇప్పుడు పొరుగు దేశాల్లో హాట్ టాపిక్‌గా మారింది. భారత జెన్‌జీ ఉద్యమంపై పాకిస్థాన్ నుంచి అనూహ్యమైన స్పందన వస్తోంది. అక్కడి యువత భారత యువతరం ధైర్యాన్ని, ఐక్యతను చూసి ముగ్ధులవుతున్నారు. మీరు ఇలాగే అద్భుతమైన పనులు చేస్తుంటే, మేం మిమ్మల్ని ఎలా ద్వేషించగలం బహుశా ప్రేమలో పడతామేమోనని ఒక పాకిస్థానీ యువతి చెప్పడం విశేషం. కులం, మతం వంటి విభేదాలను పక్కనపెట్టి భారత విద్యార్థులు ఏకతాటిపై నిలవడాన్ని వారు ప్రత్యేకంగా ప్రశంసిస్తున్నారు. ఈ ఉద్యమానికి పాకిస్థాన్ నిధులు ఇస్తోందని కొందరు అంటున్నారు. మా దేశాన్ని నడుపుకోవడానికే మా దగ్గర డబ్బు లేదు. ఇక మీకెలా ఇస్తామని బిలాల్ హసన్ అనే కంటెంట్ క్రియేటర్ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. 2022లో ఆర్థిక సంక్షోభంపై పోరాడి ప్రభుత్వాన్ని గద్దె దింపిన శ్రీలంక యువతకు, భారత జెన్‌జీ ఉద్యమం తమ పోరాటాన్ని గుర్తు చేస్తోంది. అక్కడి కార్టూనిస్టులు, సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు భారత యువతకు మద్దతుగా పోస్టులు పెడుతున్నారు. ముంబైలో పోలీసు వ్యాన్‌ను ఒక యువతి ఒంటరిగా అడ్డుకున్న ఫొటోను, చైనాలోని చారిత్రక ట్యాంక్ మ్యాన్ ఫొటోతో పోలుస్తూ ప్రశంసిస్తున్నారు. నేపాల్ యువత కూడా భారత విద్యార్థుల ఆవేదనను అర్థం చేసుకుం టోంది. విద్యార్థులు రోడ్లపైకి రావడం చూస్తుంటే గుండె తరుక్కు పోతోంది. మీ పోరాటం సరైనదే. మీ లక్ష్యం ఏమిటో ఎప్పుడూ మర్చిపోవద్దని నేపాల్‌కు చెందిన ఓ కంటెంట్ క్రియేటర్ ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొన్నాడు.



# పార్లమెంటులో ధర్మేంద్ర ప్రధాన్‌కు ఘనస్వాగతం

## జైరామ్ రమేష్ వ్యాఖ్యలకు ప్రధాన్ కౌంటర్

**న్యూఢిల్లీ,జులై 27:** నీట్ పేపర్ లీకేజీ వివాదం నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేసిన ధర్మేంద్ర ప్రధాన్‌కు సోమవారం పార్లమెంటులో ఘన స్వాగతం లభించింది. చిరునవ్వుతూ కారు దిగిన ధర్మేంద్ర ప్రధాన్, అందరికీ అభివాదం చేస్తూ లోపలికి వెళ్లారు. పలువురు అధికార పక్ష ఎంపీలు ఆయనకు సంఘీభావం తెలుపుతూ శాలువా కప్పి, సంప్రదాయ టోపీతో సత్కరించారు. ఎలాంటి ఆరోపణలు లేకపోయినా ఒక మంత్రి స్వచ్ఛందంగా రాజీనామా చేయడం ఇదే మొదటిసారని ఒక ఎంపీ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో పార్లమెంట్ కారిడార్‌లో కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేశ్, ధర్మేంద్ర ప్రధాన్‌ను ఉద్దేశించి "అప్పుడప్పుడు ఇలా జరుగుతుంటుంది" అని వ్యాఖ్యానించారు. దీనికి ధర్మేంద్ర ప్రధాన్ స్పందిస్తూ, "ఏమీ జరగలేదు. నేను వీధి పోరాటాల నుంచి వచ్చిన యోధుడిని, ఏసీ గదుల్లో కూర్చునే కార్యకర్తను కాదు" అని కౌంటర్ ఇచ్చారు.

# విద్యార్థులపై అణిచివేత ఇంకా ఆగలేదు

## మోడీజీ క్షమాపణలు చెప్పాల్సిందే: రాహుల్ గాంధీ

**న్యూఢిల్లీ,జులై 27:** దేశవ్యాప్తంగా నిరసనలు చేపడుతున్న విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం, బీజేపీ పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు అణచివేత ధోరణిని అవలంబిస్తున్నాయని కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్‌గాంధీ మండిపడ్డారు. విద్యార్థులపై కాల్పులు, లాఠీచార్జీలు, కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన ఆగ్రహించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెడుతూ కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీపై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. బీహార్‌లో నిరసన తెలుపుతున్న విద్యార్థులపై ఏకే47తో కాల్పులు జరిపారని, వందలాది మంది విద్యార్థులను అరెస్టు చేసి వారిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారనే వార్తలు వస్తున్నాయని రాహుల్ గాంధీ అన్నారు. విద్యార్థులందరికీ ప్రధాని మోదీ బహి రంగంగా క్షమాపణ చెప్పాలన్నారు.

# పిఒకెలో లాంగ్ మార్చ్..పరిస్థితులు ఉద్రిక్తం

**ముజఫరాబాద్,జులై 27:** పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ లో పరిస్థితులు మరోసారి ఉద్రిక్తంగా మారాయి. పాక్ అధికారులతో చర్చలు విఫలమవడంతో జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జేఏఏసీ) రావల్‌కోట్ నుంచి ముజఫరాబాద్ వరకు లాంగ్ మార్చ్‌కు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో శాంతియుత నిరసనకారులపై బలప్రయోగం చేయవద్దని యునైటెడ్ కశ్మీర్ పీపుల్స్ నేషనల్ పార్టీ యూకేపీఎన్‌పీ పాకిస్థాన్ ప్రభుత్వాన్ని కోరింది. మీర్‌పూర్ డివిజన్ నుంచి ప్రారంభమైన నిరసన ర్యాలీలు రావల్‌కోట్‌లో కలుసుకున్నాయి. ఈ ర్యాలీని అడ్డుకునేందుకు పాక్‌ప్రభుత్వం రేంజర్స్, ఫ్రంటియర్ కానిస్టేబులరీ (ఎఫ్‌సీ), పంజాబ్ కానిస్టేబులరీ (పీసీ)దళాలను అదనంగా మోహరించినట్లు సమాచారం.

# అమిత్ షా వివరణ కోరుతూ పార్లమెంట్‌లో ప్రతిపక్షాల ఆందోళన

**న్యూఢిల్లీ,జులై 27:** పార్లమెంట్‌లో సోమవారం మరోసారి అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర ప్రతిష్ఠంభన నెలకొన్నాయి. జూలై 20న ఢిల్లీలో జరిగిన ఘటనపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్వయంగా సభలో వివరణ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఉభయ సభల కార్యకలాపాలను అడుకున్నాయి. ఈ మేరకు రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గేపార్లమెంట్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ప్రతిపక్ష పార్టీలు ఈ నిర్ణయం తీసుకున్నాయి. ఇప్పటికే నిర్ణయించిన చర్చల్లో పాల్గొనకుండా, ఢిల్లీలో కాక్‌రోచ్ జనతా పార్టీ చేపట్టిన పార్లమెంట్ మార్చ్ సందర్భంగా పోలీసులు అతిగా వ్యవహరించారనే ఆరోపణలపై కేంద్ర హోంమంత్రి సభలో ప్రకటన చేయాలని పట్టుబట్టాయి.

సోమవారం ఉదయం 11 గంటలకు పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమైన వెంటనే ఉభయ సభల్లో ప్రతిపక్ష సభ్యులు నినాదాలతో ఆందోళనకు దిగారు. దీంతో లోక్ సభ స్పీకర్ ఓంబిర్లా సభా కార్యక్రమాలకు ఆటంకం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని ప్రతిపక్ష సభ్యులను హెచ్చరించారు. తీవ్ర గందరగోళం నెలకొనడంతో లోక్‌సభ, రాజ్యసభలను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు2026ను సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టాం. అన్ని రాజకీయ పార్టీలు చర్చలో పాల్గొని తమ అభిప్రాయాలు వెల్లడించాలని కోరుతున్నామని రిజిజు చెప్పారు. పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలను కట్టడి చేసేందుకు కఠినమైన చట్టాన్ని రూపొందిస్తున్నామని, ఇలాంటి కీలక బిల్లుపై చర్చకు దూరంగా ఉండి సభలో గందరగోళం సృష్టించడం ప్రజలకు మంచి సందేశం కాదని ఆయన స్పష్టం చేశారు.

# సంక్షిప్త వార్తలు

## ఉక్రెయిన్‌ను వదలం..తగిన బుద్ధి చెబుతాం: ఇరాన్



**టెహ్రాన్, జులై 27:** కాస్పియన్ సముద్రంలో తమ వాణిజ్య నౌకపై ఉక్రెయిన్ జరిపిన దాడిలో ఒక నావికుడు మరణించగా, మరొకరు గాయపడినట్లు ఇరాన్ తెలిపింది. ఈ ఘటనపై టెహ్రాన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. తమ దేశ ప్రయోజనాలు, ఆస్తులను కాపాడుకునేందుకు ఎలాంటి చర్యకైనా వెనకాడబోమని స్పష్టంచేసింది. ఈ దాడికి కారణమైన ఉక్రెయిన్ తగిన పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. యుద్ధం మరింత విస్తరించకుండా ఉండాలంటే కీవ్‌ను కట్టడి చేయాలని ఐరోపా దేశాలను ఇరాన్ డిమాండ్ చేసింది.

## చెరువులో పడి ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి

**జైపూర్, జులై 27:** రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. అక్కడి ఓ చెరువులో ఒకే కుటుంబానికి చెందిన నలుగురి మృతదేహాలు లభ్యమవడం తీవ్ర కలకలం రేపుతోంది. అయితే వారంతా ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని పోలీసులు అంచనా వేస్తున్నారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రామ్‌దేవ్రా పోలీసు స్టేషన్ పరిధిలోని లోహర్కి గ్రామంలో ఆదివారం రాత్రి ఈ ఘటన జరిగింది. నీటిలోకి దూకిన నలుగురిలో జస్రాజ్ అనే వ్యక్తి కేకలు వేయడం గమనించి కుటుంబసభ్యులు, స్థానికులు వెంటనే అక్కడకు పరుగెత్తుకెళ్లారు. కానీ చెరువు దగ్గరికి చేరుకునే సరికే వారంతా నీటిలో మునిగిపోయారు.



## అమెరికాలో కాల్పులు, ముగ్గురి మృతి


**వాషింగ్టన్, జులై 27:** అమెరికాలోని సియాటెల్‌లో తుపాకీ సంస్కృతి పడగవిప్పింది. ప్రముఖ పర్యాటక ప్రాంతమైన స్పేస్ నీడిల్ సమీపంలో జరుగుతున్న వార్షిక ఫుడ్ ఫెస్టివల్ దగ్గర దుం డగులు సామూ హిక కాల్పులకు తెగబడటంతో ముగ్గురు ఘటనాస్థలంలోనే ప్రాణాలు కోల్పోగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సందర్భంగా పోలీసులు ఒక దుండగుడిని అరెస్టు చేశారు. స్థానిక కాలమానం ప్రకారం ఆదివారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో ఈ సామూ హిక కాల్పుల ఘటన జరిగింది. వందలాదిగా ఉన్న ఫుడ్‌స్టాళ్లు, లైవ్ మ్యూజిక్ కాన్సర్ట్‌తో కళకళ లాడుతున్న సియాటెల్‌లో అకస్మాత్తుగా తుపాకీ మోతలు వినిపించాయి.

## తాహిర్ హుస్సేన్‌కు శిక్షపై తీర్పును రిజర్వ్ చేసిన కోర్టు




**న్యూఢిల్లీ, జులై 27:** 2020 ఈశాన్య ఢిల్లీ అల్లర్ల సమయంలో ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబి) అధికారి అంకిత్ శర్మ హత్య కేసులో దోషులుగా తేలిన మాజీ ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కౌన్సిలర్ తాహిర్ హుస్సేన్, మరో నలుగురికి విధించాల్సిన శిక్షా పరిమాణంపై ఢిల్లీ కోర్టు సోమవారం తన తీర్పును రిజర్వ్ చేసింది. శిక్షకు సంబంధించిన అంశంపై ప్రాసిక్యూషన్, డిఫెన్స్ తరఫు వాదనలు వివరంగా విన్న తర్వాత జులై 31న తీర్పును వెల్లడిస్తామని కర్కర్‌దూమా కోర్టు అదనపు సెషన్స్ జడ్జి(ఎఎస్‌జె) ప్రవీణ్ సింగ్ తెలిపారు. శర్మ హత్యను 'పక్కాని', 'క్రూరమైన' హత్యగా అభివర్ణిస్తూ, గరిష్ట శిక్షను కోరుతూ ఢిల్లీ పోలీసులు మరణశిక్ష విధించాలని కోర్టును అభ్యర్థించారు.

## రూ.25వేల వరకూ భారత్ కరెన్సీకి నేపాల్‌లో అనుమతి



**ఖాట్మండు,జులై 27:** భారత కరెన్సీ వినియోగంపై నేపాల్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దాదాపు పదేళ్లుగా కొనసాగుతున్న ఆంక్షలను సడలిస్తూ, రూ.200, రూ. 500 విలువైన భారత కరెన్సీ నోట్లను దేశంలోకి తీసుకురావడానికి, తీసుకెళ్లడానికి అనుమతించింది. భారతీయులు, నేపాలీ పౌరులు ఇరుదేశాల మధ్య ప్రయాణించేటప్పుడు రూ.25వేల పరిమితికి లోబడి ఈ నోట్ల ను తమ వెంట ఉంచుకోవచ్చని స్పష్టం చేసింది. ఈ నిర్ణయంతో 2016లో భారత్ చేపట్టిన నోట్ల రద్దు అనంతరం విధించిన నిబంధనలకు తెరపడినట్లయింది.

## బ్యాంక్ ఆఫ్ బరోడా నుంచి ఒక టెరాబైట్ డేటా చోరీ

**ముంబయి,జులై 27:** దేశంలోని ప్రముఖ ప్రభుత్వరంగ బ్యాంకుల్లో ఒకటైన బ్యాంక్ ఆఫ్ బరోడాలో భారీ సైబర్ దాడి జరిగినట్లు ఆరోపణలు వెలువడ్డాయి. బ్యాంక్ వ్యవస్థలోకి చొరబడ్డామని ప్రకటించిన ఓ హ్యాకర్ దాదాపు ఒక టెరాబైట్ కీలక డేటాను డార్క్‌వెబ్‌లో ఉచితంగా అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నాడు. ఇందులో ఖాతాదారుల ఆధార్ నంబర్లు, పేర్లు, రుణాల వివరాలు, సేవింగ్స్, కరెంట్ ఖాతాల సమాచారం, నెట్‌బ్యాంకింగ్, ఎన్ఆర్ఐ, కార్పొరేట్ బ్యాంకింగ్‌కు సంబంధించిన రికార్డులు ఉన్నాయని చెబుతున్నాడు. ఈ డేటా లీక్‌కు సంబంధించిన కొన్ని నమూనా పత్రాలను కూడా హ్యాకర్లు ఆన్‌లైన్‌లో విడుదల చేశారు.



## గురుపౌర్ణమిన 155మందితో సమగ్రయోగా

**తిరుపతి, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** పతంజలి సేవా కార్యకర్తల ఆధ్వర్యంలో 'డయాబెటిస్ రహిత తిరుపతి మిషన్' ప్రారంభిస్తున్నట్లు పతంజలి యోగపీఠ్, హరిద్వార్ కేంద్ర సమన్వయకర్త స్వామి రిత్‌దేవ్ జీ ప్రకటించారు. సమగ్ర యోగా విధానాల ద్వారా తిరుపతిని మధుమేహ రహిత నగరంగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం లక్ష్యమని తెలిపారు. ప్రీడయాబెటిస్, డయాబెటిస్‌తో బాధపడుతున్న వారు ప్రత్యేక యోగా శిబిరంలో నమోదు చేసుకుని వ్యాధి నియంత్రణ, నివారణకు యోగాను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని పతంజలి యోగా సమితి, భారత్ స్వాభిమాన్ జిల్లా ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యోదయ పాఠశాల ప్రాంగణంలో ఘనంగా గురుపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్ఎస్ఎస్ కుటుంబ ప్రబోధన్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్ రాజు మాట్లాడుతూ భారతదేశం తన కుటుంబ విలువలు, సామాజిక వ్యవస్థను పరిరక్షించి బలోపేతం చేయడం ద్వారా ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. పతంజలి యోగపీఠ్, హరిద్వార్ కేంద్ర సమన్వయకర్త స్వామి రిత్‌దేవ్ జీ మాట్లాడుతూ యోగా ప్రచారంలో తిరుపతి జిల్లా విశేష పురోగతి సాధిస్తోందని ప్రశంసించారు. జిల్లాలో 155 మంది యోగా ఉపాధ్యాయులకు విజయవంతంగా శిక్షణ అందించి, వారికి కార్యక్రమంలో ధ్రువ పత్రాలు ప్రదానం చేసినందుకు అభినందనలు తెలిపారు. పతంజలి యోగా రాష్ట్ర అధ్యక్షుడు కైలాష్ రాజ్ పురోహిత్, జిల్లా అధ్యక్షుడు హరి, మహిళా విభాగం అధ్యక్షురాలు రాధిక, ఉపాధ్యక్షురాలు ఉమ, భారత్ స్వాభిమాన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండ్ల సోమేశ్వర్ తదితరులు

## విద్యుత్ సమస్యలకు సత్వర పరిష్కారమే ధ్యేయం

- 'డయల్ యువర్ ఎస్‌పిడిసిఎల్ సిఎండి'లో శివశంకర్ లోతేటి



**తిరుపతి, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** వినియోగదారుల విద్యుత్ సమస్యలను సత్వరం పరిష్కరిస్తున్నామని, ఆ దిశగా చొరవ తీసుకుంటున్నట్లు ఎస్‌పిడిసిఎల్ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. పలువురు వినియోగదారులు మాట్లాడుతూ వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరులో జాప్యం, ఓల్టేజ్ సమస్యలు, విద్యుత్ స్తంభాల మార్పిడి తదితర సమస్యలను సిఎండి దృష్టికి తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా అనంతపురం జిల్లా మాల్యవంతం గ్రామానికి చెందిన శైలజ మాట్లాడుతూ తమ పొలంలో ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను అక్కడి నుంచి వేరే ప్రాంతానికి తరలించాలని అధికారుల దృష్టికి తీసుకువచ్చిన ఐదు రోజుల్లోనే తమ సమస్యకు పరిష్కారం లభించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ, ధన్యవాదాలు తెలియజేశారు. ఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ సిఎండి కార్యక్రమం జరిగింది. సిఎండి శివ శంకర్ లోతేటి మాట్లాడుతూ వినియోగదారుల విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించే విధంగా సంబంధిత సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్లకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. అదేవిధంగా విద్యుత్ బిల్లుల ఆన్లైన్ చెల్లింపుల పట్ల వినియోగదారులకు సంస్థ అధికారులు, సిబ్బంది స్పష్టమైన అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్లు 1912,1800 425 155333కు కాల్ చేయడంగానీ వాట్సాప్ నంబరు 91333 31912కు చాట్ చేయడం, ఎస్‌పిడిసిఎల్ చాట్ బోట్ ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, పరిష్కరించుకోవచ్చని తెలిపారు. డైరెక్టర్లు పి.అయుబ్ ఖాన్, కె.గురవయ్య, కె.రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు కె.ఆదిశేషయ్య, జె.రమణా దేవి, ఆర్.పద్మ, ఎం.మురళి కుమార్, ఎన్.శోభా వాలెంటీనా, సిహెచ్ రామచంద్ర రావు, కె. సంపత్ కుమార్, ఎస్.రమణ, జనరల్ మేనేజర్లు శ్రీకాంత్, చక్రపాణి, భాస్కర్ రెడ్డి, జగదీష్, లత, పిఆర్ఓ తోట మధుసూదన తదితరులు పాల్గొన్నారు.

## రూఫ్ టాప్ సోలార్ పనులు



## ఆగస్టు నెలాఖరులోగా లక్ష్యాన్ని చేరుకోవాలి

- ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి

**తిరుపతి, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎస్‌పిడిసిఎల్ పరిధిలో రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్స్ ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి సూచించారు. కార్పొరేట్ కార్యాలయం నుండి సోమవారం సంస్థ పరిధిలోని తొమ్మిది జిల్లాల అధికారులు, కాంట్రాక్టర్లతో సిఎండి శివశంకర్ లోతేటి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సంస్థ పరిధిలోని నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్య సాయి జిల్లాల్లోని 2.07 లక్షల ఎస్సీ,ఎస్టీ విద్యుత్ వినియోగదారుల గృహాలపై సోలార్ సిస్టమ్స్ ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని ఆయా జిల్లాల సూపరింటెండింగ్ ఇంజనీర్లు, ఇతర అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ పనుల పురోగతిని ఆయా జిల్లాల నోడల్ ఆఫీసర్లు పర్యవేక్షిస్తూ, పనులను త్వరితగతిన పూర్తిచేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది, అధికారులు, కాంట్రాక్టర్లు సమన్వయంతో ఈ యేడాది ఆగస్టు నెలాఖరులోగా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా పనులను పూర్తిచేయని కాంట్రాక్టర్లపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం సంస్థ పరిధిలోని వివిధ జిల్లాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని అధికారులతో సమీక్షించారు. వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్తును సరఫరా చేసేందుకు ప్రాధాన్యతనివ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు పి.అయూబ్ ఖాన్, కె.గురవయ్య, చీఫ్ జనరల్ మేనేజర్ కె.ఆదిశేషయ్య, జె.రమణాదేవి, ఆర్.పద్మ, ఎం.మురళి కుమార్, ఎన్ శోభా వాలెంటీనా, సిహెచ్ రామచంద్రరావు, కె. సంపత్ కుమార్, ఎస్. రమణ, జనరల్ మేనేజర్లు శ్రీకాంత్, చక్రపాణి, జగదీష్, భాస్కర్‌రెడ్డి, లత, 9 జిల్లాల సూపరింటెండింగ్ ఇంజనీర్లు శేషాద్రి శేఖర్, మోజెస్, ప్రదీప్ కుమార్, సుధాకర్, శ్రీనివాసులు, రాఘవేంద్రం, చంద్రశేఖరరావు, సోమశేఖర్‌రెడ్డి, అమర్‌బాబు, అధికారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

# సంక్షేమం అభివృద్ధే కూటమి ప్రభుత్వం లక్ష్యం



**తిరుపతి, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ళలో సంక్షేమ పథకాలు అమలుతో బాటు రాష్ట్ర అభివృద్ధి ప్రధాన లక్ష్యంగా కృషి చేశామని తిరుపతి టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి జెబి శ్రీనివాస్ తెలిపారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ విజయాలపై ఇంటింటికి టిడిపి కార్యక్రమం తిరుపతి నగరంలోని 50వ డివిజన్ తిమ్మినాయుడు పాలెంలో సోమవారం ఉదయం ప్రారంభమైంది. పార్లమెంటర్ అధ్యక్షురాలు పనబాక లక్ష్మి, యాదవ్ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్‌తో కలిసి జెబి శ్రీనివాస్ ప్రజలతో మమేకమయ్యారు.

ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి అర్హులైన ప్రతి ఒక్కరికి అందుతున్న పథకాల గురించి వివరించడంతో బాటు వారికి అందిన పథకాలపై ఆరా తీశారు. సంక్షేమ పథకాలకు సంబంధించిన ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ బిజీ కృష్ణ యాదవ్, యూనిట్ ఇన్‌చార్జ్ ఖాయం వెంకటరత్నం, డివిజన్ అధ్యక్షుడు దండు విజయ్, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, తాతయ్యగుంట ఆలయ ఛైర్మన్ మహేష్ యాదవ్, క్లస్టర్ ఇన్‌చార్జులు పులిగోరు మురళీకృష్ణ, ఆర్సీ మునికృష్ణ, వూకా విజయ్ కుమార్, దంపూరి భాస్కర్ యాదవ్, మునిశేఖర్ రాయల్, టిడిపి నాయకులు, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## బొండా ఉమా వివాదం... త్రిసభ్య కమిటీ ఏర్పాటు

### నేడు వివరణ తీసుకోనున్న పల్లా, నిమ్మల

**విజయవాడ, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బొండా ఉమమహేశ్వరరావు(ఉమా) నుంచి మంత్రి రామానాయుడు, పల్లా శ్రీనివాస్ వివరణ తీసుకోనున్నారు. మాజీ మంత్రి ముద్రగడ్డ పద్మనాభం సంస్మరణ సభలో బొండా ఉమా, వైఎస్సార్సీపీ నేత అంబటి రాంబాబు తదితరులతో కలిసి వేదిక పంచుకున్నారు. 2019లో టిడిపి ఓటమిపై సంచలన వ్యాఖ్యలు చేసారు. ఈ అంశం వివాదాస్పదంగా మారింది. ఈ క్రమంలో ఎమ్మెల్యే బోండా ఉమ, అంబటి రాంబాబు వ్యవహారంపై త్రిసభ్య కమిటీని టిడిపి ఎపి అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఏర్పాటు చేసారు. పల్లాతో కలిపి మంత్రి నిమ్మల, కిలారు రాజేష్‌లతో త్రిసభ్య కమిటీ మంగళవారం సాయంత్రం పార్టీ కేంద్ర కార్యాలయానికి రావాలని బోండా ఉమకు పిలుపు పంపింది. చంద్రబాబు ఆదేశాలతో బొండా ఉమా నుంచి నుంచి మంత్రి రామానాయుడు, పల్లా శ్రీనివాస్ వివరణ తీసుకోనున్నారు. వైఎస్సార్సీపీ నేతలతో వేదిక పంచుకోవడంపై నేతలకు బొండా ఉమా వివరణ ఇవ్వనున్నారు. ఉమా నుంచి వివరణ తీసుకొని నివేదికను చంద్రబాబుకు సమర్పించనున్నారు. గతంలో వైఎస్సార్సీపీ నేతలతో టిడిపి నేతలు వేదిక పంచుకోవటాన్ని అధిష్ఠానం తీవ్రంగా పరిగణించింది. ఘటనలు పునరావృతం కాకూడదని గతంలోనే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

## ఇఎస్ఐ ఆస్పత్రి అప్‌గ్రేడేషన్ చేయండి

- కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయకు

### ఎంపిలు కేశినేని చిన్ని, మాగుంట లేఖ

**విజయవాడ, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడ ఇఎస్ఐ ఆస్పత్రి అప్‌గ్రెడేషన్ చేయాలని లోక్‌సభ సభ్యుడు కేశినేని శివనాథ్ (చిన్ని) కేంద్రాన్ని కోరారు. ఈ మేరకు కేంద్ర కార్మిక శాఖమంత్రి మన్సుఖ్ మాండవీయకు లేఖ రాశారు. ఇఎస్ఐసి మెడికల్ కాలేజ్ ఏర్పాటు చేయాలని కేశినేని చిన్ని కేంద్రానికి తన లేఖలో విజ్ఞప్తి చేసారు. గుణదలలో ఇఎస్ఐ ఆస్పత్రిని 300 పడకల సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిగా మార్చాలని ఎంపి విజ్ఞప్తి చేశారు. విజయవాడ ఇఎస్ఐ ప్రాంగణంలోనే నూతనంగా ఇఎస్ఐసి మెడికల్ కాలేజీ మంజూరుకు అవకాశాలు ఉన్నాయని లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుత ఆసుపత్రి ఆవరణలోనే 25 ఎకరాల భూమి అందుబాటులో ఉందని, అదనపు భూమి అవసరం లేకుండానే నిర్మించవచ్చని ఎంపి కేశినేని చిన్ని స్పష్టం చేశారు. ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు సహా 8 జిల్లాల్లోని 2.88 లక్షల మంది కార్మికులు, 10 లక్షల మంది వారి కుటుంబ సభ్యులకు ఆధునిక వైద్యం అందుబాటులోకి వస్తుందని ఎంపి కేశినేని చిన్ని లేఖలో పేర్కొన్నారు. పార్లమెంట్‌లో కేంద్ర మంత్రిని కలిసి విజయవాడ ఎంపి కేశినేని చిన్ని, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి లేఖను అందజేశారు.

## తిరుమల సమాచారం



### విశ్వప్రియతీర్థస్వామికి టిటిడి పెద్దమర్యాద

**తిరుమల, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆషాడమాసంలో ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి విచ్చేసిన ఉడిపి అద్మార్ మఠం పీఠాధిపతి విశ్వప్రియతీర్థస్వామికి టిటిడి పెద్దమర్యాద చేసింది. సోమవారం శిష్యులతో కలసి తిరుమల ఆలయం వద్దకు విచ్చేసిన స్వామికి టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ పేష్కార్ రామకృష్ణ, అర్చకులు సాంప్రదాయంగా స్వాగతం పలికారు. తొలుత ధ్వజ స్తంభానికి నమస్కరించిన స్వామి ఆనందనిలయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు బహుకరించారు. కలియుగంలో ప్రజలు భక్తిభావంతో మోక్షం పొందాలని అనుగ్రహించారు.

### ఆగస్ట్‌లో రెండు సార్లు గరుడసేవ

**తిరుమల, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏడుకొండల్లో రానున్న ఆగస్ట్ నెలలో రెండు సార్లు గరుడసేవ నిర్వహించనున్నారు. సాధారణంగా నెలలో పౌర్ణమిన గరుడసేవ జరుగుతుంది. ఆగస్ట్‌లో 17వ తేదీ సోమవారం గరుడపంచమి పర్వదినాన ఆరోజు రాత్రి మలయప్పస్వామి గరుడుని అధిరోహించి ఆలయ మాఢవీధుల్లో ఊరేగుతారు. అలాగే 28న శ్రావణ పౌర్ణమి సందర్భంగా పౌర్ణమి గరుడ సేవ అత్యంత వైభవంగా జరగనుంది. సర్వాంగ సుందరంగా ముస్తాబైన మలయప్పస్వామి గరుడ వాహనంపై కొలువుదీరి భక్తులను కటాక్షించనున్నారు. ఈ అపూర్వ ఆధ్యాత్మిక ఘట్టాన్ని కనులారా తిలకించడానికి లక్షలమంది భక్తులకు టిటిడి పిలుపునిచ్చింది. ఆగస్ట్ 28న జరిగే గరుడసేవ బ్రహ్మోత్సవాల గరుడసేవకు ట్రయల్‌రన్‌గా నిర్వహించనున్నారు.



### కపిలేశ్వరస్వామికి గ్రంధి పవిత్ర సమర్పణ

**తిరుమల, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి కపిలేశ్వరస్వామి ఆలయంలో వార్షిక పవిత్రోత్సవాల్లో సోమవారం గ్రంధి పవిత్ర సమర్పణ కార్యక్రమం జరిగింది. వేదమంత్రోచ్చారణలు, మంగళ వాద్యాల నడుమ అత్యంత శాస్త్రోక్తంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో కపిలేశ్వరస్వామిని మేల్కొలిపి, పవిత్ర అభిషేకం నిర్వహించారు. ఆలయ ఆగమ సంప్రదాయాల ప్రకారం నిత్యహోమం, గ్రంధి పవిత్ర సమర్పణ, మూలమూర్తులకు విశేష ఉపచారాలు ఘనంగా చేపట్టారు. పవిత్రోత్సవాల ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పరమేశ్వరుని కృపాకటాక్షాలను పొందారు. సాయంత్రం యాగశాలలో ప్రత్యేక పూజలు, హోమం, లఘు పూర్ణాహుతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ నాగరత్న, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఆలయ అర్చకులు, అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# కొండంత వివాదంలో అరకు కాఫీ రుచులు!

## తిరుమలలో జిసిసి రీటైల్ ఔట్‌లెట్‌కు టిటిడి సుముఖత




**తిరుమల, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** నిత్యం లక్ష మంది వరకు భక్తులు వస్తున్న తిరుమలలో ఇప్పటికే దుకాణాల ఏర్పాటు కొండంత వివాదం రగులుతుండగా సందట్లో సడేమియా అన్నట్లు టిటిడి బోర్డు పెద్దలు, అధికారులు అరకు కాఫీ రిటైల్ ఔట్‌లెట్ ఏర్పాటుకు సుముఖత చూపడం చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే తిరుమలలో సిఆర్ఓ ప్రాంతం సమీపంలో, భక్తుల రద్దీ ఉండే ప్రాంతాల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రెండు మూడు ప్రైవేట్ డెయిరీలతో బాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన పాల ఉత్పత్తుల విక్రయాల ఔట్‌లెట్‌లు నడుస్తున్నాయి.

తాజాగా తిరుమలలో భక్తుల కోసం జిసిసి ఔట్‌లెట్ ఏర్పాటుకు స్థలం ఎంపిక, అనుమతులివ్వడం వెనుక పెద్ద చర్చ మొదలైంది. తిరుమలలో ఏ వ్యాపారం అయినా భక్తుల సందడిపైనే ఆధారపడి నడుస్తుంది. అలాంటిది ఇప్పటికే స్థానికంగా వందల సంఖ్యలో టీ కేటిల్ నడుపుతున్న స్థానికులు ఉన్నారు. కొందరు అద్దెలు కూడా చెల్లించలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఈ సమయంలో తిరుమలలో జిసిసి ఉత్పత్తుల ఔట్‌లెట్ నిర్వహించుకునే అవకాశం దక్కిందనేది కూడా గుప్పుమంటోంది. టిటిడి మాత్రం ఇదీ ప్రభుత్వ నిర్ణయమని, ప్రభుత్వం ఆదేశాలతోనే మన రాష్ట్రంలో గిరిజనులు పండించే స్వచ్ఛమైన అటవీ ఉత్పత్తులకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించామని చెబుతున్నారు. అదేగాక దేవదేవుడు తిరుమలేశుని అవసరాల కోసం గిరిజన సహకార సంస్థ (జిసిసి) నుండి వాటిని కొనుగోలు చేయాలని నిర్ణయం తీసుకుంది. దాదాపు రూ.12.97కోట్లతో నాణ్యమైన సరకులు తీసుకునేందుకు అధికారికంగా ఆమోదముద్ర వేశారు. శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు ఈ స్వచ్ఛమైన గిరిజన ఉత్పత్తులను అందుబాటులో ఉంచాలని ఆలోచనతో నిర్ణయం తీసుకోవడం జరిగింది. తిరుమలలో సిఆర్ఓ ప్రాంతంలో జిసిసి రిటైల్ ఔట్‌లెట్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఏడాది పాటు నామినేషన్ పద్ధతిలో జిసిసి నుండి సరకులను కొనుగోలు చేసి, మార్కెట్లో దొరికే ఇతర బ్రాండ్లతో పోలిస్తే జిసిసి అందించే ఇన్‌స్టంట్ కాఫీ పొడి ధర కాస్త ఎక్కువ. అయినా టిటిడి బోర్డు దీనికే మొగ్గుచూపింది. జిసిసి సరఫరా చేసే సరుకుల నమూనాలను కూడా తిరుమలలోని డబ్ల్యుఎఫ్ పరిశోధనశాలలో పరీక్షించారు. టిటిడి నిబంధనల మేరకు నాణ్యత ఉన్నట్లు క్వాలిటీ మేనేజర్ ధ్రువీకరించడంతో ఇతర బ్రాండ్ల కంటే జిసిసి ఇన్‌స్టెంట్ కాఫీ పొడి ధర కొంత అధికమైనా అందులో కల్తీ లేకపోవడం, జిఐ ట్యాగ్ గుర్తింపుతో అరాబికా కాఫీ కావడంతో టిటిడి బోర్డు పెద్దలు అంగీకారం తెలిపారు. టిటిడి పెద్దల తాజా నిర్ణయంతో తిరుమలకు వచ్చే భక్తులకు జిసిసి ఉత్పత్తులను అందుబాటులో ఉంచేందుకు విక్రయాలకు స్థలాన్ని కేటాయించింది. పిఎసి 2 వద్ద (రెండో న్యూ సత్రం దగ్గర గతంలో దొడ్ల డెయిరీ ఉన్న స్థలంలో) 144 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇనుపషీట్ రూఫింగ్‌తో ఈ ప్రత్యేక దుకాణం అందుబాటులోకి రానుంది. ఇక్కడ గిరిజనులు సేకరించిన స్వచ్ఛమైన తేనె, పసుపు, కుంకుమ, సుగంధ ద్రవ్యాలు తదితర ఉత్పత్తులను భక్తులకు విక్రయిస్తారు.

కేటాయింపు విషయంలో టిటిడి కొన్ని కఠిన నిబంధనలు విధించినట్లు తెలుస్తోంది. తేనె, కుంకుడు కాయల పొడి, ఎండుమిర్చి తదితర వస్తువులను నామినేషన్ పద్ధతిలో తీసుకోవాలని కమిటీ సూచించింది. కుంకుమ పొడి, కారం, పసుపు వంటి వాటిని తగ్గింపు ధరలపైన అందుబాటులోకి తేవాలని చర్చలు జరుగుతున్నాయి.



## అనధికార స్టిక్కర్లపై కొరఢా

**తిరుపతి, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** యాత్రాస్థలం, విద్యాకేంద్రం తిరుపతి నగరంలో పలు రకాలుగా వాహనాలపై స్టిక్కర్లు వేసుకుని పోలీస్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనదారులపై తిరుపతి జిల్లా పోలీసులు కొరఢా ఝుళిపించారు. అంబులెన్స్‌లు కూడా రోగులు లేకున్నా రద్దీ ప్రాంతాల్లో, కూడళ్లలో సైరన్‌లు వేసుకుని వాహనాలతో దూసుకెళుతున్న వారిపై కూడా తనిఖీలు చేశారు. ట్రాఫిక్ డిఎస్పీ కొండయ్యనాయుడు ఆధ్వర్యంలో సిఐలు, ఎస్ఐలు, సిబ్బంది తిరుపతిలోని అనేక ప్రధాన కూడళ్లలో వాహనాలకు ప్రెస్, పోలీస్, జ్యూడీషియల్, ప్రభుత్వ వాహనాలు, ఆన్‌డ్యూటీ గవర్నమెంట్, ఎస్‌పిడిసిఎల్, ఎడ్యుకేషన్, మెడికల్ వంటి తదితర విభాగాలు ఇలా రకరకాల పేరుతో స్టిక్కర్లు వేసుకుని ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి మందుసేవించి తిరుగుతున్నారు. దీనివల్ల నిజమైన ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నట్లు పోలీసులకు అందిన సమాచారం. ఈ సమాచారంతో సోమవారం ఉదయం నుండి మధ్యాహ్నం వరకు తిరుపతి ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. వాహనాలపై ఉన్న అనధికారిక స్టిక్కర్స్ తీసివేశారు. కౌన్సెలింగ్ ఇచ్చారు.



శ్రీకాళహస్తి పురవీధుల్లో దర్శనం ఇస్తున్న ద్రౌపదీదేవి అమ్మవారు

## ద్రౌపదమ్మ వసంతోత్సవం

**శ్రీకాళహస్తి, జులై 28 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తిలో ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం వసంతోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ద్రౌపదమ్మ ఉత్సవ విగ్రహాన్ని పట్టణంలో వైభవంగా ఊరేగింపు జరిపారు. వధువుగా పట్టణ ప్రజలు అమ్మవారిని దర్శించుకొని మొక్కలు తీర్చుకున్నారు.

ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జి లక్ష్మయ్య, ఉత్సవాల ఇన్‌చార్జిలు సుబ్రమణ్యం, దుర్గాప్రసాద్, ఆలయ చైర్మన్ ఎంఎస్‌రెడ్డి దఫేదార్ పాల్గొన్నారు.

## మృత్యుంజయునికి విశేషాభిషేకాలు

**శ్రీకాళహస్తి, జులై 28 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మృత్యుంజయస్వామికి సోమవారం ప్రత్యేకాభిషేకాలు నిర్వహించారు. ఈ అభిషేకాల్లో ఆలయ ఇఓ బికె వెంకటేశులు, భక్తులు విశేషంగా హాజరయ్యారు. తరువాత స్వామి వారికి ప్రత్యేకాలంకారం జరిపారు. వర్షాభావ కారణంగా ఆగస్టు 1న మృత్యుంజ స్వామి ఆలయం వద్ద శత సహస్రఘట్టాభిషేకం నిర్వహించుటకు సన్నాహాలు చేపట్టినట్లు ఇఓ వెంకటేశులు తెలిపారు.



## కృత్రిమమేధ సాంకేతికత పరిశోధనపై డిసెంబర్ 4, 5తేదీల్లో అంతర్జాతీయ సదస్సు



**తిరుపతి, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో డిసెంబర్‌లో 4, 5 తేదీల్లో రెండురోజులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రీసెర్చ్ సంబంధించిన పోస్టర్‌ను సోమవారం వర్సిటీ ఉప కులపతి ఆచార్య వెన్నం ఉమ ఆవిష్కరించారు. "కృత్రిమ మేధస్సులో డేటా, హార్డ్‌వేర్ ఫిన్‌టెక్ సమగ్రతతో నూతన సాంకేతిక సరిహద్దుల అభివృద్ధి" అనే అంశంతో ఈ అంతర్జాతీయ సదస్సు పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం డిఎస్టీ క్యూరీఏఐ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ సదస్సు డిసెంబర్ 4, 5 తేదీలలో హైబ్రిడ్ విధానంలో జరగనుంది. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఆర్. ఉష, ఐసిఎఐఆర్ 2026 కన్వీనర్ ఆచార్య పి. వెంకట కృష్ణ పాల్గొన్నారు. ప్రత్యక్ష వర్చువల్ విధానాల్లో పరిశోధనా పత్రాల ప్రదర్శనకు అవకాశం కల్పించనున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, హార్డ్‌వేర్, ఇంటెలిజెంట్ సిస్టమ్స్, ఫిన్‌టెక్ అభివృద్ధి చెందుతున్న అంతరశాఖ పరిశోధనా రంగాల్లో తాజా పరిశోధనలు, సాంకేతిక పరిణామాలు, ఆవిష్కరణలపై చర్చించేందుకు పరిశోధకులు, అధ్యాపకులు, పరిశ్రమ నిపుణులు, పాలసీ మేకర్స్, పారిశ్రామికవేత్తలు విద్యార్థులను ఒకే వేదికపైకి తీసుకురావడం ఈ సదస్సు ప్రధాన ఉద్దేశ్యం. సదస్సులో ఏఐ డేటా సైన్స్, ఏఐ హార్డ్‌వేర్ ఇంటెలిజెంట్ సిస్టమ్స్, ఫిన్‌టెక్ అండ్ ఎఐడ్రివెన్ ఫైనాన్షియల్ సిస్టమ్స్, ఎమర్జింగ్ ఇంటర్‌డిసిప్లినరీ ఏరియాస్ అనే నాలుగు ప్రధాన ట్రాక్‌లలో పరిశోధనా పత్రాలను ఆహ్వానిస్తున్నారు.

ఉత్తమ పరిశోధనలకు బెస్ట్ పేపర్ అవార్డు, బెస్ట్ స్టూడెంట్ పేపర్ అవార్డు, బెస్ట్ ఉమెన్ రీసెర్చర్ ప్రజెంటేషన్ అవార్డు, బెస్ట్ ఇండస్ట్రీ ఇన్నోవేషన్ పేపర్ అవార్డులను అందించనున్నారు. పూర్తి పరిశోధనా పత్రాల సమర్పణకు ఆగస్టు 10 గడువుగా నిర్ణయించారు. ఎంపికైన పత్రాల వివరాలను సెప్టెంబర్ 10న తెలియజేస్తారు. కెమెరారెడీ పేపర్ సమర్పణకు సెప్టెంబర్ 30 చివరి తేదీగా నిర్ణయించారు. ఉపకులపతి ఆచార్య వి.ఉమ, రిజిస్ట్రార్ ఆచార్య ఆర్. ఉష దేశ, విదేశాలకు చెందిన అధ్యాపకులు, పరిశోధకులు, రీసెర్చ్ స్కాలర్లు, విద్యార్థులు, పరిశ్రమ నిపుణులు ఆవిష్కర్తలు తమ పరిశోధనా పత్రాలను సమర్పించి సదస్సులో చురుకుగా పాల్గొనాలని కోరారు.

## గ్రామాభివృద్ధి..ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**-గుంటూరు..కృష్ణా జిల్లాల ఎమ్మెల్సీ ఆలపాటి రాజే ంద్రప్రసాద్**

కొల్లిపర,జూలై 27 ప్రభాతవార్త: గ్రామాభివృద్ధి..ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగుతుందని గుంటూరు..కృష్ణా జిల్లాల ఎమ్మెల్సీ ఆలపాటి రాజే ంద్రప్రసాద్ అన్నారు.సోమవారం మండల పరిధిలోని అత్తోట గ్రామ పరిధిలోని కమతంవారిపాలెంలో కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాల పాలనపై చేపట్టిన ఇంటింటి తెలుగుదేశం కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ నాయకులతో కలసి గ్రామంలో



నిర్వహించారు.ప్రతి ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరిస్తూ కూటమిపాలనపై వివరిస్తూ కరపత్రాలను అందజేస్తూ ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుంటూ ముందుకు సాగారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఆలపాటి మాట్లాడుతూ పేద ప్రజలు జీవన విధానం మెరుగుపర్చాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నట్లు చెప్పారు.పేద ప్రజలను అన్ని విధాల ఆదుకోవటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు.ప్రజల ఆశలకు అణుగుణంగా మోదీ ప్రభుత్వ సహకారంతో చంద్రబాబునాయుడు,పవన్‌కళ్యాణ్‌తో రాష్ట్రంలో డబల్ ఇంజన్ సర్కార్ పాలన సాగుతుందని చెప్పారు.నాడు సూపర్‌సిక్స్‌లో ఏమైతే చెప్పాయో వాటిని అన్నింటినీ కూటమి ప్రభుత్వం అమలు చేసిందన్నారు.కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీను నెరవేర్చుతున్నట్లు చెప్పారు.పెన్షన్‌ను రూ.4 వేలు పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కిందన్నారు.కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి,దుగ్గిరాల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వంగా సాంబిరెడ్డి,టీడీపీ జిల్లా కార్యదర్శి కంచర్ల అమృతరాజు,ఎంపీటీ సభ్యుడు బొల్లిముంత వెంకటేశ్వరరావు,బొల్లు యోగానందచటర్జీ,ఉయ్యూరు శ్రీనివాసరెడ్డి,ఆరిమండ వెంకటరెడ్డి,నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న దస్తావేజు లేఖర్ల పెన్‌డౌన్

గురజాల, జూలై 27 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖలో తీసుకొచ్చిన జీవో నెం.396ను వెంటనే రద్దు చేయాలని కోరుతూ స్థానిక దస్తావేజు లేఖర్లు నిర్వహిస్తున్న పెన్‌డౌన్ కొనసాగుతూనే ఉంది. ఈనెల 20వ తేదీన ప్రారంభమైన పెన్‌డౌన్ 31వ తేదీ వరకు కొనసాగించనున్నట్లు లేఖర్లు తెలిపారు. పిపిపి విధానం వలన



ప్రజల ఆస్తుల వివరాలు గోప్యంగా ఉండవని, వారి ఆస్తులకు భద్రత కరువవుతుందని లేఖర్లు అన్నారు. నూతన జీవోతో లేఖర్లు, స్టాంపు వెండర్లు, డీటీపీ ఆపరేటర్ల జీవితాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే జీవో 396ను ఉపసంహరించుకోవాలని కోరారు.

## కారంపూడి మండల సమగ్రాభివృద్ధే ధ్యేయం..!

**చిన్నగార్లపాడులో శ్రేణుల సంబరాలు ఇంటింటికీ టీడీపీ ప్రచారంలో జూలకంటి..!**

కారంపూడి, జూలై 27, ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో కారంపూడి మండల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగిందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పునరుద్ఘాటించారు. ఇంటింటికీ తెలుగుదేశం – ప్రతి ఇంటికీ జూలకంటి కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల పరిధిలోని చిన్నగార్లపాడు గ్రామం నుంచి మొదటి రోజు ప్రచారాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. ముందుగా పేటసన్నెగండ్ల అడ్డరోడ్డు వద్ద కొలువుదీరిన శ్రీ ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ర్యాలీగా బయలుదేరారు. ఈ ర్యాలీ పెదకొదమగండ్ల, చినకొదమగండ్ల మీదిగా కూటమి పార్టీల శ్రేణులు, ప్రజలు, అభిమానుల భారీ వాహన శ్రేణితో చిన్నగార్లపాడు గ్రామానికి చేరింది. అనంతరం గ్రామంలో తల్లికి వందనం, ఉచిత బస్ ప్రయాణం ద్వారా లబ్ధిపొందిన మహిళలు ఎమ్మెల్యే



జూలకంటికి హారతులు పట్టి, ఘనంగా స్వాగతం పలికారు. ఆ తరువాత డోర్ టూ డోర్ తిరిగి గ్రామంలో అందించిన రూ. 9.09 కోట్ల సంక్షేమాన్ని, చేపట్టిన రూ. 56 లక్షల అభివృద్ధి పనుల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2024 ఎన్నికల్లో ఆరాచకమా..? అభివృద్ధా..? అంటే అభివృద్ధికే ప్రజలు పట్టం కట్టారన్నారు. మాచర్ల నియోజకవర్గాన్ని చంబల్ లోయగా మార్చి సాగిస్తున్న రాక్షస పాలనకు చరమగీతం పాడి, ప్రజలు కూటమికి జై కొట్టారని చెప్పారు. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని ప్రజాస్వామ్య శ్రేయస్సు కోసం, వారి సంక్షేమం కోసం వినియోగిస్తున్నామని తెలిపారు. ప్రజాధారణ కోల్పోయిన జగన్.. ప్రజల మధ్య, ప్రాంతాల మధ్య చిచ్చు పెడుతున్నారని మండిపడ్డారు. లెవన్ రెడ్డి పిచ్చి పరాకాష్టకు చేరి, ప్రజా రాజధానిపై విష ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్థిక ఉగ్రవాది ముఖ్యమంత్రి అయితే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏ విధంగా విధ్వంసానికి గురవుతుందో ప్రజలు బాగానే గమనించారన్నారు. తండ్రి శవాన్ని పక్కన పెట్టుకుని, రాజకీయాలు చేసిన రాక్షసుడికి సుపరిపాలన బాధ్యతలు గురించి ఏం తెలుసని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సాగునీటి పంపిణీ కమిటీ చైర్మన్ పగులూరు అంజయ్య, ఎంపీపీ బొర్రెడ్డి శ్రీనివాసరావు, మాచర్ల మార్కెట్ యార్డ్ చైర్మన్ మధుసూదన్ యాదవ్, దుర్గి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మునుగోటి సత్యనారాయణ, పంగులూరు పుల్లయ్య, మండల పార్టీ అధ్యక్షుడు గోళ్ల సురేష్ యాదవ్, చప్పిడి రాము, బాలకృష్ణ, తండా మస్తాన్ జానీ, శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

## దళితులపై దాడులు అమానుషం

**దాడి చేసిన వారిపై తక్షణమే ఎస్సీ, ఎస్ టి యాక్ట్ కేసు నమోదు చేయాలి**

**విలేకరుల సమావేశంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము చంద్రశేఖర్**

కారంపూడి, జూలై 27, ప్రభాతవార్త: కారంపూడి దళితులపై జరుగుతున్న దాడులు అమానుషమని వైఎస్ఆర్సిపి ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము చంద్రశేఖర్ అన్నారు. సోమవారం వైఎస్ఆర్సిపి కార్యకర్త పల్లపాటి సంసోన్ అతని భార్య జ్యోతి పేట సన్నీ గళ్ళ గ్రామం పోతురాజు గుట్ట నుండి నరసరావుపేటకు వైద్యశాలకు వెళుతుండగా టిడిపి కార్యకర్త వాహనాన్ని ఆపి కులం పేరుతో దూషించి, దాడి చేయడం జరిగిందని ఆయన అన్నారు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఎస్సీ ఎస్టీ



అట్రాసిటీ కేసు నమోదు చేయాలని అన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు కొంగర సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సంసోను పై టిడిపి కార్యకర్త దాడి చేయడం, కులం పేరుతో దూషించటం బాధాకరమని ఆయన అన్నారు. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి చొరవ తీసుకొని ఇలాంటి సంఘటనలు జరగకుండా చూడాలని అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్లో టిడిపి కార్యకర్తపై ఫిర్యాదు చేశారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షుడు బొమ్మిన అల్ల య్య, చిలుకూరు చంద్రశేఖర్ రెడ్డి, మందాల అంజిరెడ్డి, లంక నాగేశ్వరరావు, మిద్దెపోగు ప్రవీణ్, దారి వేముల కిరణ్, సుదర్శన్, నందిగాం ఇసాక్, మురికిపూడి కోటయ్య, కడియం యాకోబు తదితరులు పాల్గొన్నారు.

## బడుగుల ఆత్మగౌరవానికే ప్రాధాన్యత..! ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

కారంపూడి, జూలై 27, ప్రభాతవార్త: బడుగు బలహీన, అణగారిన వర్గాల ఆత్మగౌరవానికే కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చెప్పారు. మండల పరిధిలోని ఒప్పిచర్ల గ్రామంలో శీది, శీగి, తీది కులాల వారు అనాదిగా స్మశాన వాటిక లేక అనేక ఇబ్బందులు పడుతూ.., వివక్షను ఎదుర్కొంటున్నారు. వారు అనాదిగా పడుతున్న సమస్యలు ఎమ్మెల్యే జూలకంటి దృష్టికి తీసుకురాగా ఆయన తక్షణమే స్పందించి, స్థానిక తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్ ను భూమి



కేటాయించాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో వారందరికీ కులాలవారీగా దాదాపు 52 సెంట్ల ప్రభుత్వ భూమిని మంజూరు చేస్తూ హక్కు ధృవీకరణ పత్రాలను స్థానిక ఆర్ అండ్ బి బంగ్లా సోమవారం ఎమ్మెల్యే అందజేశారు.ఎమ్మెల్యే జూలకంటి చేతుల మీదగా పట్టాలు అందుకున్న వారిలో చెంచులు 10 సెంట్లు,ఎరుకల 10 సెంట్లు,బుడగజంగాలు 8 సెంట్లు, మాల 8 సెంట్లు, రజకులు 5 సెంట్లు, నాయి బ్రాహ్మణులు 2, విశ్వబ్రాహ్మణులు 2, గంగిరెద్దుల2 ఉన్నారు. స్మశానానికి స్థల కేటాయించిన కూటమి ప్రభుత్వానికి, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు పంగులూరి పుల్లయ్యకు ఈ సందర్భంగా వారందరూ కృతజ్ఞతలు తెలియజేశారు.

## పంచాయతీరాజ్ కమిషనర్‌ను కలిసిన రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట కార్యవర్గ సభ్యులు

చిలకలూరిపేట, జూలై 27, ప్రభాతవార్త: పంచాయతీ రాజ్ కమిషనర్ ఎం కృష్ణ తేజ ని రోటరీ సభ్యులు కలిసి పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఒక ఐదు ఎకరాలు అటవీ భూమి లో సోషల్ ఫారెస్ట్ ను అభివృద్ధి పరచడానికి భూ కేటాయింపు చేయమని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఎం కృష్ణ తేజ ఐఏఎస్ గారు సానుకూలంగా స్పందించి నారు ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు బి రామ సుబ్బారావు చిలకలూరిపేట డిఆర్ఎన్ ఎస్వీఎస్ విద్యా సంఘం అధ్యక్షుల



సుబ్బారావు,ఉపాధ్యక్షులు కందిమల్ల సాంబశివరావు ,ముత్తినేని వెంకటేశ్వర్లు ,. మోహన్ రావు , దండా లక్ష్మీనారాయణ , ఇతర రోటీరియన్స్ పాల్గొన్నారని బి రామ్ సుబ్బారావు అధ్యక్షులు, డాక్టర్ మానం శ్రీనివాసరావు కార్యదర్శి తెలిపారు.

## భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంతో ఉత్తరాంధ్ర రూపురేఖలే మారిపోతాయి: ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జూలై 27, ప్రభాతవార్త: ప్రధాని మోదీ విజయనగరం పర్యటన, భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవం .. బహిరంగ సభా ఏర్పాట్లు, ఇతర కార్యక్రమాల నిర్వహణ బాధ్యతల్లో భాగంగా కూటమి ప్రభుత్వం తనకు అప్పగించిన బాధ్యతల్లో భాగంగా శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఆదివారం విజయనగరంలో పర్యటించారు. ఆయనతో పాటు టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా స్థానిక శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, మాజీమంత్రి ప్రత్తిపాటిని ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రత్తిపాటి, కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, పీవీజీ కుమార్ లు విజయనగరం కూటమి శ్రేణులతో సమావేశమై, ప్రధాని సభ విజయవంతానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. రాష్ట్ర ఖ్యాతి జాతీయస్థాయిలో మార్మోగేలా ప్రధాని పర్యటనను విజయవంతం చేద్దాం ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ... పూసపాటి అశోక్ గజపతిరాజు నిజాయితీ, క్రమశిక్షణ, పట్టుదలతో



ఉన్నతస్థానాలకు ఎదిగారని, వారి కుటుంబ సహయసహకారాలు, చంద్రబాబు చేయూతతో విజయనగరం అభివృద్ధిలో మేటిగా నిలిచిందన్నారు. కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రిగా గతంలో అశోక్ గజపతిరాజు సమర్థవంతమైన పనితీరు కనబరిచి దేశానికి ఉత్తమ సేవలు అందించారని ప్రత్తిపాటి కొనియాడారు. భోగాపురం విమానాశ్రయం ఏర్పాటుతో ఉత్తరాంధ్ర రూపురేఖలే మారిపోతాయని, స్థానిక యువతకు మంచి ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రత్తిపాటి పేర్కొన్నారు. ఆగస్ట్ 1న భోగాపురంలో కూటమిప్రభుత్వం నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేస్తున్న భారత ప్రధాని నరేంద్రమోదీకి గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి శ్రేణులు ఘనస్వాగతం పలకాలని ప్రత్తిపాటి సూచించారు. మన ప్రియతమ నాయకులు చంద్రబాబు నాయకత్వంలో గతంలో దేశంలో ఎక్కడా లేని విధంగా, కనీవినీ ఎరుగని తరహాలో మోదీ పర్యటన ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయన్నారు. ప్రధాని విజయనగరం గడ్డపై అడుగుపెట్టింది మొదలు.. తిరిగి వెళ్లే వరకు కూటమి నాయకులు, కార్యకర్తలు అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రతి కార్యక్రమాన్ని ఊహకందని రీతిలో విజయంతం చేయాలని ప్రత్తిపాటి పిలుపునిచ్చారు. ప్రధాని పర్యటనకు ప్రభుత్వం ప్రత్యేకంగా నియమించిన మంత్రుల, నోడల్ అధికారులు, జిల్లా కలెక్టర్, పోలీస్ యంత్రాంగానికి ధీటుగా కూటమి శ్రేణులు సర్వశక్తులు ధారపోసి, రాష్ట్ర ఖ్యాతిని జాతీయస్థాయిలో ఇనుమడింపచేయాలని ప్రత్తిపాటి కూటమి శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. కొన్ని లక్షల మంది తరలివచ్చే ప్రధాని బహిరంగసభ విజయవంతంలో విజయనగరం వాసుల ప్రత్యేకత కనిపించాలన్నారు. ప్రధాని పర్యటనలో భాగంగా ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు పేరిట ఏర్పాటు చేసే సాంస్కృతిక కార్యక్రమాల్లో విజయనగరం కళాకారుల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలవాలని ప్రత్తిపాటి ఆకాంక్షించారు.

## డా. ఏ.పి.జె. అబ్దుల్ కలాం వర్ధంతి

చిలకలూరిపేట, జూలై 27, ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ మైనార్టీ సెల్ ఆధ్వర్యంలో భారత మాజీ రాష్ట్రపతి, మిసైల్ మ్యాన్ డా. ఏ.పి.జె. అబ్దుల్ కలాం గారి వర్ధంతి సందర్భంగా చిలకలూరిపేటలో ఘనంగా నివాళులర్పించారు. ముందుగా మాజీ మంత్రి వర్యులు, చిలకలూరిపేట శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు క్యాంప్ కార్యాలయం నందు డా. ఏ.పి.జె. అబ్దుల్ కలాం గారి చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. అనంతరం చిలకలూరిపేట రైతు బజారు ఎదురుగా ఉన్న డా. ఏ.పి.జె. అబ్దుల్ కలాం గారి విగ్రహానికి



పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు మాట్లాడుతూ, డా. ఏ.పి.జె. అబ్దుల్ కలాం సాధారణ కుటుంబంలో జన్మించి తన కృషి, అంకితభావం, పట్టుదలతో దేశ అత్యున్నత పదవిని అధిరోహించి కోట్లాది మంది యువతకు స్ఫూర్తిగా నిలిచారని అన్నారు. శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా దేశ అభివృద్ధికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. యువత పెద్ద లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధనకు నిరంతరం శ్రమించాలని కలాం గారు ఇచ్చిన సందేశం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, మైనార్టీ సెల్ ప్రతినిధులు, కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొన్నారు.

## చందవరంలో కార్డన్ సెర్చ్

చిలకలూరిపేట, జూలై 27, ప్రభాతవార్త: చిలకలూరిపేట నియోజకవర్గం నాదెండ్ల మండలం చందవరం గ్రామంలో డీఎస్పీ హనుమంతరావు గారి ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించిన పోలీసులు .గ్రామంలోని ప్రతి గడపని క్షుణ్ణంగా పరిశీలించి



ఏమైనా అసాంఘిక కార్యక్రమాలు కానీ,మారణాయుధాలు కానీ ఉన్నాయేమో అని క్షుణ్ణంగా పరిశీలించారు.మరియు సరైన పత్రాలు లేని 23 ద్విచక్ర వాహనాల్ని స్వాధీనం చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో పలువురు సీఐలు,ఎస్ఐలు,మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## 5అమ్మవారిని శాకాంబరీ దేవి గా అలంకారం



చిలకలూరిపేట, జూలై 27, ప్రభాతవార్త: నాదెండ్ల మండలం ఎండుగుంపాలెం గ్రామంలో ఉన్న శ్రీ గంగా పార్వతి సమేత ఓంకారేశ్వర స్వామి వారి ఆలయం లో పార్వతి దేవి కి అమ్మవారి జన్మ నక్షత్రం మూలా నక్షత్రం సందర్భంగా అమ్మవారిని శాకాంబరీ దేవి గా అలంకారం చేసి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అమ్మవారి అలంకరణ కార్యక్రమం లో ఆలయ పూజారి పేటేటి కృష్ణ, వివేక్ లు పాల్గొనగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హరిహరసుత అయ్యప్ప స్వామి మహా పడిపూజ

చిలకలూరిపేట, జూలై 27, ప్రభాతవార్త: చిలకలూరిపేట పట్టణంలోని, పాటిమీద, వెంకటచారినగర్ నందు వేంచేసియున్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం నందు ఆలయ నిర్మాణ కమిటీ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ హరిహరసుత అయ్యప్ప స్వామి మహా పడిపూజా, 18 మెట్ల పడిపూజ, కలశ, అభిషేక కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని అయ్యప్పస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి,



స్వామి వారికి పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు జరిపించి, స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించిన శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు .

## మార్షల్ ఆర్ట్స్ లో మోడరన్ స్టెల్లార్ విద్యార్థులకు బంగారు పతకాలు

చిలకలూరిపేట, జూలై 27, ప్రభాతవార్త:
మండపేట శ్రీవత్స కన్వెన్షన్ హాల్ లో జరిగిన" స్టేట్ లెవెల్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్ షిప్"లో మోడరన్ స్టెల్లార్ విద్యార్థులు 9వ తరగతికి చెందిన గుంజి.కార్తీక్, వై. జాహ్నవి ఎనిమిదవ తరగతికి చెందిన గుంజి.మోహన్ కృష్ణ మరియు నాలుగవ తరగతికి చెందిన వై. హరిణి నాలుగు బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు.కుంగ్ ఫు,కరాటే వంటి క్రీడల వలన విద్యార్థులలో సంజ్ఞ నైపుణ్యాలు, శారీరక దృఢత్వం,స్వీయ రక్షణ, ఒత్తిడి తగ్గుదల, సమన్వయ లక్షణాలు పెంపొందుతాయని విద్యార్థులు చిన్నప్పటి నుండి విద్యతో




## లయన్స్ క్లబ్ ఆఫ్ మాచర్ల చెన్నకేశవ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

మాచర్ల టౌన్ , జూలై 27,ప్రభాతవార్త లయన్స్ క్లబ్ ఆఫ్ మాచర్ల చెన్నకేశవ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం రాత్రి మాచర్లలోని ఏబీసీ హాస్పిటల్ ప్రాంగణంలో నిరాడంబరంగానిర్వహించారు.ఈ కార్యక్రమంలో 2026-27 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుని ప్రమాణ స్వీకారం చేయించారు.క్లబ్ అధ్యక్షుడిగా లయన్ డాక్టర్ గుర్రం రాజశేఖరరెడ్డి, కార్యదర్శిగా లయన్ ఎం. వెంకటపుల్లారావు, కోశాధికారిగా లయన్ పి. అనిల్ కుమార్, ఉపాధ్యక్షుడిగా హనీఫ్ బాధ్యతలు స్వీకరించారు.అదేవిధంగా నూతన సభ్యులుగా డాక్టర్ విష్ణు,డాక్టర్ వెంకటేష్,డాక్టర్ హరీష్,ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ జున్నా



చక్రధర్ రెడ్డి,డిగ్రీ కళాశాల డైరెక్టర్ కుర్రి పవన్ కుమార్ రెడ్డి,ప్రముఖ వ్యాపారవేత్త మొహిద్దీన్ లయన్స్ క్లబ్ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు.ఈ కార్యక్రమానికి ఇన్‌స్టాలేషన్ ఆఫీసర్‌గా డాక్టర్ రామచంద్రరెడ్డి వ్యవహరించగా, కార్యక్రమ పర్యవేక్షణను డాక్టర్ కమలన్‌రావు నిర్వహించారు.ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ద్వారా సమాజ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టి ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించేందుకు నూతన కార్యవర్గం కృషి చేస్తుందని సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో సాయి లయన్స్ సభ్యులు సాయి మార్కొండరెడ్డి, మకట్‌లాల్, వి.సాంబశివరావు,బి. సుబ్బారావు,నరేంద్ర సింగ్,వెంకట్ నారాయణ,జి.కేశవరెడ్డి,పాశం శ్రీనివాసరెడ్డి,కె.నాగేశ్వరరావు తదితరులు పాల్గొని నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

# అట్టుడికిన రెంటచింతల!

**టిడిపి,బిజెపి పార్టీల మధ్య హోరాహోరీ...**

**ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చొరవతో సద్దుమణిగిన వివాదం**

రెంటచింతల జులై 24, ప్రభాతవార్త : మండల కేంద్రమైన రెంటచింతలలోని ప్రధాన రహదారి విస్తరణ పనులలో భాగంగా బిజెపి జండా దిమ్మను పగలగొట్టడాన్ని నిరసిస్తూ భాజపా నేతలు రహదారి రాకపోకలను నిలిపివేశారు.సుమారు మూడు గంటల పాటు బిజెపి తెలుగుదేశం పార్టీ నాయకుల మధ్య హోరాహోరీగా మాటల యుద్ధం జరిగింది పరిస్థితి సర్దుమనగకపోవడంతో డి.ఎస్.పి,సిఐ,ఎస్ఐ ల నేతృత్వంలో స్పెషల్ బ్రాంచ్ పోలీసులు రంగ ప్రవేశంతో మాటలు యుద్ధం శాంతించింది.విద్యుత్ తీగలకు సంబంధించి స్తంభాలు అమర్చేందుకు అడ్డుగా ఉందన్న కారణంతో బిజెపి జెండా దిమ్మను తమకు తెలియకుండా ప్రొక్లైన్ తో తీసివేయడాన్ని బిజెపి నాయకులు మండిపడ్డారు. సమాచారం అందుకున్న జిల్లా అధ్యక్షులు ఏలూరి శశికుమార్,మండల అధ్యక్షులు ఇగుటూరి రాజశేఖర్ రెడ్డి, మరియు నాయకులు వెంటనే స్పందించి సంఘటన స్థలానికి చేరుకొని మాకు తెలియకుండా జండా దిమ్మెను తొలగించడం ఏమిటని గర్జించగా స్పందించిన తెలుగుదేశం



పార్టీ నాయకులు సుమంత్ రెడ్డి,రాయపరెడ్డి సౌరెడ్డి,రామకృష్ణ లు దీటుగా సమాధానమిచ్చారు విద్యుత్ స్తంభానికి అడ్డు వచ్చిన దిమ్మెను కాంట్రాక్టర్ తొలగిస్తే దానికి తెలుగుదేశం పార్టీకి సంబంధం ఏమిటి అన్నారు.ఇలా ఎదురెదురు రెట్టించుకుంటూ రాకపోకలను నిలిపివేసి భారత్ మాతాకీ జై అంటూ బిజెపి నాయకులు బిగ్గరగా నినాదాలు చేశారు. కూటమి లో ఉన్న రెండు పార్టీల నాయకుల మధ్య భిన్నాభిప్రాయాలు రాకుండా ఉండేందుకు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి గురజాల డి.ఎస్.పి ఎం మహేశ్వరావు తో ఫోన్ లో మాట్లాడి సమస్యను త్వరితగతిన పరిష్కరించాల్సిందిగా కోరారు.రహదారి విస్తరణ పనులు జరుగుతున్న క్రమంలో ఆక్రమంలో ఉంటే తొలగిస్తారని ఇందులో వివాదాలకు తావివ్వకూడదని డిఎస్పి ఎం మహేశ్వరరావు చెప్పారు.పంతాలకు పట్టింపులకు పోకుండా క్లిష్ట పరిస్థితులలో సంయమనం పాటించి వాతావరణం ప్రశాంతంగా ఉండేలాగా చూడాలన్నారు.పబ్లిక్ కు ఇబ్బంది పెట్టే పనులను చేయకూడదని అంతర్గతంగా సమస్యలు పరిష్కరించుకోవాలని తెలిపారు.సోషల్ మీడియాలో అసత్య ఆరోపణలు రెచ్చగొట్టే పోస్టులను పెట్టినవారిని విచారిస్తామని తెలిపారు.

## విజయపురిసౌత్‌లో ఇంటింటికీ తెలుగుదేశం

విజయపురిసౌత్, జూలై 27, ప్రభాతవార్త: పర్యాటక అభివృద్దే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టిడిపి యువ నాయకులు జూలకంటి గౌతమ్ రెడ్డి ప్రారంభించారు.కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అందించిన సంక్షేమం,సాధించిన ప్రగతిపై ప్రజలకు వివరించేందుకు అధినేత చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదేశాల మేరకు సోమవారం మండల పరిధిలోని విజయపురిసౌత్ నందు ఇంటింటికి తెలుగుదేశం, ప్రతి ఇంటికి జూలకంటి కార్యక్రమాన్ని యువ నాయకులు గౌతమ్ చేపట్టారు. ముందుగా అంబేద్కర్ సెంటర్ నందు ఉన్న శ్రీ రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి,ప్రచారాన్ని ప్రారంభించారు.అశేషంగా తరలివచ్చిన ప్రజలు, కూటమి పార్టీల తో కలిసి ఫిల్టర్ ఆఫీస్ లైన్, తండాలో పర్యటించి అభివృద్ధి,సంక్షేమ పథకాలను ప్రజలకు అర్థమయ్యేలా చెప్పారు. ఈ



కార్యక్రమంలో మాచర్ల మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గుండాల శ్రీనివాస్ యాదవ్, మండల అధ్యక్షులు వీరాస్వామి, బొల్లా వెంకటేశ్వర్లు చౌదరి, బొబ్బిలి చంద్రశేఖర రావు, సత్తిబాబు,సుధాకర్ రెడ్డి, రామచంద్ నాయక్, రామిశెట్టి సైదారావు, రావుల శ్రీనివాసరావు,కోదండ రమా నాయక్ ,కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

మాచర్ల రూరల్.జూలై 27, ప్రభాతవార్త:మాచర్ల రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోని దస్తావేజు లేఖరులు, స్టాంపు వెండర్లు, కంప్యూటర్ ఆపరేటర్ల సంఘం సభ్యుల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘం నూతన అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యవర్గ సభ్యుల ఎన్నిక కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశంలో సభ్యులందరి ఏకాభిప్రాయంతో మాచర్ల దస్తావేజు లేఖరులు, స్టాంపు వెండర్లు, కంప్యూటర్ ఆపరేటర్ల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షులుగా గుండాల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా రాయపాటి శివ, కార్యదర్శిగా కొమెర రమేష్, సంయుక్త కార్యదర్శిగా అప్పిరెడ్డి రామిరెడ్డి, కోశాధికారిగా వడ్డెంగుంట శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు సంఘం అభివృద్ధి, సభ్యుల సంక్షేమం, దస్తావేజు లేఖరుల సమస్యల పరిష్కారం



కోసం సమిష్టిగా కృషి చేస్తామని తెలిపారు. సంఘ సభ్యులు నూతన కార్యవర్గానికి అభినందనలు తెలియజేస్తూ, వారి నాయకత్వంలో సంఘం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.జి.ఓ. నెం.396 రద్దు పై మాచర్ల దస్తావేజు లేఖరుల సమ్మె.మాచర్ల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోని దస్తావేజు లేఖరులు, స్టాంపు వెండర్లు, కంప్యూటర్ ఆపరేటర్ల జీవో నెంబర్ 396 రద్దుకై గత కొద్ది రోజులుగా నిర్వహిస్తున్న సమ్మెను కొనసాగించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దస్తావేజు లేఖరుల అసోసియేషన్ జి.ఓ. నెం.396 రద్దుకై చేస్తున్న పోరాటానికి సంబంధించి అసోసియేషన్ తీసుకున్న ప్రతి నిర్ణయానికి పూర్తిగా కట్టుబడి ఉండాలని సభ్యులందరూ కోరారు. అలాగే, అసోసియేషన్ నిర్ణయం అమలులో ఉన్నంత వరకు ఎటువంటి దస్తావేజుల తయారీ, పీడీఈ దస్తావేజుల సిద్ధీకరణ, అలాగే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో దస్తావేజుల సమర్పణ చేపట్టరాదని సమావేశంలో పాల్గొన్న సభ్యులందరూ ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఈ నిర్ణయం అమల్లో ఉన్నంత వరకు అసోసియేషన్ సూచనలను ప్రతి సభ్యుడు విధిగా పాటించాలని సమావేశంలో స్పష్టం చేశారు. జి.ఓ. నెం.396కు సంబంధించి రాష్ట్ర అసోసియేషన్ నుంచి వచ్చే తదుపరి ఆదేశాలకు అనుగుణంగా భవిష్యత్ కార్యాచరణ కొనసాగుతుందని సమావేశంలో వెల్లడించారు.

## విజయపురిసౌత్ నూతన ఎస్సైగా గిరిబాబు

విజయపురిసౌత్ , జూలై 27, ప్రభాతవార్త: విజయపురిసౌత్ నూతన ఎస్సైగా జి. గిరిబాబు సోమావారం భాద్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.గ్రామంలో ప్రజలందరూ ఎలాంటి గొడవలు, అల్లర్లు సృష్టించకుండా పోలీసులకు సహకరించాలని కోరారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.2018 బ్యాచ్ కు చెందిన ఆయన ప్రస్తుతం పెదకూరపాడు లో ఎస్. ఐ గా విధులు నిర్వహిస్తూ బదిలీల లో భాగంగా పెదకూరపాడు నుండి విజయపురిసౌత్ కు రావటం జరిగింది.ప్రస్తుతం విజయపురిసౌత్ ఎస్.ఐ.గా విధులు నిర్వహించిన డి.అశోక్ ని గుంటూరు జిల్లాకు కు బదిలీ అయ్యారు.



పాటు, వివిధ రంగాలలో నైపుణ్యం సాధించాలని,తద్వారా మనోవికాసం పెంపొందించుకో వచ్చని, స్కూల్ ప్రాంగణంలో జరిగిన ఒక సమావేశంలో పాఠశాల అధినేత శ్రీ చేబ్రోలు మహేష్ గారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ,విద్యార్థులను డైరెక్టర్ ప్రత్యూష, ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి విజయలక్ష్మి ప్రసూన , ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

# టీమిండియా వరుస ఓటములపై.. గంభీర్, శ్రేయస్ అయ్యర్‌లకు చెక్!



**న్యూఢిల్లీ:** టీమిండియా వరుస ఓటములపై సమీక్ష నిర్వహించేందుకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బిసిసిఐ) సిద్ధమైంది. ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనల్లో భారత్ 6 టి20లు, రెండు వన్డేల్లో ఓటమిపాలైంది. 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలోఉంచుకొని విదేశాల్లో భారత జట్టు ప్రదర్శన మెరుగయ్యేందుకు చేపట్టాల్సిన మార్పులు, ఆటగాళ్ల ఎంపిక, వ్యూహాలపై వివరంగా చర్చించనున్నారు. ఈ నేపథ్యంలో ఈ వరుస ఓటముల వెనుక గల కారణాలను బిసిసిఐ ఆరా తీయనుంది. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌తో పాటు, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌లతో అత్యవసర సమావేశం నిర్వహించి వరుస పరాజయాలకు వివరణ కోరాలనే యోచనలో ఉన్నట్లు సమాచారం. భారత జట్టు పేలవ ప్రదర్శనపై భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు అధికారులు తీవ్ర అసంతృప్తిలో ఉన్నట్లు తెలుస్తోంది. జింబాబ్వేతో ప్రస్తుతం జరుగుతున్న టి20 సిరీస్ ముగిసిన వెంటనే ముంబైలోని ప్రధాన కార్యాలయంలో ఈ ఉన్నత స్థాయి సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి టీమిండియా టి20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌తో పాటు, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్, తాత్కాలిక కోచ్ వీవీఎస్ లక్ష్మణ్, సెలెక్టర్లు, బిసిసిఐ అధికారులు హాజరు కానున్నారు. ఈ సమావేశంలో తక్షణ నిర్ణయాలేవి తీసుకోనప్పటికీ గంభీర్, శ్రేయ్యర్ ఇద్దరికీ ఒక గట్టి వార్నింగ్ ఇచ్చే అవకాశం ఉంది. గంభీర్‌కు 2027 వరకు ఒప్పందం ఉన్నం దున అతని పదవికి వచ్చే ముప్పు ఏం లేనప్పటికీ, వన్డే, టి20 క్రికెట్‌లో జట్టు ఘోర ప్రదర్శన ఒత్తిడిని పెంచుతోంది. టెస్ట్‌ల్లో భారత ప్రదర్శన మరీ నాసిరకంగా తయారైంది.

పరిస్థితులు ఇలానే కొనసాగితే 2027 వన్డే ప్రపంచకప్‌లో కూడా భారత్ పేలవ ప్రదర్శన కన బర్చే అవకాశం ఉందనే ఆందోళనలు వ్యక్తమవు తున్నాయి. దాంతోనే గంభీర్‌తో అత్యవసర సమావేశానికి బిసిసిఐ సిద్ధమైనట్లు తెలుస్తోంది. కొత్త టి20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ వైఖరిపై కూడా ప్రశ్నలు తలెత్తే అవకాశం ఉంది. కాకపోతే అతనికి మరికొన్ని సిరీస్‌ల వరకు అవకాశం ఇవ్వవచ్చు. 2026 ఆసియా గేమ్స్‌లో భారత్ గోల్డ్ మెడల్ సాధిస్తే అతనిపై ఉన్న ఒత్తిడి తగ్గనుంది. ఇదే సమయంలో హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ కింద పని చేసే సపోర్ట్ స్టాఫ్ భవితవ్యంపై ఈ సమావేశంలో





## వరల్డ్ కప్ మహిళల పిస్టల్..
# ఈషాకు స్వర్ణం
## మనుకు కాంస్యం

**న్యూఢిల్లీ:** ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్ రైఫిల్/పిస్టల్/షాట్‌గన్ మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో భారత్ డబుల్ పోడియం ఫినిష్‌ను సాధించింది. చైనాలోని హాంగ్‌జౌలో సోమవారం జరిగిన ఈ పోటీల్లో హైదరాబాద్ షూటర్ ఈషా సింగ్ స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకోగా, ఒలింపిక్ పతక విజేత మను భాకర్ కాంస్య పతకాన్ని దక్కించుకుంది. ఎనిమిది మంది షూటర్ల ఫైనల్‌లో ఈషా నిలకడైన ప్రదర్శన కనబరిచి, 40 హిట్‌లతో పోడియంపై అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. హోరాహోరీగా సాగిన ఫైనల్‌లో మను పోరాడి, కీలకమైన షూట్‌ఆఫ్‌లో నెగ్గి, 28 హిట్‌లతో కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. క్వాలిఫికేషన్ రౌండ్‌లో ఇద్దరు భారతీయ షూటర్లు ఆకట్టుకున్నారు, మను 586-20న స్కోరుతో అగ్రస్థానంలో నిలవగా, ఈషా 585-18న స్కోరుతో రెండో స్థానంలో నిలిచి ఫైనల్‌లో తమ స్థానాలను సునాయాసంగా ఖరారు చేసుకున్నారు. ఇక మాజీ ఆసియా క్రీడల ఛాంపియన్ రాహి సర్నోబత్ 582 -16న స్కోరుతో పతకాల రౌండ్‌కు అర్హత సాధించడంలో స్వల్ప తేడాతో విఫలమయ్యాడు. సిమ్రన్‌ప్రీత్ కౌర్ బ్రార్ (576-20న) మరియు అభిజ్ఞా అశోక్ పాటిల్ (573-16న) ర్యాంకింగ్ పాయింట్స్ ఓన్లీ (ఆర్‌పీఓ) విభాగం కింద పోటీపడ్డారు. కాగా 21 ఏళ్ల హైదరాబాదీ షూటర్ ఈషా ఈ సీజన్‌లో అద్భుతమైన ఫామ్‌లో ఉంది. ఈ యేడాది ఆరంభంలో మ్యూనిచ్‌లో జరిగిన ఫైనల్‌లో 43 హిట్స్‌తో సీనియర్, జూనియర్ ప్రపంచ రికార్డులు రెండింటినీ నెలకొల్పి ఆమె చరిత్ర సృష్టించింది. పారిస్ 2024 ఒలింపియన్, అర్జున అవార్డు గ్రహీత అయిన ఈషా, ప్రపంచంలోని అగ్రశ్రేణి పిస్టల్ షూటర్లలో ఒకరిగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది.

## కామన్వెల్త్ గేమ్స్ మహిళల వెయిట్ లిఫ్టింగ్
# జ్ఞానేశ్వరికి రజతం




**న్యూఢిల్లీ:** కామన్వెల్త్ గేమ్స్ 2026 మహిళల 53 కేజీల వెయిట్ లిఫ్టింగ్ ఈవెంట్‌లో భారత క్రీడాకారిణి జ్ఞానేశ్వరి యాదవ్ రికార్డు బ్రేకింగ్ ప్రదర్శనతో రజత పతకాన్ని కైవసం చేసుకుంది. గ్లాస్గోలో సోమవారం జరిగిన స్నాచ్ విభాగంలో జ్ఞానేశ్వరి తన మూడు ప్రయత్నాలలో 82 కేజీలు, 85 కేజీలు, 88 కేజీలను విజయవంతంగా ఎత్తి, ప్రారంభ విభాగం తర్వాత రెండవ స్థానంలో నిలిచింది. నైజీరియాకు చెందిన ఒనోమే ఒమోలోలా డిడిహ్ 93 కేజీలతో అగ్రస్థానంలో నిలవగా, కెనడాకు చెందిన రెబెకా గ్రౌల్క్స్ 83 కేజీలతో మూడవ స్థానంలో నిలిచింది. జ్ఞానేశ్వరి అదే ఊపును క్లీన్ అండ్ జర్క్‌లో కూడా కొనసాగించి, తొలి ప్రయత్నంలో 103 కేజీలను సునాయాసంగా ఎత్తి, రెండవ ప్రయత్నంలో దానిని 107 కేజీలకు మెరుగుపరుచుకుంది. రజత పతకం కోసం జరిగిన పోరులో, జ్ఞానేశ్వరి అత్యంత కీలకమైన సమయంలో తన చివరి ప్రయత్నంలో 111 కిలోల బరువును విజయవంతంగా ఎత్తి సత్తా చాటింది. ఈ ప్రదర్శన ఆమెకు పోడియంపై స్థానాన్ని సంపాదించి పెట్టడమే కాకుండా, ఒక కొత్త వ్యక్తిగత ఉత్తమ ప్రదర్శనను, క్లీన్ అండ్ జర్క్‌లో (111 కిలోలు) ఒక కొత్త భారత జాతీయ రికార్డును, మరియు మొత్తం 199 కిలోల (88 కిలోలు + 111 కిలోలు) బరువుతో ఒక కొత్త జాతీయ రికార్డును నెలకొల్పింది.



## హెచ్‌సిఎ డివిజన్ లీగ్ క్రికెట్‌లో
# రాణించిన శ్రేయ్‌సింగ్

**హైదరాబాద్,జులై 27:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ) ఆధ్వర్యంలో జరుగుతున్న ఏ డివిజన్, బీ డివిజన్ రెండు రోజుల లీగ్ ఛాంపియన్‌షిప్‌లో తొలి రోజు మ్యాచ్‌లు ఆసక్తికరంగా సాగాయి. బ్యాటర్లు భారీ స్కోర్లు నమోదు చేయగా, పలువురు బౌలర్లు ఐదు, ఆరు వికెట్లతో మెరిశారు. వర్షం కారణంగా కొన్ని మ్యాచ్‌లు ఒక్క బంతి కూడా పడకుండానే రద్దయ్యాయి. చార్మినార్ 308 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. జట్టులోని బ్యాటర్ శ్రేయ్‌సింగ్ 97 పరుగులతో శతకాన్ని మిస్‌అయినా 8 బౌండరీలు, మూడు సిక్స్‌లు సాధించి శెహభాష్ అనిపించుకున్నాడు. భావేష్ సేథ్ 88 పరుగులు చేశాడు. రిషబ్ బస్లాస్ 6 వికెట్లు పడగొట్టాడు. ప్రత్యర్థి ఈఎంసీసీ తొలి రోజు ఆట ముగిసే సమయానికి 107/1తో నిలిచింది.ఎ డివిజన్: దయానంద్, స్పోర్టింగ్ ఎలెవన్ విజయాలు రౌండ్ 1 తొలి రోజు మ్యాచ్‌లో ఆర్. దయానంద్ జెమినీ ఫ్రెండ్స్‌పై 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. జెమినీ ఫ్రెండ్స్ 124 పరుగులకు ఆలౌటవగా చిరాగ్ యాదవ్ (52), అవేజ్ అహ్మద్ (40) రాణించారు. ఎం. ధీరజ్ రావు 6/29తో చెలరేగాడు. అనంతరం దయానంద్ 125/4తో లక్ష్యాన్ని చేరుకుంది. రవి తేజ అజేయ అర్ధశతకం (50..) సాధించాడు.స్పోర్టింగ్ ఎక్స్ఐ కూడా ఎస్‌బిఐపై ఐదు వికెట్లతో గెలిచింది. ఎస్‌బిఐ 133 పరుగులకు ఆలౌట్ అవగా తనయ్ త్యాగరాజన్ 5/14తో అద్భుత బౌలింగ్ చేశాడు. అనంతరం యశ్ సత్వాలేకర్ (52) అర్ధశతకంతో స్పోర్టింగ్ ఎక్స్ఐ 19.4 ఓవర్లలోనే విజయాన్ని అందుకుంది.బడ్డింగ్ స్టార్ 43 ఓవర్లలో 142/2తో బలమైన స్థితిలో నిలిచింది. జైరామ్ కశ్యప్ (70), విభాన్ ఆదిత్య వర్మ (32 నాటౌట్) రాణించారు.కేంబ్రిడ్జ్ ఎక్స్ఐ 256 పరుగులు చేయగా, ఆశ్లేష్ వామన్ 73, అర్వాన్ సత్వాలేకర్ 59 రాణించారు. ఇంపీరియల్ తొలి రోజు 18 పరుగులు వికెట్ నష్టపోకుండా చేసింది.డెక్కన్ వాండరర్స్ 37 ఓవర్లలో 246/3తో భారీ స్కోరు సాధించింది. నితీష్ రెడ్డి 112 బంతుల్లో 107 పరుగులతో శతకం నమోదు చేయగా, సాయి శరణ్ 68, హర్షిత్ చౌదరి 44 పరుగులు చేశారు.ఉమ్మడి రెండు జిల్లాల జట్లు కూడా తొలి ఇన్నింగ్స్‌లో వరుసగా 117, 230 పరుగులుచేశాయి. ఏఓసీఎవర్‌గ్రీన్, ఎస్‌సీఆర్ఎస్ఏడెక్కన్ క్రానికల్‌మ్యాచ్‌లు తడి మైదానం కారణంగా ఒక్క బంతికూడా పడకుండానే రద్దయ్యాయి.

## కామన్వెల్త్ బాక్సింగ్‌లో..
# క్వార్టర్ ఫైనల్స్‌కు సచిన్

**న్యూఢిల్లీ:** కామన్వెల్త్ గేమ్స్‌లో పురుషుల 65 కేజీల బాక్సింగ్ ఈవెంట్‌లో భారత్ బాక్సర్ సచిన్ సివాచ్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాడు. బాక్సింగ్‌ఈవెంట్‌లో 26 యేళ్ల క్రీడాకారుడు, సోమవారం ఇక్కడ స్కాటిష్ ఈవెంట్ క్యాంపస్‌లో జరిగిన పోరులో అద్భుతమైన ప్రదర్శన కనబరిచి, ఇంగ్లాండ్‌కు చెందిన విలియం హెవిట్‌ను 4-1 పాయింట్ల తేడాతో ఓడించి క్వార్టర్ ఫైనల్స్‌కు దూసుకెళ్లాడు. హెవిట్ వేసిన రెండు వేగవంతమైన పిడిగుద్దులు ఒకటి కుడి నుంచి, మరొకటి ఎడమ నుంచి పోటీ గమనాన్ని నిర్దేశించాయి. తర్వాత సచిన్ రింగ్‌లో తెలివిగా కదులుతూ ఆంగ్లేయుడిపై దాడికి దిగి తన పంచ్‌లను విజయవంతంగా సంధించాడు. అదే సమయంలో హెవిట్ స్పష్టంగా పంచ్‌లు కొట్టడం కష్టతరం చేశాడు. చివరిలో, సచిన్ పూర్తి నియంత్రణలోఉండి, పక్కలనుండి వరుసగా పదునైన పంచ్‌లు విసురుతూ, పాయింట్ల విషయంలో న్యాయనిర్ణేతలు తనకు అనుకూలంగా తీర్పు ఇచ్చేలా ఒత్తిడి తెచ్చాడు. రెండో రౌండ్‌లో హెవిట్ దూకుడుగా బరిలోకి దిగి, భారత ఆటగాడిని కలవరపెట్టే ప్రయత్నంలో అతనిపైకి దూసుకెళ్లాడు. కానీ సచిన్ సంయమనం కోల్పోకుండా ఆ ఒత్తిడిని తట్టుకుని, తన స్థానాన్ని తిరిగి పొంది, సరైన స్కోరింగ్ ప్రదేశాలను అత్యంత సునాయాసంగా లక్ష్యంగా చేసుకుని విజయం సాధించాడు.


# పాలిమర్ కరెన్సీ నోట్లకు తొలి అడుగు




## రూ.10, రూ.20 నోట్లపై పైలట్ పరీక్షలు

**న్యూఢిల్లీ,జులై 27:** భారతదేశంలో పాలిమర్ కరెన్సీ నోట్ల ప్రవేశానికి కేంద్ర ప్రభుత్వం తొలి అడుగు వేసింది. ఆర్బీఐ ప్రతిపాదించిన మేరకు రూ.10, రూ.20 విలువ కలిగిన తలా 100 కోట్ల పాలిమర్ నోట్లను ప్రయోగాత్మకంగా విడుదల చేయ డానికి కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆమోదం తెలి పింది. కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరీ లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానంలో వెల్లడించారు. ప్రస్తుత పరిస్థితుల్లో పాలిమర్ నోట్లు ఎలా పనిచేస్తాయో అంచనా వేయడానికి ఈ ప్రయోగాత్మక విడుదల చేపడుతున్నట్లు తెలిపారు. ఫీల్డ్ ట్రయల్స్ విజయవంతమైతేనే దేశవ్యాప్తంగా విస్తృతంగా ప్రవేశపెట్టే అంశంపై నిర్ణయం తీసుకుం టామని ప్రభుత్వం స్పష్టం చేసింది.ఈ నిర్ణయంతో పాలిమర్ నోట్లపై ఆర్‌బిఐ పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభించనున్నట్లు గతంలో వెలువడిన వార్తలకు అధికారిక ధృవీకరణ లభించింది. ఆర్‌బిఐ ప్రకారం, పాలిమర్ నోట్లు ప్రస్తుతం వినియోగిస్తున్న కాగితపు నోట్ల కంటే ఎక్కువ కాలం మన్నికగా ఉంటాయి. అధిక నగదు లావాదేవీలు జరిగే దేశాల్లో పాలిమర్ నోట్ల జీవితకాలం ఎక్కువగా ఉండటంతో వాటి వినియోగం ప్రయోజనకరమని అంతర్జాతీయ అనుభవాలు సూచిస్తున్నాయని తెలిపింది.అయితే పాలిమర్ నోట్ల ప్రవేశంతో కాగితపు నోట్లను పూర్తిగా రద్దు చేయాలనే ఉద్దేశం లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రస్తుతం ఉన్న కాగితపు కరెన్సీతో పాటు పాలిమర్ నోట్లు కూడా చలామణిలో ఉంటాయని, కాగితపు నోట్ల స్థానంలో పూర్తిగా పాలిమర్ నోట్లను తీసుకురావాలనే ప్రతిపాదన లేదని పేర్కొంది.పాలిమర్ నోట్లు డిజిటల్ చెల్లింపులపై ఎలాంటి ప్రభావం చూపుతాయో ఇప్పుడే చెప్పడం సాధ్యం కాదని ఆర్‌బిఐ తెలిపింది. అవి సాధారణ చలామణిలోకి వచ్చిన తర్వాత మాత్రమే దీనిపై సమగ్ర అంచనా వేయవచ్చని పేర్కొంది.భౌతిక కరెన్సీ మరియు డిజిటల్ చెల్లింపులు ఒకదానికొకటి ప్రత్యామ్నా యాలు కాకుండా పరస్పర అనుబంధ వ్యవస్థలని, భవిష్యత్తులో కూడా రెండూ కలిసి కొనసాగుతా యని ఆర్‌బీఐ అభిప్రాయపడింది.

## కోల్ ఇండియా తొలి త్రైమాసిక లాభం రూ.8,852 కోట్లు
### ఒక్కో షేరుకు రూ.5.50 మధ్యంతర డివిడెండ్



**న్యూఢిల్లీ,జులై 27:** ప్రభుత్వ రంగ బొగ్గు కంపెనీ కోల్ ఇండియా స్వల్ప లాభాల వృద్ధిని నమోదు చేసింది. కంపెనీ నికర లాభం గత యేడాది ఇదే కాలంతో పోలిస్తే 0.6 శాతం పెరిగి రూ.8,852 కోట్లకు చేరింది. షేర్‌హోల్డర్లకు కంపెనీ ఒక్కో ఈక్విటీ షేరుపై రూ.5.50 మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. డివిడెండ్‌కు అర్హులైన వాటాదారులను నిర్ణయించేందుకు జులై 31ని రికార్డు తేదీగా నిర్ణయిం చింది. డివిడెండ్ మొత్తాన్ని ఆగస్టు 25, 2026లోపు చెల్లించనున్నట్లు తెలిపింది.తొలి త్రైమాసిక ఆర్థిక ఫలితాలు మొత్తం ఆదాయం 7.8 శాతం పెరిగి రూ.46,255 కోట్లకు చేరింది. గత యేడాది ఇదే కాలంలో ఇది రూ.42,919 కోట్లు. ఎబిట్డా 4.1శాతం తగ్గి రూ.12, 069 కోట్లకు పరిమితమైంది. గత యేడాది ఇది రూ.12,588 కోట్లు. ఎబిట్డా మార్జిన్ 29.3 శాతం నుంచి 26.1 శాతానికి తగ్గింది. నికర లాభం 0.6 శాతం పెరిగి రూ.8,852 కోట్లకు చేరింది. ఒక్కో షేరుకు రూ.5.50 మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. షేరు స్వల్ప లాభంతో ముగింపుత్రైమాసిక ఫలితాల అనంతరం కోల్ ఇండియా షేరు ధర సోమవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి 0.02 శాతం పెరిగి రూ.427.50 వద్ద స్థిరపడింది. ఇదే సమయంలో ఎన్ఎస్ఈ నిఫ్టీ50 సూచీ 0.96 శాతం లాభపడింది. రోజంతా కంపెనీ షేరు రూ.425.75 నుంచి రూ.431.00 మధ్య ట్రేడైంది. ప్రారంభంలో రూ.429.50 వద్ద ప్రారంభమైన షేరు, అంతకుముందు ముగింపు ధర రూ.427.40గా ఉంది.



## నాలుగురెట్లు పెరిగిన బిలియనీర్ టాక్స్ పేయర్లు

**న్యూఢిల్లీ,జులై 27:** దేశంలో యేడాదికి రూ.100 కోట్లకు పైగా ఆదాయం ప్రకటిస్తున్న పన్ను చెల్లింపుదారుల సంఖ్య గత ఐదేళ్లలో గణనీయంగా పెరిగింది. ఈ సంఖ్య దాదాపు నాలుగు రెట్లు పెరిగినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లిఖితపూర్వక సమాధానంలో ఈ వివరాలు వెల్లడించారు. 2025-26 అసెస్‌మెంట్ సంవత్సరంలో రూ.100 కోట్లకు మించి వార్షిక ఆదాయం ప్రకటించిన వారి సంఖ్య 576కు చేరిందని తెలిపారు. 2021-22లో ఈ సంఖ్య 142 మాత్రమే ఉండేదని చెప్పారు. అంటే ఐదేళ్ల వ్యవధిలో దాదాపు 300 శాతం పెరుగుదల నమోదైందని వివరించారు. 2022-23లో ఈ సంఖ్య 301కు చేరగా, తర్వాత ఏడాది స్వల్పంగా తగ్గి 284గా నమోదైంది. ఆ తర్వాత 2024-25లో 415కు పెరిగి, గత యేడాది 576కు చేరింది.

ఆదాయపు పన్ను చట్టం 2025లో బిలియనీర్ అనే పదానికి ప్రత్యేక నిర్వచనం లేదని కేంద్రం స్పష్టం చేసింది. అందువల్ల ఆదాయపు పన్ను రిటర్నుల్లో రూ.100 కోట్లకు పైగా ఆదాయం ప్రకటించిన వ్యక్తుల వివరాలను మాత్రమే అందించినట్లు పేర్కొంది. ఈ గణాంకాలు పన్ను రిటర్నుల ఆధారంగా సేకరించినవేనని వెల్లడించింది. దేశంలో ఆదాయ అసమానతలపై అడిగిన ప్రశ్నకు కూడా కేంద్రం సమాధానం ఇచ్చింది. హౌస్‌హోల్డ్ కన్సప్షన్ ఎక్స్‌పెండిచర్ సర్వే ప్రకారం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆదాయ అసమానత తగ్గినట్లు తెలిపింది. అలాగే 15 ఏళ్లు పైబడిన వారి నిరుద్యోగ రేటు 3.1 శాతానికి తగ్గిందని వెల్లడించింది. ఉపాధి కల్పన, ప్రగతిశీల పన్ను విధానం, ఆరోగ్యం, విద్య, గృహ నిర్మాణం, గ్రామీణాభివృద్ధిపై ప్రభుత్వ వ్యయం పెంచడం ద్వారా సమ్మిళిత ఆర్థిక వృద్ధికి కృషి జరుగుతున్నట్లు కేంద్రం వివరించింది.

# ఐదు రోజుల నష్టాలకు బ్రేక్




## లాభాల్లో ముగిసిన దేశీయ మార్కెట్లు..

**ముంబయి,జులై 27:** ముడి చమురు ధరల తగ్గుదల, ఐటీ షేర్ల ర్యాలీతో జోష్ దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం ఐదు వరుస ట్రేడింగ్ సెషన్ల నష్టాలకు చెక్ పెడుతూ లాభాలతో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లలో సానుకూల సంకేతాలు, ముడి చమురు ధరలు భారీగా తగ్గడం, భౌగోళిక ఉద్రిక్తతలు సడలడం, తొలి త్రైమాసిక ఫలితాలపై సానుకూల అంచనాలు మార్కెట్లకు మద్దతుగా నిలిచాయి. విదేశీ బ్రోకరేజ్ సంస్థలు ఐటీ రంగ రేటింగ్‌ను 'అండర్‌వెయిట్' నుంచి 'న్యూట్రల్' కు పెంచడంతో ఐటీ షేర్లలో కొనుగోళ్లు పెరిగాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 776.01 పాయింట్లు లాభపడి 76,835.78 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 228.50 పాయింట్లు ఎగిసి 23,995.95 వద్ద స్థిరపడింది. అంతకుముందు వరుసగా ఐదు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 2.67 శాతం, నిఫ్టీ 2.32 శాతం మేర నష్టపోయాయి. నిఫ్టీ లాభాలకు ఎటర్నల్ 5.61, ఇన్ఫోసిస్ 3.59, బజాజ్ ఫైనాన్స్3.57 ప్రధానంగా దోహదపడ్డాయి. బిఎస్ఇ 150 మిడ్‌క్యాప్ సూచీ 1.13 శాతం, బిఎస్ఇ 250 స్మాల్‌క్యాప్ సూచీ 1.34 శాతం పెరిగాయి. ఎన్ఎస్ఇలో 2,259 షేర్లు లాభపడగా, 1,071 షేర్లు నష్టపోయాయి. 116 షేర్లు మార్పులేకుండా ముగిశాయి. కమోడిటీ మార్కెట్లో సెప్టెంబర్ 2026 డెలివరీకి సంబంధించిన బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 7.93 డాలర్లు 8.19 శాతం తగ్గి 88.85 డాలర్లకు చేరింది.విదేశీ మారక మార్కెట్లో రూపాయి డాలర్‌తో పోలిస్తే స్వల్పంగా బలపడింది. రూపాయి విలువ గత ముగింపు 96.5300తో పోలిస్తే 95.9425 వద్ద ట్రేడైంది. ఎంసిఎక్స్‌లో ఆగస్టు 5, 2026 డెలివరీకి సంబంధించిన బంగారం ఫ్యూచర్స్ ధర 0.57 శాతం పెరిగి రూ.1,43,925కు చేరుకుంది. అమెరికా 10 యేళ్ల ప్రభుత్వ బాండ్ యీల్డ్ 0.94 శాతం తగ్గి 4.635 శాతానికి చేరింది.ఈ వారంలో వెలువడనున్న ప్రముఖ టెక్నాలజీ కంపెనీల త్రైమాసిక ఫలితాలు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ ద్రవ్య విధాన సమావేశంపైనా ఇన్వెస్టర్ల ఫోకస్ పెరిగింది. ఫెయిర్‌కెమ్ ఆర్గానిక్స్ త్రైమాసిక లాభాల్లో గణనీయమైన వృద్ధిని నమోదు చేయడంతో షేరు 5 శాతం అప్పర్ సర్క్యూట్‌ను తాకింది.లోధా డెవలపర్స్ సమీకృత నికర లాభం 103.36 శాతం పెరిగి రూ.1,372.1 కోట్లకు చేరడంతో షేరు 5.27 శాతం ఎగిసింది.ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ స్వతంత్ర నికర లాభం 37.03 శాతం పెరిగి రూ.795.95 కోట్లకు చేరడంతో షేరు 5.08 శాతం లాభపడింది. కెనరా బ్యాంక్ తొలి త్రైమాసికంలో నికర లాభం 2.19 శాతం పెరిగి రూ.4,856 కోట్లకు, మొత్తం ఆదాయం 4.26 శాతం పెరిగి రూ.39,684 కోట్లకు చేరడంతో షేరు 1.08 శాతం పెరిగింది.శేషసాయి పేపర్ అండ్ బోర్డ్స్ స్వతంత్ర నికర లాభం 96.89 శాతం పెరిగి రూ.33.59 కోట్లకు చేరడంతో షేరు 3.42 శాతం ఎగిసింది.జెన్ టెక్నాలజీస్ సమీకృత నికర లాభం 27.83 శాతం తగ్గి రూ.34.46 కోట్లకు చేరడంతో షేరు 5 శాతం పడిపోయింది. వేదాంత్ ఫ్యాషన్స్ షేరు 1.19 శాతం, జిందాల్ స్టీల్ షేరు 2.92 శాతం లాభపడ్డాయి. బిర్లా కార్పొరేషన్ సమీకృత నికర లాభం 3.20 శాతం తగ్గడంతో షేరు 5.42 శాతం క్షీణించింది. టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ సమీకృత నికర లాభం 27.78 శాతం పెరిగి రూ.426.98 కోట్లకు చేరడంతో షేరు 1.84 శాతం పెరిగింది.ఎస్‌బీఎఫ్‌సీ ఫైనాన్స్ నికర లాభం 28.98 శాతం పెరిగి రూ.130.12 కోట్లకు చేరినప్పటికీ షేరు 2.01 శాతం నష్టపోయింది.

## సిఇఒ, సిఎఫ్ఒకు జరిమానా




**ముంబయి, జులై 27:** దేశంలోనే ప్రైవేటుబ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ కీలక నిర్ణయం తీసుకుంది. తమ బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శశిధర్ జగదీశన్, చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ శ్రీనివాసన్ వైద్యనాథన్ లపై రూ. 1 లక్ష చొప్పున జరిమానా విధించింది. రిటైల్ అసెట్స్ గ్రూప్ హెడ్ అరవింద్ వోహ్రాపై కూడా ఇదే మొత్తంలో జరిమానా వేసింది. ఈ మేరకు సోమవారం నాడు బ్యాంక్ ఒక ప్రకటన విడుదల చేసింది. మహారాష్ట్ర స్టేట్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి డిపాజిట్లను సమీకరించే విషయంలో జరిగిన అవకతవకలపై బ్యాంకు అంతర్గత విచారణ చేపట్టింది. 2017, 2021 సంవత్సరాల్లో జరిగిన ఈ డిపాజిట్ల సమీకరణపై స్వతంత్ర డైరెక్టర్లతో కూడిన ప్రత్యేక క్రమశిక్షణా కమిటీ దర్యాప్తు నిర్వహించింది. ఈనెల 23న జరిగిన బోర్డు సమావేశంలో ఈ కమిటీ నివేదికను సమీక్షించారు. సంబంధిత అధికారుల ప్రవ ర్తన వ్యాపార పరిధిని దాటడం కిందకు వస్తుందని, ఇందులో ఎలాంటి దురు ద్దేశం లేదా వ్యక్తిగత లాభం లేదని బోర్డు నిర్ధారణకు వచ్చింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించడంలో ఎటువంటి అలసత్వం ఉండకూడదనే ఉద్దేశంతో, కమిటీ సిఫార్సుల మేరకు బోర్డు ఈ నిర్ణయం తీసుకుంది. ముగ్గురు ఉన్నతాధికారులకు జరిమానాతోపాటు హెచ్చరిక లేఖలు జారీచేసింది. ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న ఇతర ఉద్యోగులకు కూడా హెచ్చరిక లేఖలు ఇచ్చింది. విచారణ ఫలితాలను ఆర్‌బీఐకి తెలియజేయాలని బోర్డు ఆదేశించింది.




## టాటా గ్రూప్ ఆదాయం రూ.16.24 లక్షల కోట్లు
## నికర లాభం 52 శాతం వృద్ధి

**న్యూఢిల్లీ, జులై 27:** టాటా గ్రూప్ సమగ్ర స్థాయిలో మరోసారి బలమైన ఆర్థిక ఫలితాలను నమోదు చేసింది. గ్రూప్ మొత్తం ఆదాయం 7.8 శాతం పెరిగి రూ.16,24,030 కోట్లకు చేరగా, పన్నులు చెల్లించిన తర్వాత నికర లాభం 51.9 శాతం పెరిగి రూ.1,70,525 కోట్లకు చేరిందని టాటా సన్స్ చైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ వెల్లడించారు.టాటాగ్రూప్ సంస్థల హోల్డింగ్ కంపెనీ అయిన టాటా సన్స్ వార్షిక నివేదికలో వాటాదారులనుఉద్దేశించి చంద్రశేఖరన్ మాట్లా డారు. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ప్రపంచవ్యాప్తంగా కృత్రిమ మేధ రంగంలో పెట్టుబడుల ప్రవాహం మధ్య కూడా టాటా గ్రూప్ అత్యుత్తమ ఆర్థిక ప్రదర్శన కనబర్చిందన్నారు.

టాటాసన్స్ ఆదాయం 9.1 శాతం పెరిగి రూ.42, 367 కోట్లకు, నికరలాభం 21.8 శాతంపెరిగి రూ.31,961 కోట్లకు చేరింద న్నారు. ఒక్కో షేరుకు రూ.1,10,717 తుది డివిడెండ్ చెల్లించాలని బోర్డు సిఫారసు చేసిందని, దీనికి వాటాదారుల ఆమోదం అవసరమని తెలిపారు. సంస్కరణలు, వ్యాపార పునర్వ్యవస్థీకరణ ఫలితంగానే ఈ వృద్ధి సాధ్యమైందని చెప్పారు. ఎలక్ట్రానిక్స్ తయారీలో వేగంగా ఎదుగుతున్నటాటా గ్రూప్ ఎలక్ట్రానిక్స్ తయారీ వ్యాపారం కేవలం నాలుగేళ్లలోనే రూ.1,31,082 కోట్ల ఆదాయంతో గ్రూప్‌లో నాలుగో అతిపెద్ద సంస్థగా ఎదిగిందన్నారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14